ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

గురువారం 29 అక్టోబర్ 2026
సంపుటి: 28 సంచిక: 190
Thursday 29 octobar 2026
Vol.No 28 Issue No .190
హైదరాబాద్
Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం..

సాయానికి సిద్ధమన్న భట్టి

- ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను
- విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
- తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి
- ఇప్పటికే సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం

మిగతా2లో..

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు..

కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?

- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం
- ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ
- మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్

మిగతా2లో..

హైదరాబాద్ కు తాగునీటి ఢోకా లేదు.. !

- 'ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య రాకూడదు"
- సీఎం రేవంత్ రెడ్డి ఖరాఖండీ ఆదేశాలు!
- రిజర్వాయర్ల నుంచి ఎస్టీపీల వరకు పూర్తి పర్యవేక్షణ
- ట్రీటెడ్ వాటర్ కు టోల్ ఫ్రీ నంబర్!

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 28 : రాజధాని హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించిన సీఎం, రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. వేసవి, ఎల్నినో వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళిక సిద్ధం

మిగతా2లో..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో

సంచలనం

మెరుపు ధర్నా తో రైల్వే నిలయం దద్దరిల్లింది

- పీసీసీ చీఫ్, మంత్రి సహా 6గురు అరెస్ట్!
- ఢిల్లీకి రైళ్లు ఇవ్వడం లేదు...
- కాంగ్రెస్ వర్సెస్ కేంద్రం
- రైల్వే స్టేషన్ రణరంగంగా మారింది!

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 28: సికింద్రాబాద్ రైల్వే నిలయం వద్ద ఈరోజు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నవంబర్ 1వ తేదీన ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ పార్టీ భారీ నిరసనకు హాజరయ్యేందుకు రైళ్లు కేటాయించకుండా కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపిస్తూ, టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మెరుపు ధర్నా నిర్వహించింది. ఈ నిరసనకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా నేతృత్వం వహించారు. దీంతో రైల్వే స్టేషన్ ప్రాంగణం కాంగ్రెస్ కార్యకర్తలతో నిండిపోయి, కొద్దిసేపు పూర్తిగా స్తంభించిపోయింది.

మిగతా2లో..

హైదరాబాద్ లో శాకాహారులకే

ప్రత్యేక ఫ్లాట్లు!

రియల్ ఎస్టేట్ లో కొత్త విప్లవం

- వెజ్ టవర్లు వస్తున్నాయి, నాన్ వెజ్ కు నో ఎంట్రీ!
- కోకాపేట, పుప్పాలగూడ, నల్లగండ్లలో వెజ్ కమ్యూనిటీల హడావిడి
- హైదరాబాద్ లో పెద్ద దుమారం!

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 28: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఇప్పటివరకు ఎన్నడూ లేని కొత్త తరహా నివాస విధానం తెరపైకి వచ్చింది. అదే శాకాహారులకే ప్రత్యేక ఫ్లాట్లు. శాకాహారులకు మాత్రమే ఫ్లాట్లు విక్రయించేలా కొన్ని ప్రత్యేక కమ్యూనిటీల్లో లిప్రత్యేక టవర్ల నిర్మాణంలి జరుగుతున్నట్లు సమాచారం. మాంసాహారం తినే కుటుంబాలకు అక్కడ ఫ్లాట్ దొరకదా? అద్దెకు కూడా ఇవ్వరా? అన్నదే ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న ప్రశ్న. ఈ ఒక్క వార్తతో హైదరాబాద్ లోని మధ్యతరగతి నుంచి ఐటీ ఉద్యోగుల వరకు అందరూ ఒక్కసారిగా షాక్ అవుతున్నారు.

మిగతా2లో..

100 ఏళ్ల కల సాకారం అవుతోంది

గోషామహల్ లో ఉస్మానియా నూతన భవన నిర్మాణం

- మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా పరిశీలన!
- రూ.2,700 కోట్లు - 2,000 పడకలు
- 31 లక్షల చదరపు అడుగులు
- తెలంగాణకు కొత్త వైద్య విప్లవం!

తెలంగాణ స్టేట్ బ్యూరో విజన్ ఆంధ్ర, అక్టోబర్ 28: తెలంగాణ వైద్య చరిత్రలో నిలిచిపోయే మహా ప్రాజెక్ట్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గోషామహల్ లో నూతనంగా నిర్మితమవుతున్న ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులను హైదరా బాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా పరిశీలించారు. ఈ పరిశీలన కేవలం సందర్శన మాత్రమే కాదు, పనుల వేగంపై ప్రభుత్వం ఎంత సీరియస్ గా ఉందో చెప్పే సంకేతంగా మారింది. ఈ పరిశీలనలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసేన్, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, మెట్టు సాయి కుమార్ తో పాటు ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన ఇతర ఉన్నత అధికారులు, ఇంజనీర్లు పెద్ద

మిగతా2లో..

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..

కీలక శాఖలకు కొత్త అధికారులు

- కీలక శాఖలకు కొత్త అధికారులను నియమించిన ప్రభుత్వం
- పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్
- జీహెచ్ఎంసీ బాధ్యతలు సర్ఫరాజ్ అహ్మద్‌కు

హైదరాబాద్, అక్టోబర్ 28 : తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కీలక శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పలువురు

మిగతా2లో..

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు

- కరవు మండలాల జాబితా అశాస్త్రీయమన్న బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబర్ 28 : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా

మిగతా2లో..

హైదరాబాద్ లో చారిత్రక ఒప్పందం!

కస్టమ్స్ శిక్షణా సంస్థ మరియు పోలీస్ అకాడమీ చేతులు కలిపాయి

- శిక్షణకు కొత్త శకం మొదలైంది!
- జ్ఞాన వినిమయం, సంయుక్త శిక్షణ, అధికారుల సామర్థ్యాభివృద్ధే లక్ష్యం
- నార్కోటిక్స్, పోలీస్ రంగానికి మహా ముందడుగు!

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 28: తెలంగాణ శిక్షణా రంగంలో ఇవాళ ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. శిక్షణా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలనే గొప్ప లక్ష్యంతో, సంస్థాగత సహకారాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో హైదరాబాద్ లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జాతీయ కస్టమ్స్, పరోక్ష పన్నులు మరియు నార్కోటిక్స్ అకాడమీ జోనల్ శిక్షణా సంస్థ హైదరాబాద్ మరియు ఆర్.బి.వి.ఆర్.ఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ మధ్య నేడు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంతో ఇకపై కస్టమ్స్, నార్కోటిక్స్, పోలీస్ శిక్షణ అంతా ఒకే వేదికపై జరుగుతుంది. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ రెండు సంస్థలు చేతులు కలపడం ద్వారా తెలంగాణ పోలీస్ వ్యవస్థకు, కేంద్ర పన్ను, నార్కోటిక్స్

మిగతా2లో..

'ప్రతిచోటా దెయ్యాలే కనిపిస్తున్నాయా?'..

రాహుల్‌కు నిర్మల ఘాటు కౌంటర్

- టాటా వ్యవహారంపై రాహుల్ గాంధీ ఆరోపణలు
- రాహుల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్
- ప్రతిచోటా దెయ్యాలను వెతకొద్దంటూ చురకలు
- వ్యాపార అంశాలను రాజకీయాల్లోకి లాగొద్దని హితవు
- కాంగ్రెస్ లైసెన్స్-కోటా విధానంపై విమర్శలు

మిగతా2లో..

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

- టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం చేస్తున్నారన్న రాహుల్ గాంధీ
- మోదీ, అమిత్ షాలపై తీవ్ర విమర్శలు
- భయంతోనే వ్యాపారవేత్తలు మౌనంగా ఉన్నారని ఆరోపణ

ఢిల్లీ, అక్టోబర్ 28: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. టాటా సంస్థను 'నేరపూరితంగా నాశనం' చేస్తున్నారని, అయినా దేశంలోని వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన

మిగతా2లో..

తుపాను బాధితులకు భారీ ప్యాకేజి ప్రకటించిన చంద్రబాబు..

- అర్నబ్ తుపాను బాధితుల కోసం ఏపీ ప్రభుత్వం భారీ పరిహార ప్యాకేజీ
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, ఇళ్ల నష్టానికి ఆర్థిక సాయం
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు హెక్టారుకు రూ. 35,000 వరకు పరిహారం
- తుఫాను నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక, కేంద్ర బృందాన్ని కోరిన సీఎం
- ప్రతీ బాధితుడికి పారదర్శకంగా సాయం అందిస్తామని చంద్రబాబు హామీ

అమరావతి, అక్టోబర్ 28 : అర్నబ్ తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని, నష్టపోయిన చివరి వ్యక్తికి కూడా న్యాయం జరిగేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. తుపాను అనంతర సహాయక చర్యలు, నష్టపరిహారంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుపాను బాధితుల కోసం ప్రభుత్వం భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఇళ్లు, పంటలు, పశువులు, వ్యాపారాలు నష్టపోయిన వారికి

మిగతా2లో..

‘ప్రతిచోటా దెయ్యాలే కనిపిస్తున్నాయా?’..

టాటా గ్రూప్ వ్యవహారం ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతోంది. ఆ సంస్థను ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఘాటుగా స్పందించారు. ప్రతి అంశాన్నీ రాజకీయ కోణంలో చూడొద్దని, వాణిజ్య, న్యాయపరమైన విషయాలను నేరాలుగా చిత్రీకరించడం సరికాదని హితవు పలికారు. ‘ప్రతిచోటా దెయ్యాలను వెతకడం మానుకోండి’ అంటూ ఎక్స్ వేదికగా చురకలంటించారు. టాటా గ్రూప్ తీవ్ర సంక్షోభంలో ఉందని, ఆ సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంపై వ్యాపార ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. తమ దాకా వస్తే గానీ తెలియదా? అంటూ విమర్శించారు. భారత వ్యాపార రంగం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల్లోని ఆటబొమ్మ కాదని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన నిర్మలా సీతారామన్.. భారత పరిశ్రమలు, పారిశ్రామికవేత్తల విజయాలను కాంగ్రెస్ పదేపదే తక్కువ చేసి చూపుతోందని విమర్శించారు. వ్యాపార రంగంలో అవిశ్వాసం, విషపూరిత వాతావరణం వ్యాప్తి చేసేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పాలనలోని లైసెన్స్–కోటా విధానం పారిశ్రామికవేత్తల స్వేచ్ఛను దెబ్బతీసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్లపాటు కొనసాగించాలన్న నిర్ణయంపై వివాదం నెలకొంది. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాల్ చేశారు. ఆ నిర్ణయం చెల్లదని, నిబంధనల ప్రకారం జరగలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

ఒక పోస్ట్ చేశారు. “భారతీయ వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం“ అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్‌నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదని విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు

అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నష్టపరిహారం ఖర్చులు తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వకంగా విస్మరించారా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు.. కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి ‘మోనోకిల్’ ఎమోజీని జతచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం..

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..

అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ పరిపాలనలో మార్పులు చేపట్టింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు. ఇక రెవెన్యూ (దేవాదాయ) శాఖకు శైలజ రామయ్యర్‌ను, క్రీడలు మరియు వారసత్వ శాఖకు ఎ. వాణి ప్రసాద్‌ను బదిలీ చేశారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు కేటాయించారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు అప్పగించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీజీఎస్పీడీసీఎల్, టీజీరెడ్కో బాధ్యతలను జితేష్ వి. పాటిల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్ కు తాగునీటి ఢోకా లేదు.. !

చేయాలని తేల్చి చెప్పారు.

క్యూర్ పరిధిలో ప్రత్యేక సమీక్ష - ఎస్టీపీలు 100% పనిచేయాలి!

క్యూర్ పరిధిలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్‌హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని, క్యూర్ ప్రాంత పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పని చేసేలా చూడాలని ఆదేశించారు. ఒక్క ఎస్టీపీ కూడా మూసివేయకూడదు, పూర్తి సామర్థ్యంతో పనిచేయాల్సిందే అని స్పష్టం చేశారు.

ట్రీటెడ్ వాటర్ తోనే పచ్చదనం, రోడ్లు, పార్కులు!

సెక్రటేరియట్‌తో పాటు సీఎంఓ, అవుటర్ రింగ్, మెట్రో రైల్, ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ కోసం, ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించేలా చూడాలని తెలిపారు. పబ్లిక్ పార్కులు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటర్‌నే వాడాలన్నారు. మంచినీటిని ఇలాంటి పనులకు వాడడం వృథా అని, ట్రీటెడ్ వాటర్ వాడకాన్ని తప్పనిసరి చేయాలని ఆదేశించారు.

భవన నిర్మాణంలోనూ ట్రీటెడ్ వాటర్ తప్పనిసరి!

భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు.

నాణ్యత విషయంలో రాజీ లేదు - ప్రతి ప్లాంట్ వద్ద ప్రత్యేక అధికారి!

ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని చెప్పారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొద్దన్నారు. ప్రతి నీటిశుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికప్పుడు హైడ్రా పర్యవేక్షించాలని చెప్పారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ - నవంబర్ 1 నుంచి కొత్త నిబంధనలు!

ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా ట్రీటెడ్ వాటర్ కావాలనుకుంటే ఈ నంబర్ కు ఫోన్ చేస్తే సరిపోతుంది. ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్ పంపిణీ - నీరు ఉచితం!

ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్‌ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అంటే నీరు ఫ్రీ, కేవలం ట్యాంకర్ ఛార్జ్ మాత్రమే అని అధికారులు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ లో చారిత్రక ఒప్పందం!

వ్యవస్థకు ఎంతో మేలు చేకూరనుంది. ఈ అవగాహన ఒప్పందంపై జాతీయ అకాడమీ జోనల్ శిక్షణా సంస్థ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ నీలేష్ రౌత్కర్ మరియు ఆర్.బి.వి.ఆర్.ఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్ట్ సంతకాలు చేశారు. ఇరువురు అధికారులు ఈ భాగస్వామ్యం శిక్షణ రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అన్నారు. ఒకరి అనుభవం మరొకరికి, మరొకరి నైపుణ్యం ఒకరికి పంచేలా ఈ ఒప్పందం రూపొందించబడిందని వారు తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఇరు సంస్థల మధ్య శిక్షణ, విజ్ఞానం, అనుభవాల పరస్పర మార్పిడిని ప్రోత్సహించడంతో పాటు, అధికారుల వృత్తిపరమైన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. చట్టాలు, ప్రజా విధానాలు, సంబంధిత చట్ట అమలు అంశాల్లో నైపుణ్యాన్ని పరస్పరం పంచుకోనున్నారు. ఇరు సంస్థల నిపుణులు, అధ్యాపకుల సేవలను పరస్పర శిక్షణ కార్యక్రమాల్లో వినియోగించుకోనున్నారు. సమకాలీన అంశాలపై వర్క్ షాపులు, సెమినార్లు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పోలీసు, నార్కోటిక్స్ సంబంధిత చట్టాల అమలు, ప్రజా విధానాలు, వృత్తిపరమైన నైపుణ్యాలపై అధికారులకు మెరుగైన శిక్షణ అందించనున్నారు. అవసరమైన రంగాల్లో శారీరక దృఢత్వం, శిక్షణా విధానాలు, సంబంధిత నైపుణ్యాల అభివృద్ధికి కూడా సహకరించనున్నారు. పరస్పర సహకారంతో శిక్షణా విధానాల్లో నూతన ఆలోచనలు, ఉత్తమ పద్ధతులు, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించనున్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఇరు సంస్థల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావడంతో పాటు సమర్థవంతమైన శిక్షణ, విజ్ఞాన భాగస్వామ్యం, నైపుణ్యాభివృద్ధి ద్వారా ప్రజాసేవలో వృత్తిపరమైన ప్రమాణాలను పెంపొందించేందుకు ఎంతో దోహదపడనుంది. మాదకద్రవ్యాలు, కస్టమ్స్ నేరాలు, సరిహద్దు దాటి జరిగే నేరాల విషయంలో పోలీస్ మరియు నార్కోటిక్స్ అధికారుల మధ్య సమన్వయం చాలా ముఖ్యం. ఈ ఒప్పందంతో ఆ సమన్వయం మరింత బలపడుతుంది అని అధికారులు చెబుతున్నారు. తెలంగాణను మాదకద్రవ్యాలు లేని రాష్ట్రంగా మార్చే లక్ష్యంలో ఇది ఒక పెద్ద అడుగు అని అంటున్నారు. ఈ చారిత్రక కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు డి. మురళీధర్, జి. కవిత, ఎన్. వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, వేముల శ్రీనివాసరావు, జాతీయ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్లు సుజిత్ కుమార్, బీనా భక్షి, శారదారెడ్డి పాల్గొన్నారు. అందరి సమక్షంలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

హైదరాబాద్ లో శాకాహారులకే ప్రత్యేక ఫ్లాట్లు!

ఎక్కడెక్కడ ఈ వెజ్ టవర్లు? హాట్ స్పాట్స్ ఇవే!

హైదరాబాద్ లోని ప్రముఖ ప్రాంతాల్లో ఈ తరహా అపార్ట్ మెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది.

కోకాపేట - ఫినాన్షియల్ డిస్ట్రిక్ట్ పక్కన ఉన్న అత్యంత విలాసవంతమైన ప్రాంతం. ఇక్కడ కోట్ల రూపాయల విలువైన ఫ్లాట్లు ఉంటాయి. ఇక్కడే వెజ్ టవర్ అంటే ఆశ్చర్యం వేస్తోంది.

పుప్పాలగూడ - కొత్తగా అభివృద్ధి చెందుతున్న ఐటీ కారిడార్ ప్రాంతం. ఇక్కడ చాలా కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయి. ఉత్తర భారత ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఇక్కడే ఇళ్లు కొంటున్నారు.

నల్లగండ్ల - ఇప్పటికే ఉత్తర భారత కుటుంబాలు ఎక్కువగా నివసించే ఏరియా. మార్వాడీ, గుజరాతీ, జైన్ కుటుంబాలు ఇక్కడ ఎక్కువ. అందుకే ఈ ప్రాంతంలో వెజ్ కమ్యూనిటీకి డిమాండ్ ఎక్కువ అని టాక్.

ఈ మూడు ప్రాంతాల్లో కొన్ని బిల్డర్లు వెజ్ కమ్యూనిటీ పేరుతో ప్రత్యేక టవర్లు నిర్మిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అదే టవర్ లో మిగతా వారికి ఫ్లాట్లు అమ్మడం లేదని, కేవలం శాఖాహారులకు మాత్రమే అమ్ముతున్నారని సమాచారం.

ఉత్తరాది సంస్కృతి హైదరాబాద్ లోకి - అసలు కథ ఏమిటి?

ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో కనిపించే ఈ నివాస సంస్కృతి ఇప్పుడు హైదరాబాద్ లోనూ విస్తరిస్తోందనే చర్చ మొదలైంది. ఢిల్లీ, ముంబై, గుజరాత్, రాజస్థాన్ వంటి ప్రాంతాల్లో జైన్, మార్వాడీ, గుజరాతీ కమ్యూనిటీల కోసం ఇలాంటి వెజ్ ఓన్లీ సొసైటీలు చాలా కాలంగా ఉన్నాయి. అక్కడ మాంసాహారం వండడం, తినడం పూర్తిగా నిషేధం. వాసన కూడా ఇంట్లోకి రాకూడదనే నియమం ఉంటుంది. కామన్ ఏరియాలో కూడా నాన్ వెజ్ తినకూడదు. ఇదే తరహా సంస్కృతి ఇప్పుడు హైదరాబాద్ లాంటి మెట్రో నగరంలోకి వచ్చేసరికి, స్థానికుల్లో రకరకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ అంటే బిర్యానీ నగరం, నాన్ వెజ్ ప్రియుల నగరం. అలాంటి నగరంలో వెజ్ ఓన్లీ అనడం కొత్త విషయమే.

ఎందుకు ఈ డిమాండ్ పెరుగుతోంది? బిల్డర్ల లెక్క ఏమిటి?

శాకాహారుల దృష్టిలో ఇంటి పక్కన నాన్ వెజ్ వండితే వాసన భరించలేం, పిల్లలపై చెడు ప్రభావం పడుతుంది అనేది ప్రధాన వాదన. ప్రత్యేకంగా శుభ్రత, మతాచారం, జీవన విధానాన్ని పాటించే కుటుంబాలు తమ పక్కింటి వారు కూడా తమలాగే ఉండాలని కోరుకుంటున్నారు. పండగలు, పూజలు, వ్రతాలు చేసే ఇళ్లకు పక్కన నాన్ వెజ్ వాసన వస్తే ఇబ్బందిగా ఉంటుందని వారు చెబుతున్నారు. అందుకే బిల్డర్లు ఈ డిమాండ్ ను అందిపుచ్చుకుని వెజ్ టవర్లు అంటూ మార్కెటింగ్ చేస్తున్నారనే టాక్ ఉంది. ఒకే టవర్ లో వెజ్ వారికి వేరే, నాన్ వెజ్ వారికి వేరే అని కూడా కొందరు చెబుతున్నారు. ఈ టవర్లలో ఫ్లాట్ ధరలు కూడా కొంచెం ఎక్కువగానే ఉంటున్నాయని, అయినా డిమాండ్ బాగా ఉందని రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకత ఉంటే ధర పెరుగుతుంది అనేది బిల్డర్ల లెక్క.

వెజ్ టవర్లలో నిబంధనలు ఏమిటి?

ఈ టవర్లలో అమ్మకాలకు సంబంధించి కొన్ని ప్రత్యేక షరతులు ఉంటున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇంట్లో మాంసాహారం వండకూడదు, బయట నుంచి తెచ్చి తినకూడదు, అసోసియేషన్ కు తెలియకుండా నాన్ వెజ్ పార్టీలు చేయకూడదు అనే నియమాలు ఉంటాయని చెబుతున్నారు. కొన్ని చోట్ల లీజు, అగ్రిమెంట్ లోనే ఈ షరతు రాస్తున్నారని కూడా టాక్. అయితే ఇది నిజంగా లీగల్ గా కుదురుతుందా? అపార్ట్ మెంట్ చట్టం ప్రకారం ఎవరి ఇంట్లో వారు ఏమి తినాలో చెప్పే అధికారం ఎవరికీ లేదు అని న్యాయ నిపుణులు అంటున్నారు.

విమర్శలు కూడా వస్తున్నాయి - వివక్షేనా? హైదరాబాద్ సంస్కృతికి దెబ్బా?

అయితే, ఈ విధానంపై విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఆహారం విషయంలో ఇలా విభజన చేయడం సరైనదేనా? ఇది ఒక రకమైన వివక్ష కాదా? అపార్ట్ మెంట్ లో అందరూ సమానమే కదా, తినే తిండి బట్టి వేరు చేయడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు వస్తున్నాయి. హైదరాబాద్ అనేది అన్ని రకాల సంస్కృతులు కలిసి ఉండే నగరం. హిందూ, ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ అందరూ కలిసి బిర్యానీ తింటారు, పండగలు చేసుకుంటారు. ఇక్కడ మాంసాహారం తినేవారు ఎక్కువే. అలాంటి నగరంలో వెజ్ ఓన్లీ అని ప్రత్యేకంగా చెప్పడం సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తుందా అన్న చర్చ కూడా జరుగుతోంది. సోషల్ మీడియాలో అయితే ఈ విషయంపై పెద్ద యుద్ధమే జరుగుతోంది. ఒక వర్గం ఇది మా ఇష్టం, మా డబ్బుతో మేము కొనుక్కుంటున్నాం అంటోంది. మరో వర్గం ఇది అసహనం, విభజన అంటోంది.

అధికారిక వివరాలు ఏమిటి? నిర్ధారణ అవసరం!

అయితే, ఈ విధానానికి సంబంధించిన లినిర్దిష్ట అపార్ట్ మెంట్లు, విక్రయ నిబంధనలు, శాకాహారులకే పరిమితం చేసే షరతులపై అధికారిక వివరాలను నిర్ధారించాల్సి ఉంది. ఇప్పటివరకు ఏ బిల్డర్ కూడా బహిరంగంగా మేము వెజ్ ఓన్లీ అని ప్రకటించలేదు. కేవలం మౌఖికంగా, బ్రోకర్ల ద్వారా ఈ సమాచారం వ్యాప్తిలో ఉంది. అందుకే ఈ వార్తపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కానీ చర్చ మాత్రం హైదరాబాద్ మొత్తంలో మొదలైపోయింది. రానున్న రోజుల్లో ఈ ట్రెండ్ ఇంకా పెరుగుతుందా? లేక కోర్టు కేసుల వరకు వెళ్తుందా? అనేది చూడాలి.

100 ఏళ్ల కల సాకారం అవుతోంది

సంఖ్యలో పాల్గొన్నారు.

మోడల్ నుంచి బ్లాకుల వరకు - ప్రతి అంతస్తును చూసిన మంత్రి

మంత్రి పొన్నం ప్రభాకర్ ముందుగా ఏర్పాటు చేసిన లిహాస్పిటల్ మోడల్ డిజైన్ లనులి నిశితంగా పరిశీలించారు. భవనం ఎలా ఉండబోతోంది, పేషెంట్లకు ఏర్పాట్లు ఎలా ఉంటాయో మోడల్ ద్వారా అర్థం చేసుకున్నారు. అనంతరం నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలోకి వెళ్లి, అక్కడ నిర్మాణంలో ఉన్న లిపలు బ్లాక్ లనులి ఒకదాని తర్వాత ఒకటి పరిశీలించి, ఇంజనీర్లకు, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈరోజు నాటికి ఎంత పూర్తి చేయాలి, ఇప్పటివరకు ఎంత పూర్తి చేశారని ఆయన అధికారులను నేరుగా ప్రశ్నించారు.

పనులు వెనకబడ్డాయి - ఆలస్యం వద్దు అని మంత్రి హెచ్చరిక!

పనుల పురోగతిపై మంత్రి తీవ్రంగా స్పందించారు. రెగ్యులర్ పనులకు ఈరోజు తేదీకి పనులు కొంత లివెనకబడి ఉన్నాయనిలి గుర్తించిన మంత్రి, సమయానికి చేయాల్సిన పనుల్లో లిఏమాత్రం ఆలస్యం ఉండవద్దనిలి అధికారులను ఆదేశించారు. హాస్పిటల్ నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేసిన మంత్రి, నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి వారం పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని కూడా ఆయన సూచించినట్లు సమాచారం.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది - 100 ఏళ్ల భవిష్యత్తు!

ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. తెలంగాణ ప్రజలకు ఎన్నో ఏళ్లుగా వైద్య సేవలందించి, పేదలకు ఆరోగ్య భరోసాగా నిలిచిన ఉస్మానియా ఆస్పత్రిని మరింత ఉన్నతంగా, మరింత ఆధునికంగా పునర్నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ మహా యజ్ఞం సాగుతోంది. దాదాపు ₹2,700 కోట్ల వ్యయంతో, 2,000 పడకల సామర్థ్యంతో, సుమారు 31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నూతన భవన నిర్మాణం జరుగుతోంది. రాబోయే 100 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని, అత్యున్నత ఆధునిక ప్రమాణాలతో ఈ నిర్మాణం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

పేషెంట్లకు మాత్రమే కాదు - విద్యార్థులకు, వార్డులకు కూడా!

ఈ నూతన ఆసుపత్రి కేవలం 2,000 పడకల ఆస్పత్రితో మాత్రమే ఆగడం లేదు. దీనిలో భాగంగా... - విద్యార్థులు, విద్యార్థినులకు లివేర్వేరు హాస్టళ్లు - బయటి నుంచి వచ్చే పేషెంట్ల బంధువుల కోసం ధర్మశాల - పరిపాలన కోసం ప్రత్యేక అడ్మినిస్ట్రేటివ్ భవనం - ఆహ్లాదకర వాతావరణం కోసం విస్తారమైన గ్రీనరీ - అత్యాధునిక వెంటిలేషన్ వ్యవస్థ ఇవన్నీ ఒకే ప్రాంగణంలో ఉండబోతున్నాయి. అంటే, వైద్యం కోసం వచ్చే ప్రతి వ్యక్తికి ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రాబోతున్నాయి.

ఇప్పటివరకు పనులు ఎంత పూర్తయ్యాయి?

నిర్మాణ పనుల పురోగతి వివరిస్తూ అధికారులు మంత్రికి చెప్పిన వివరాల ప్రకారం, ఇప్పటికే పుట్టింగ్ పనులు పూర్తయి, రెండు అంతస్తుల స్లాబుల నిర్మాణం పూర్తయింది. పనుల వేగాన్ని నిరంతరం పరిశీలించేందుకు అధికారులతో కలిసి ప్రతినెలా పర్యవేక్షణ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

చిన్న సమస్యలుంటే పరిష్కరిస్తాం - పచ్చదనం, నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి

నిర్మాణంలో ఎదురవుతున్న కొన్ని చిన్న సమస్యలపై కూడా మంత్రి చర్చించారు. స్థల సేకరణ, రోడ్డు కనెక్టివిటీ, పక్కనున్న హాస్టల్ హెరిటేజ్ సంబంధిత లీగల్ అంశాలు వంటి చిన్నపాటి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆస్పత్రి ప్రాజెక్టులో ఌూ (సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్)లి ఏర్పాటుతో పాటు వర్షపు నీటి సంరక్షణ (వాటర్ హార్వెస్టింగ్) ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. పర్యావరణ అనుకూలంగా, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఈ భవనం రూపుదిద్దుకుంటోంది. మొత్తంగా, ఉస్మానియా నూతన భవనం తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలందించే మహా కేంద్రంగా మారబోతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలన్నదే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షగా కనిపిస్తోంది.

తుపాను బాధితులకు భారీ ప్యాకేజి ప్రకటించిన చంద్రబాబు..

పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని, వీలైనంత వేగంగా పరిహారం అందించి వారిని తిరిగి నిలబెడతామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ప్యాకేజీ పారదర్శకంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందుతుందని సీఎం తెలిపారు. తక్షణ సహాయం కింద తుపాను ప్రభావిత కుటుంబాలకు నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించారు.

తక్షణ సహాయం మరియు ఇళ్ల నష్టపరిహారం

తుపాను కారణంగా ఇళ్లలోకి నీరు చేరిన ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం.

మత్స్యకారులు మరియు చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం. ప్రతి కుటుంబానికి కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ చక్కెర, కేజీ బంగాళదుంపలు ఉచితంగా పంపిణీ.

తక్షణ ఖర్చుల కోసం ఒక్కో కుటుంబానికి రూ. 1000 నుంచి గరిష్టంగా రూ. 3000 వరకు ఆర్థిక సహాయం.

తుపాను కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా.

పాక్షికంగా ఇల్లు దెబ్బతింటే రూ. 10,000 ఆర్థిక సహాయం.

వ్యాపారాలు, జీవనోపాధికి చేయూత

చిన్న కిరాణా షాపులు, రెస్టారెంట్లు, సర్వీస్ షాపులకు రూ. 25,000.

చేతివృత్తుల వారికి జీవనోపాధి నష్టానికి రూ. 25,000.

తోపుడు బండ్లకు రూ. 20,000.

ఎంఎస్ఎంఈ పరిశ్రమలు (రూ. 40 లక్షల టర్నోవర్ వరకు): రూ. 50,000.

పరిశ్రమలు (రూ. 40 లక్షల నుంచి రూ. 1.5 కోట్ల టర్నోవర్): రూ. 1 లక్ష.

పరిశ్రమలు (రూ. 1.5 కోట్ల టర్నోవర్ పైబడినవి): రూ. 1,50,000.

దెబ్బతిన్న ద్విచక్ర వాహనానికి రూ. 3000

దెబ్బతిన్న ఆటోకు రూ. 10,000.

మత్స్యకారులకు నష్టపరిహారం

వలలు పాక్షికంగా దెబ్బతింటే మరమ్మతులకు రూ. 5000, రీప్లేస్‌మెంట్‌కు రూ. 10,000.

మెకనైజ్డ్ కాని బోటు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ. 20,000.

మెకనైజ్డ్ బోటు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ. 25,000.

చేపల చెరువుల పునరుద్ధరణకు రూ. 18,000.

పశు నష్టపరిహారం

ఆవు/గేదె మరణిస్తే: రూ. 50,000

దూడలకు: రూ. 25,000

గొర్రె/మేక: రూ. 7,500

కోడికి రూ. 100 (ఒక లబ్ధిదారునికి గరిష్ఠంగా రూ. 10,000).

పశువుల షెడ్ దెబ్బతింటే: రూ. 5,000.

వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టపరిహారం (హెక్టారుకు)

రూ. 75,000: తమలపాకు

రూ. 35,000: అరటి, పసుపు, యమ్, మిరప, జామ, బొప్పాయి, మామిడి, కాఫీ, యాపిల్ బేర్, సపోటా, కాజు, డ్రాగన్ ఫ్రూట్.

రూ. 25,000: పత్తి, వేరుశనగ, వరి, కూరగాయలు, టమాటో, పూలు, ఉల్లి, పుచ్చ, నర్సరీ, దానిమ్మ, కొత్తిమీర.

రూ. 25,000: చెరకు (మొదటి పంట)

రూ. 15,000: సజ్జ, మినుములు, పెసలు, మొక్కజొన్న, రాగి, కంది, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పొగాకు, జనుము, కొర్ర, సామ.

ఆయిల్ పామ్, కొబ్బరి: ఒక్కో చెట్టుకు రూ. 1500

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, “నా మొదటి ప్రాధాన్యత ప్రాణనష్టాన్ని నివారించడం. అయినప్పటికీ ఐదుగురు మరణించడం బాధాకరం. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి“ అని అన్నారు. మూడు రోజుల్లో ఎనిమిది సార్లు సమీక్షలు నిర్వహించి, టెక్నాలజీని వాడుకుని అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని తెలిపారు. తుపాను తీరం దాటిన అయిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించామన్నారు. రెండు, మూడు రోజుల్లో కోనసీమ, పశ్చిమ గోదావరి మినహా అన్ని జిల్లాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. రోడ్లపై పడిన చెట్లను తొలగించి రవాణాకు అంతరాయం లేకుండా చేశామని, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను కేంద్రానికి పంపి, కేంద్ర బృందాన్ని పంపమని కోరినట్లు తెలిపారు. రేపు, ఎల్లుండి క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, బాధితులకు భరోసా కల్పిస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బాధ్యత గల ప్రభుత్వంగా ప్రజల కష్టాల్లో సర్వశక్తులు ఒడ్డి అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో సంచలనం

నగరం నలుమూలల నుండి భారీ తరలింపు - +వీ కార్యాలయం ముందు బైఠాయింపు

ఉదయం నుంచే నగరం నలుమూలల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా సికింద్రాబాద్ రైల్వే నిలయానికి తరలివచ్చారు. కార్యకర్తలంతా ఒక్కసారిగా రైల్వే నిలయంలోని +వీ కార్యాలయం ముందు బయట బైఠాయించిలి నిరసన చేపట్టారు. చేతుల్లో ప్లకార్డులు, నోట నినాదాలతో రైల్వే ప్రాంగణం మారుమోగిపోయింది. ధర్నాలో లిఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీ గణేష్, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్‌లి తో పాటు ఇతర ముఖ్య నేతలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైల్వే అధికారుల తీరుకు వ్యతిరేకంగా కార్యకర్తలు గట్టిగా నినాదాలు చేశారు. రైల్వే పోలీసులు, సిబ్బంది ఏం చేయాలో తెలియక సందిగ్ధంలో పడ్డారు.

తోపులాటలో కిందపడ్డ మంత్రి పొన్నం, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

నిరసన తీవ్ర స్థాయికి చేరుకున్న సమయంలో పోలీసులు కార్యకర్తలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో తోపులాట జరిగింది. ఈ తోపులాటలో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కిందపడ్డారు. నేతలు కిందపడటంతో కాంగ్రెస్ కార్యకర్తలు మరింత ఆగ్రహంతో ఊగిపోయారు. ఈ క్రమంలో లిమంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డికి అస్వస్థతలి కూడా కలిగింది. వారు నిలబడలేక ఇబ్బంది పడటంతో, పార్టీ నేతలు వెంటనే వారికి ప్రథమ చికిత్స అందించి, సేదదీర్చే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో ధర్నా స్థలంలో కొద్దిసేపు ఉద్రిక్తత మరింత పెరిగింది.

పోలీసుల అదుపులోకి కాంగ్రెస్ నేతలు - మార్కెట్ పిఎస్ కు తరలింపు

పరిస్థితి చేయిదాటిపోతుందని గ్రహించిన పోలీసులు చివరకు కఠినంగా వ్యవహరించారు. నిరసనలో పాల్గొన్న ప్రధాన నేతలను అదుపులోకి తీసుకున్నారు. రైల్వే నిలయం వద్ద అరెస్ట్ చేసిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీ గణేష్‌లి లను పోలీసులు వాహనాల్లో సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ సమయంలో కూడా నేతలు మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. పోలీసులు, కాంగ్రెస్ నేతల మధ్య స్వల్ప వాగ్వాదం కూడా జరిగింది.

రైల్వే స్టేషన్ లో ట్రాఫిక్ స్తంభన - ప్రయాణికులు ఇబ్బందులు

అకస్మాత్తుగా జరిగిన ఈ మెరుపు ధర్నాతో సికింద్రాబాద్ రైల్వే నిలయంలో ప్రయాణికుల రాకపోకలు కొద్దిసేపు స్తంభించిపోయాయి. స్టేషన్ ముందు రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు అదనపు బలగాలను మోహరించి, పరిస్థితిని అదుపు లోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. మొత్తంగా, సికిం ద్రాబాద్ రైల్వే నిలయం ముందు జరిగిన ఈ మెరుపు ధర్నా రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. పీసీసీ చీఫ్, మంత్రి సహా కీలక నేతల అరెస్ట్ తో కాంగ్రెస్ వర్సెస్ కేంద్రం ఘర్షణ మరో స్థాయికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

సంపాదకీయం

మళ్లీ చెలరేగుతున్న మాఫియా

ముంబైలో బాలీవుడ్ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస కాల్పుల ఘటనలు సినీ పరిశ్రమలో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన దాడి ఈ భయాలను మరింత పెంచింది. గతంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ నివాసం, ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి ఇల్లు, రాజకీయ నాయకుడు బాబా సిద్ధిఖీపై జరిగిన దాడులను పరిశీలిస్తే.. కొన్ని ఘటనల్లో సల్మాన్ ఖాన్‌తో ఉన్న సంబంధాలను కారణంగా చూపుతూ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో ముంబైలో సినీ ప్రముఖుల భద్రత మరోసారి చర్చనీయాంశమైంది.ముంబైలోని జూహు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగినట్లు వచ్చిన వార్తలు కలకలం రేపాయి. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, ఆయన డ్రైవర్ గాయపడినట్లు పోలీసులు తెలిపినట్లు కథనాలు వెల్లడించాయి. ఘటన అనంతరం బయటకు వచ్చిన ఓ ఆడియో రికార్డింగ్‌లో అనిల్ పండిట్ అనే వ్యక్తి తనను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందినవాడిగా చెప్పుకున్నట్లు సమాచారం.సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసేవారిని, తమకు అనుకూలంగా వ్యవహరించనివారిని లక్ష్యంగా చేసుకుంటామంటూ ఆ ఆడియోలో హెచ్చరికలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడి వెనుక హర్మన్ సంధు కూడా ఉన్నట్లు అనిల్ పండిట్ పేరును ప్రస్తావించినట్లు సమాచారం.2024 అక్టోబర్ 12న మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ బాంద్రాలోని తన కుమారుడి కార్యాలయం సమీపంలో కాల్పులకు గురయ్యారు. ముగ్గురు దుండగులు ఆయనపై కాల్పులు జరపడంతో తీవ్రంగా గాయపడిన సిద్ధిఖీని లీలావతి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించారు.బాబా సిద్ధిఖీకి బాలీవుడ్ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ముఖ్యంగా సల్మాన్ ఖాన్‌తో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ హత్యకు తామే బాధ్యులమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొన్న శుభమ్ లోంకర్ పేరుతో సోషల్ మీడియాలో పోస్టు వెలువడింది. సల్మాన్ ఖాన్‌కు మద్దతుగా నిలిచేవారికి హెచ్చరికలు జారీ చేస్తూ అందులో వ్యాఖ్యలు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో టైగర్ ష్రాఫ్ ఘటనకు, బాబా సిద్ధిఖీ హత్యకు మధ్య కొన్ని పోలికలు కనిపిస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, రెండు ఘటనల వెనుక ఒకే విధమైన ఉద్దేశం ఉందా? వాటి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందా? అనే విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.2024 ఏప్రిల్ 14న ముంబైలోని బాంద్రాలో ఉన్న సల్మాన్ ఖాన్ నివాసం గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ వెలుపల బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో విక్కీ గుప్తా, సాగర్ పాల్ అనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆయుధాల సరఫరాకు సంబంధించి అనుజ్ థాపన్‌ను కూడా అరెస్టు చేశారు. అయితే 2024 మే 1న పోలీసు కస్టడీలో ఉండగా అతడు మరణించాడు. ఈ ఘటనపై కూడా పలు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమయ్యాయి.సల్మాన్ ఖాన్‌పై దాడికి సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు బాధ్యత వహించినట్లు ప్రకటించారని వార్తలు వెలువడ్డాయి. సల్మాన్ ఖాన్‌పై గతంలో కూడా బెదిరింపు లేఖలు, ఈ-మెయిళ్లు వచ్చినట్లు పోలీసు రికార్డుల్లో ప్రస్తావించబడింది. పన్వేల్‌లోని ఆయన ఫామ్‌హౌస్ పరిసరాల్లోనూ అనుమానాస్పద కదలికలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు సల్మాన్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకోవడానికి కృష్ణజింకల వేట కేసును ప్రస్తావిస్తున్నారు.. కృష్ణజింకలను పవిత్రంగా భావించే బిష్ణోయ్ సమాజ విశ్వాసాలను ఈ వివాదానికి కారణంగా చూపుతున్నారు.బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్‌కు సన్నిహితంగా ఉన్నారని భావించే ఇతర ప్రముఖులపై కూడా దాడులు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. 2026 ఫిబ్రవరిలో జూహులోని ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి నివాసం వద్ద కాల్పులు జరిగాయి. ఈ ఘటనకు సంబంధించి శుభమ్ లోంకర్ పేరుతో వచ్చిన ఆరోపణలు, హర్మన్ సంధు పేరు ప్రస్తావన మరోసారి చర్చకు దారితీశాయి.ఇదే సమయంలో కెనడాలోని సర్రేలో హాస్యనటుడు కపిల్ శర్మకు చెందిన కేఫ్‌పై 2025 జూలై నుంచి పలుమార్లు కాల్పులు జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. సల్మాన్ ఖాన్‌ను తన నెట్‌ఫ్లిక్స్ కార్యక్రమానికి ఆహ్వానించడమే ఈ దాడులకు కారణమని గ్యాంగ్‌తో సంబంధం ఉన్న వ్యక్తి పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి.టైగర్ ష్రాఫ్ ఘటనకు సంబంధించి ఆడియోలో పేర్లు వినిపించిన వ్యక్తులు అమెరికాలో ఉన్నట్లు పోలీసు వర్గాలను ఉటంకిస్తూ వార్తలు పేర్కొన్నాయి. మరోవైపు, బాబా సిద్ధిఖీ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొన్న అన్మోల్ బిష్ణోయ్‌ను 2025 నవంబర్‌లో అమెరికా నుంచి భారత్‌కు తీసుకొచ్చి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసినట్లు నివేదికలు తెలిపాయి. అతడు పలు కేసులను ఎదుర్కొంటున్నాడు. ఈ పరిణామాలు నేర ముఠాల కార్యకలాపాలు, వాటి అంతర్జాతీయ సంబంధాలపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.ఒకవైపు ప్రముఖ నటులు, దర్శకులు, నిర్మాతలకు బెదిరింపులు రావడం.. మరోవైపు వారి నివాసాలు, వ్యాపార సంస్థల వద్ద కాల్పుల ఘటనలు చోటుచేసుకోవడం ముంబై పోలీసులకు సవాలుగా మారింది. తాజా ఘటనల నేపథ్యంలో సినీ ప్రముఖుల నివాసాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు సమాచారం.టైగర్ ష్రాఫ్ ఘటనతో బాలీవుడ్‌లో భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. సల్మాన్ ఖాన్‌తో సంబంధాలను ప్రస్తావిస్తూ బెదిరింపులు చేస్తున్నారనే ఆరోపణలు నిజమా? ఈ దాడుల వెనుక ఒకే నెట్‌వర్క్ ఉందా? అనే ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తే సమాధానం చెప్పాల్సి ఉంది.

మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

కడప, కడప నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.బుధవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, తదితర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కడప ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూములను అలాగే మౌలానా ఆజాద్ ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యుత్ సౌకర్యం, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో మౌలిక వసతులు, అధికారుల రాకపోకలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ఎన్నికల నిర్వహణలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమైన దశ అని, ఈ ప్రక్రియలో ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా,పూర్తి అప్రమత్తతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

రిమ్స్‌లో మృతి చెందిన గర్భిణి ,కవల పిల్లలు మృతి చెందడంతో వారి కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరిన టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్

సునీత కుటుంబానికి అండగా ఉంటాం: కలెక్టర్ రాజర్షి

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గర్భిణి బోర్కర్ సునీత,ఆమె కడుపులోని కవల శిశువులు మృతి చెందిన ఘటనపై జిల్లా కలెక్టర్ రాజర్షి స్పందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చి భరోసా కల్పించారు.ఈ ఘటనపై టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్,బాధిత కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వైద్యులు,విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ విషాదం చోటుచేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపించగా,ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సునీత ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందడం,ఆమె కడుపులోని కవల శిశువులు కూడా మృతి చెందడం అత్యంత బాధాకరమని దుర్గం శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై స్పందించిన కలెక్టర్ రాజర్షి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇచ్చే అంశంపై చర్యలు తీసుకుంటామని,సునీత ఎనిమిదేళ్ల కుమార్తె చదువుల ఖర్చులను ప్రభుత్వం భరించేలా సంబంధిత రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడతామని తెలిపారు. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు అవసరమైన సహాయం అందించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక వచ్చిన అనంతరం నిర్లక్ష్యం వహించినట్లు తేలితే సంబంధిత వైద్యులు, విధుల్లో ఉన్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. బాధిత కుటుంబ సభ్యులు ధైర్యం కోల్పోవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.బాధిత కుటుంబానికి సహాయం అందిస్తామని హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్ రాజర్షి కు టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్, దళిత జేఏసీ అధ్యక్షుడు కాంబ్లే ప్రజ్ఞాశీల్, పీఎస్ఎస్ఓ జాడి వెంకటేష్, బోర్కర్ రాజ్ కుమార్, జాడి రాజేశ్వర్, బండారి పోశన్నతో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రైస్ మిల్లర్ల బకాయిల వసూలుపై సమీక్ష

వారం రోజుల్లో బకాయిలు చెల్లించాలి..

బకాయిదారులకు తుది అవకాశం..

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి..

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28, (విజన్ ఆంధ్ర) : వారం రోజుల్లో బకాయిలు చెల్లించాలని రైస్ మిల్లర్లకు ఆదేశాలు ఇచ్చిన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బకాయిదారులైన రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. జిల్లాలో సీఎంఆర్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిల వివరాలను పరిశీలించి, వాటి వసూలు ప్రక్రియను వేగవంతం చేయడంపై చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ (కెఎంఎస్) 2014-15 నుంచి ఖరీఫ్ 2024-25 వరకు ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నం.17 ప్రకారం రైస్ మిల్లర్ల నుంచి బకాయిలను వసూలు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బకాయిల చెల్లింపులు జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో బకాయిలు చెల్లించని ప్రతి రైస్ మిల్లర్‌తో అదనపు కలెక్టర్ మాట్లాడి, వారు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిల వివరాలను సమీక్షించారు. మిల్లర్ల వారీగా బకాయిల పరిస్థితిని పరిశీలించి, చెల్లింపుల్లో జాప్యానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. బకాయిల వసూలును ప్రాధాన్యతగా తీసుకొని, పెండింగ్‌లో ఉన్న మొత్తాలను త్వరితగతిన రాబట్టేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.బకాయిల చెల్లింపునకు సంబంధించి రైస్ మిల్లర్లకు తుది అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశం జరిగిన తేదీ నుంచి వారం రోజుల్లోగా పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. నిర్ణీత గడువును దృష్టిలో ఉంచుకొని మిల్లర్లు ఎలాంటి జాప్యం చేయకుండా బకాయిల చెల్లింపులను పూర్తి చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించని రైస్ మిల్లర్లపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి స్పష్టం చేశారు. బకాయిల వసూలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

ప్రభుత్వ గుర్తింపు సాధించేందుకు ఎంతో కృషి

– తెలంగాణ రాష్ట్ర గోత్రాల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తిపిరిశెట్టి శ్రీనివాస్

కామారెడ్డి బ్యూరో (దోమకొండ)అక్టోబర్ 28 (విజన్‌ఆంధ్ర) కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం గొట్టిముకుల గోత్రాల కుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు చిందం సిద్ధిరాములు కుల అభ్యున్నతికి చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర గోత్రాల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తిపిరిశెట్టి శ్రీనివాస్ అన్నారు.కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం గొట్టిముకుల గ్రామానికి చెందిన చిందం సిద్ధిరాములు ఈ నెల 23న అకాల మరణం చెందడంతో బుధవారం ఆయన స్వగ్రామంలోని నివాసంలో సంతాపసభ నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తిపిరిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి కుల సంఘం ప్రతినిధులు హాజరై సిద్ధిరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జులు చిందం శ్రీనివాస్, ఎల్ఐసీ ఆంజనేయులు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తిపిరిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల వేణు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని శంకరయ్య, రాష్ట్ర కోశాధికారి తాళ్ల స్వామి, వివిధ జిల్లాల అధ్యక్షులు మాట్లాడుతూ.. చిందం సిద్ధిరాములు గోత్రాల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పదేళ్లపాటు సేవలందించారని గుర్తుచేశారు. కులానికి ప్రభుత్వ గుర్తింపు సాధించేందుకు ఆయన ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కులంలోని చిన్నా, పెద్దా నాయకులను, మేధావులను, రాజకీయ ప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ అన్ని జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేశారని తెలిపారు.సిద్ధిరాములు చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా 2009 ఫిబ్రవరి 19న గోత్రాల కులాన్ని రాష్ట్ర ప్రభుత్వం బీసీ 'ఏ' జాబితాలో చేర్చిన సందర్భం కుల చరిత్రలో గుర్తుండిపోతుందని నాయకులు పేర్కొన్నారు. కులానికి గుర్తింపు లభించినప్పుడు ఆయన వ్యక్తం చేసిన ఆనందం, సమాజ అభివృద్ధి కోసం చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ఆయన మృతి గోత్రాల కుల సంఘానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం సిద్ధిరాములు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సిద్ధిరాములు భార్య చిందం భాగ్యమ్మ, కుమారులు చిందం రమేష్, చిందం ఖైరయ్యతో పాటు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని శంకరయ్య, ప్రధాన కార్యదర్శి తాళ్ల వేణు, కోశాధికారి తాళ్ల స్వామి, మెదక్ జిల్లా అధ్యక్షులు బండారి నగేష్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తిపిరిశెట్టి రవీందర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు తిపిరిశెట్టి రాజు, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జులు చిందం శ్రీనివాస్, అంజయ్య, ప్రవీణ్, శంకర్, రాములు, రాజయ్య, రంజిత్, రాజమొగిలి, స్వామి తదితర కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మారుమూల ఆదివాసీ గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఆరుగురు నిపుణులైన వైద్య బృందంతో గ్రామ ప్రజలకు వైద్య సేవలు

100 మంది గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు, వైద్య సేవలు

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి.. త్వరలో మండల స్థాయి క్రీడా పోటీలు

గంజాయికి దూరంగా ఉండాలిపిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలి

లిమూఢనమ్మకాలను విశ్వసించవద్దు.. అనారోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించాలిజిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర)ఆదివాసీ మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సదుపాయాలను చేరువ చేయాలనే లక్ష్యంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా సోనాల మండలం కేశవ్ గూడ వజ్జర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆరుగురు నిపుణులైన వైద్య బృందం గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. సుమారు 100 మంది గ్రామ ప్రజలు ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.గ్రామానికి చేరుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కు గ్రామ ప్రజలు ఆదివాసీ సంప్రదాయాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ విగ్రహానికి పూజలు నిర్వహించి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చిన బోరు సమస్య, పాఠశాల భవన సమస్య, యువతకు డ్రైవింగ్ లైసెన్సుల ఏర్పాటు చేస్తానని, రక్తహీనత సమస్యల పై అవగాహన కల్పించారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొని త్వరలోనే వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ యువతలో క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు త్వరలో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తామని వెల్లడించారు.మారుమూల గ్రామాల ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలను చేరువ చేయడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం పోలీస్ శాఖ లక్ష్యమని ఎస్పీ తెలిపారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వ లేదా ప్రైవేట్ వైద్యులను సంప్రదించాలని, బాబాలు, మంత్రాలు, తంత్రాలను నమ్మకుండా మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగి, అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనవసరంగా పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లను వాడవద్దని వాటి వల్ల కిడ్నీ సమస్యలు వచ్చే ఆస్కారం ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, విద్యార్థులు లక్ష్యంతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గంజాయి సాగు, వినియోగం, రవాణా చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సాగుకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజలు పోలీసులతో సమన్వయంతో ముందుకు రావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, బోథ్ సీఐ డి. గురుస్వామి, ఎస్ఐ వి. పురుషోత్తం, గ్రామ సర్పంచ్ కిషన్ పవార్, పటేల్ లాల్యా, ప్రభుత్వ వైద్యులు డా. మిథిలేశ్, డా. రాకేష్, డా. షోయబ్బుదీన్, నర్సింగ్ అధికారి శ్రీధర్, ఎల్.వి. ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు, ప్రైవేట్ వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర)హనుమకొండలోని టీవీ టవర్ కాలనీకి చెందిన చుందు శివ హాసిని (18), హైదరాబాద్‌లోని తీగల కృష్ణారెడ్డి కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి చుందు గణేష్ (43) మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.ఇటీవల శివ హాసిని తల్లికి శస్త్రచికిత్స జరగడంతో సుమారు రూ.18 లక్షల వరకు ఖర్చు అయినట్లు తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లో కుమార్తె చదువుకు సంబంధించిన ఖర్చులు భరించడం కష్టంగా మారిందని తెలిపాడు.కళాశాల నుంచి పరీక్ష ఫీజు చెల్లించాలంటూ ఫోన్ రావడంతో, తండ్రి ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లి కుమార్తెను హనుమకొండలోని ఇంటికి తీసుకువచ్చాడు. చదువు కొనసాగించడం కష్టంగా ఉందని, వివాహం చేస్తానని కుమార్తెతో చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.ఈ క్రమంలో బుధవారం (28-10-2026) ఉదయం తండ్రి మేస్త్రీ పనికి వెళ్లగా, శస్త్రచికిత్స అనంతరం ఇంట్లోనే ఉన్న తల్లి మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయంలో శివ హాసిని తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఉండటాన్ని గుర్తించింది. వెంటనే తండ్రికి సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు, ఇతరుల సహాయంతో గది తలుపులు తెరిచి చూడగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం అంబులెన్స్ సిబ్బందిని పిలిపించగా, వారు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సుబేదారి పోలీసులు.

మత్తడి వాగు కెనాల్‌కు నీటి ని విడుదల చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర)రైతుల సాగునీటికోసం ఎదురుచూపులకు తెరదించుతూ తాంసి మండలంలోని మత్తడి వాగు కెనాల్‌కు నీటిని విడుదల చేయడం స్థానిక రైతన్నలకు ఎంతో ఊరటనిచ్చే పరిణామమని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో కలిసి నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొని రైతన్నలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా సాగునీటిని రైతులు ప్రతి ఒక్కరూ అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతన్నలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ కష్టమొచ్చినా రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, ఆత్మహత్యల వంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. అన్నదాతలకు ఏ కష్టం వచ్చినా ప్రభుత్వ పరంగా, పార్టీలకు అతీతంగా నాయకులందరం కలిసికట్టుగా అండగా నిలబడి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, వడ్డడి సర్పంచ్ జయసుధ గంగాధర్ , ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ , తాంసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కౌడాల సంతోష్ , ఏఎంసీ మెంబర్ తాటి అశోక్ , అలీమ్ , ఖమ్రుద్దీన్ ల తో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

స్వామి వారి ఆలయ అభివృద్ధి కి విరాళాలు

శ్రీ లక్ష్మి నరసింహ ఈరన్న స్వామి వార్ల దేవస్థానం ఉరుకుంద

కౌతాళం : మండల పరిధిలో ఉరుకుందా పుణ్య క్షేత్రం లో స్వామి వారి ఆలయ అభివృద్ధి కి విజయనగర జిల్లా హోస్పేట్ వాస్తవ్యులు రంగన్న గౌడ్ స్వామివారికి? 10,00,000/- (పది లక్షలు) రూపాయలు విరాళంగా చెల్లించి ఉన్నారు

దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలి

జూనియర్ ప్రొఫెషనల్ లివియా మరియం పాల్, తెలంగాణ మేనేజర్ సునీత

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28: (విజన్ ఆంధ్ర)డిప్యూటీ జిల్లా కేంద్రంలోమహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత ప్రక్రియకు సంబంధించి జిల్లాల వారీ సమీక్ష సమావేశం సిద్దిపేటలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జూనియర్ ప్రొఫెషనల్ శ్రీమతి లివియా మరియం పాల్ తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీమతి సునీత సంయుక్తంగా హాజరై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన సంబంధిత శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదు జిల్లాల్లో దత్తత ప్రక్రియ అమలు తీరు, దత్తతకు సంబంధించిన కేసుల ప్రస్తుత స్థితి, పెండింగ్ కేసులు,వాటిపరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ సీసీఐలలో సంరక్షణ పొందుతున్న పిల్లల్లో చట్టపరమైన నిబంధనల ప్రకారం దత్తతకు అర్హులైన పిల్లల కేసులను గుర్తించి, దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను సందర్శించని కేసులు, అలాగే పిల్లల సంరక్షణకు తల్లిదండ్రులు అనర్హులుగా గుర్తించబడి కేసులను ప్రత్యేకంగా సమీక్షించి, సంబంధిత చట్టపరమైన నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దత్తతకు అర్హులైన పిల్లలకు సంబంధించిన అవసరమైన పత్రాలు, డాక్యుమెంటేషన్, చట్టపరమైన ప్రక్రియలను నిర్ణీత నిబంధనల ప్రకారం ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పిల్లల భద్రత, సంక్షేమం, ఉత్తమ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, దత్తతకు సంబంధించిన పెండింగ్ కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, దత్తత ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలనుపరిష్కరించి, అర్హులైన పిల్లలకు కుటుంబ ఆధారిత సంరక్షణ అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి ఉజ్వల భవిష్యత్తుకు దత్తత ప్రక్రియ కీలకమని, సంబంధిత అధికారులు చట్టపరమైన నిబంధనలనుపా టిస్తూబాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఈ సమీక్ష సమావేశంలో సూచించారు.

కొందుర్గులో నదులున్నాయా? కాలువలున్నాయా? మరి కరువు మండలంగా ఎందుకు ప్రకటించరు?

అప్పుల ఊబిలో రైతులు.. ఆదుకునే వారేరీ? కొందుర్గుకు కరువు సాయం అందించాలి! కొందుర్గు రైతుల గోస వినండి.. తక్షణమే కరువు మండలంగా ప్రకటించండి! -- పసుపుల ప్రశాంత్

షాద్ నగర్, అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర):కరువు మండలాల జాబితాలో కొందుర్గు మండలానికి చోటు కల్పించకపోవడం పట్ల పసుపుల ప్రశాంత్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి, పంటలు ఎండిపోయి, పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితుల్లో కొందుర్గు మండలాన్ని కరువు మండలాల జాబితా నుంచి ఎలా మినహాయిస్తారని ఆయన ప్రశ్నించారు. కొందుర్గు మండలం ఏమైనా ధనిక మండలమా? ఇక్కడి రైతులంతా లక్షాధికారులా? రైతుల పొలాల్లో పంటలు ఎండిపోతుంటే, బోర్లలో నీళ్లు అడుగంటిపోతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా? మన మండలంలో నదీ జలాలు, సాగునీటి కాలువలు, పెద్ద చెరువుల ద్వారా నిరంతర సాగునీటి సౌకర్యం ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఇప్పటికే సుమారు 10 శాతం మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అందకపోవడంతో బ్యాంకుల్లో కొత్త రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పంట నష్టాలు, మరోవైపు పెరిగిన నిత్యావసర ధరలు, అప్పుల భారం రైతు కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయని పేర్కొన్నారు. పంటలు పండక రైతు కన్నీరు పెడుతుంటే, కరువు జాబితాలో పేరు లేకపోవడం రైతులకు మరో అన్యాయం కాదా? రైతులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం వారి వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందుర్గు మండలంలోని క్షేత్రస్థాయి పరిస్థితులను తక్షణమే పరిశీలించి, పంట నష్టం, భూగర్భ జలాల పరిస్థితి, రైతుల ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని కొందుర్గు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి. అర్హులైన రైతులకు కరువు సహాయం అందించి, రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలి. రైతుల కన్నీళ్లకు విలువ లేదా? కొందుర్గు రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. రైతుల పక్షాన పోరాడుతాం! అని పసుపుల ప్రశాంత్ స్పష్టం చేశారు.

ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్ట్ కు 3న రాత పరీక్ష

అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగానే చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో) గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్ట్ కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నవంబర్ మూడున రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు జోగులాంబ గద్వాలజిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల్ లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు పరీక్ష ఉంటుందన్నారు. మొత్తం 80 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో వ్యాసంతో పాటు ప్రజెంటేషన్, డేటా అనాలసిస్, కంప్యూటర్, ఐటీ స్కిల్స్, తదితర అంశాలపై ప్రశ్నలు అడగడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన అభ్యర్థుల వివరాలను జిల్లా వెబ్ సైట్ లో ఉంచడం జరిగిందని, వారు మాత్రమే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని అభ్యర్థులు తమ వెంట ఫోటో, ఆధార్ కార్డు ఒరిజినల్ తో పాటు జిరాక్స్ తీసుకురావాలన్నారు. పరీక్షలో ప్రతిభ చాటిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి నిబంధనల ప్రకారం ఉద్యోగానికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు

మరణించిన జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలబడడం అభినందనీయం

జర్నలిస్టులు సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలి, కష్టకాలంలో ఐక్యంగా ఉండాలి

1 లక్ష 77 వేల రూపాయల ఆర్థిక సహాయం, గ్రామ ప్రజలు, మిత్రులు, జర్నలిస్టులతో కలిసి కుటుంబ సభ్యులకు అందజేసిన :: డిపిఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర):విధి నిర్వహణలో లేదా ఆకస్మికంగా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తోటి జర్నలిస్టులు, గ్రామ ప్రజలు అండగా నిలవడం ఎంతో అభినందనీయమని జిల్లా పౌర సంబంధాల అధికారి పి. రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలో గంట్లకుంట గ్రామానికి చెందిన జర్నలిస్ట్ చింతల ఐలయ్య ఈ మధ్యనే మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి గ్రామ ప్రజలు, తోటి జర్నలిస్టులు, మిత్రులు, సంఘాలు, వాట్సాప్ గ్రూపుల సభ్యులు అందరూ కలిసి సేకరించిన రూ. 1,77/- (ఒక లక్షా డెబ్బై ఏడు వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని లిస్నానికి సర్పంచ్ పాయిలి యాక లక్ష్మిలి జర్నలిస్టులు, గ్రామస్తులతో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

1. బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ -- రూ.46,000/-
2. ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ -- రూ.10,500/-
3. రాజా 2007--08 బ్యాచ్ మిత్రులు -- రూ.36,000/-
4. గంట్లకుంట సూపర్ కింగ్స్ వాట్సాప్ గ్రూప్ సభ్యులు -- రూ.22,500/
5. పెద్దవంగర జర్నలిస్టులు -- రూ.38,500/-
6. గంట్లకుంట 7వ తరగతి మిత్రులు -- రూ.23,700/-

ఈ సందర్భంగా డిపిఆర్ఓ పి. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని, యువత , ప్రజలు విలువలతో కూడిన మెరుగైన సమాజ స్థాపన కోసం ఉపయోగపడే మంచి వార్తలు సేకరించి ప్రజలకు అందించాలన్నారు. ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు విలువలు లేకుండా పోతున్నాయని అలాంటి ఈ రోజులలో మరణించిన జర్నలిస్టు కుటుంబానికి గ్రామ ప్రజలు, మిత్రులు, జర్నలిస్టులు కలిసి సహాయం చేయడం ఎంతో అభినందనీయమని ప్రతి ఒక్కరూ సమాజంలో ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొని ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వ సూచనల ప్రకారం జిల్లాలోని ప్రతి ఒక్క వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం బిజిల్ల కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి ఈ ఆర్థిక సాయం కొంతైనా ఊరటనిస్తుందని, జర్నలిస్టు సంఘాలు, గ్రామస్తుల ఐక్యత ఇలాంటి సామాజిక కార్యక్రమాల ద్వారా చాటుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి అన్ని విధాలా తగిన సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు రామ్మూర్తి,సదానందం,బుచ్చన్న, బాలాజీ, సతీష్, రత్నాకర్ రెడ్డి, రాజు, సమ్మయ్య,శ్రీకాంత్, గ్రామస్తులు రాజు, సోమన్న, సతీష్, అశోక్, శ్రీనాథ్, ప్రవీణ్, సర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

గద్వాల సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

గద్వాల అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో)గద్వాల సర్కిల్ పరిధిలో పోలీస్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు, కేసుల దర్యాప్తు వేగవంతం చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా, బోర్డర్ పోలీస్ స్టేషన్ లలో అక్రమ రవాణా కు తావు లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం గద్వాల సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి, కార్యాలయ నిర్వహణ, కేసుల పురోగతి, పోలీస్ స్టేషన్ల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లు, పరిపాలనా పత్రాలు, కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. కేసుల దర్యాప్తు ఏ దశలో ఉంది, పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు ఏమిటనే అంశాలపై ఆరా తీశారు. ప్రతి కేసును నిరంతరం పర్యవేక్షిస్తూ, చట్టపరమైన ప్రక్రియలను పాటించి, నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు. సిబ్బంది విధుల నిర్వహణను సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలో పోలీసింగ్ ను బలోపేతం చేయాలని సూచించారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, కేసుల ఛేదనలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో నిర్వహించాల్సిన రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించి, క్రమబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. పోలీస్ శాఖకు సంబంధించిన ఆన్లైన్ పోర్టల్స్ లో కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, ఇతర సమాచారాన్ని నిర్ణీత గడువులోగా నమోదు చేయాలని, డేటా నమోదు విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్లకు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పోలీస్ శాఖపై ప్రజలకు నమ్మకం మరింత పెరిగేలా పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా కోర్టు సంబంధిత కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, న్యాయస్థానాల్లో కేసుల సమర్థవంతమైన నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణను పాటిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం సర్కిల్ ఆఫీస్ ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది. వార్షిక తనిఖీల పోలీస్ కార్యాలయాల పనితీరును సమీక్షించడంతో పాటు, లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడానికి, దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచడానికి, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడానికి దోహదపడతాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ తనిఖీలో గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, సిఐ. టంగుటూరి శ్రీను,గద్వాల సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సర్కిల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో దెందులూరు పోలీసుల తక్షణ సహాయక చర్యలు

దెందులూరు ఈదురు గాలులకు నేలకొరిగిన వృక్షాల తొలగింపును దెందులూరు పోలీసులు నిర్వహించారు. ఆర్నబ్ తుఫాను ప్రభావంతో దెందులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వీచిన బలమైన ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఆదేశాల మేరకు, దెందులూరు ఎస్ఐ వెంకట కుమార్ తమ సిబ్బందితో కలిసి తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్రేన్లు, బుల్డోజర్ల సహాయంతో రహదారులపై అడ్డంగా పడిన వృక్షాలను తొలగించారు. తద్వారా వాహనాల రాకపోకలకు అంతరాయం తొలగించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు సంభవించకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. తుఫాను ప్రభావం ఉన్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, పోలీసు మరియు సంబంధిత శాఖల అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

చింతలకుంట--మాచర్ల--గట్టు మార్గంలో బస్సు సౌకర్యం కల్పించాలి

గట్టు అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గట్టు మండలంలోని చింతలకుంట, మాచర్ల బలిగెర తదితర గ్రామాలతో పాటు ఎల్లందొడ్డి, తారాపురం, కొత్తపల్లి, అంతంపల్లి, చమన్ ఖాన్ దొడ్డి, గొర్లఖాన్ దొడ్డి, తప్పెట్ల మరుసు, గంగిమాన్ దొడ్డి, పెంచికలపాడు, సల్కాపురం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చి చదువుకుంటున్నారు. ముఖ్యంగా చింతలకుంట గ్రామం నుంచి సుమారు 60 మంది, మాచర్ల, బలిగెర పరిసర గ్రామాల నుంచి మరో 60 మంది వరకు విద్యార్థులు కళాశాలకు వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆయా గ్రామాల నుంచి కళాశాలకు సరైన ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇందుకోసం ఒక్కో విద్యార్థి నెలకు సుమారు రూ. 1,000 వరకు ఆటో కిరాయా చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద విద్యార్థుల కుటుంబాలకు ఈ అదనపు ఖర్చు భారంగా మారింది. ఆటో కిరాయి చెల్లించలేని పరిస్థితుల్లో కొందరు విద్యార్థులు కాలినడకన, ఇతర వాహనాలకు లిఫ్ట్ అడిగి కళాశాలకు చేరుకుంటున్నారు. మరికొందరు తల్లిదండ్రులు రవాణా సౌకర్యం లేకపోవడంతో తమ పిల్లలను కళాశాలకు పంపకే చదువును మధ్యలోనే ఆపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు , కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కోరుతున్నారు. కళాశాల సమయానికి అనుగుణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో చింతలకుంట--మాచర్ల--గట్టు మార్గంలో ఒక ఆర్టీసీ బస్సును నడిపితే విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు కళాశాలకు హాజరు శాతం పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

వీబీ--జీ రామ్ జీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

గ్రామీణ ఉపాధి,నీటి భద్రత,పశుసంపద సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి -- మంత్రి దనసరి అనసూయ (సీతక్క)

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సింగరావు



గద్వాల అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఎల్నినో ప్రభావం గ్రామీణ ప్రాంతాలపై పడకుండా వీబీ--జీ రామ్ జీ పనులను ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ a గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీ రాజ్ a గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క),పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ఉన్నతాధికారులతో వీబీ --జీ రామ్ జీ అమలు పై జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు, ఐటీడీఏ పీఓలు, ఎంపీడీవోలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్ a గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఎల్నినో ప్రభావ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధిపై ఎలాంటి ప్రభావం పడకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా అండగా నిలుస్తూ, నీటి భద్రతను పెంపొందించేలా వీబీ --జీ రామ్ జీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో వీబీ --జీ రామ్ జీ పనుల అమలులో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని, కూలీలను సమీకరించి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, గ్రామాల్లో మేట్లను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ అందించి పనుల నిర్వహణలో సమర్థవంతంగా భాగస్వాములను చేయాలని తెలిపారు. రాష్ట్రంలో చెరువుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని చెరువులు, కాలువలను గుర్తించి, వాటిలో పూడిక తొలగింపు పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఎల్నినో ప్రభావంతో పశువులకు నీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేసి నిరంతరం నీటి లభ్యత ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎల్నినో ప్రభావంతో పశుగ్రాస కొరత తలెత్తకుండా వీబీ --జీ రామ్ జీ పథకం కింద పశుగ్రాస సాగును ప్రోత్సహిస్తూ, ఎకరాకు రూ. 14,000 ఆర్థిక సహాయం అందించే అంశంపై రైతులకు అవగాహన కల్పించి, పశుసంపద సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జలనిధి లో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, ప్రతి ఊరికి ఊట కుంటలు, ప్రతి పంటకు నీటి కుంటలు నిర్మించి వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు మరియు విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల పనులను వేగవంతం పూర్తి చేయాలన్నారు. వీబీ--జీ రామ్ జీ పథకం కింద చేపట్టే పనులను స్పష్టమైన ప్రణాళికతో, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామాల్లో వీబీ--జీ రామ్ జీ పథకం కింద ఉత్తమంగా పనులు చేపట్టి విజయవంతంగా అమలు చేసిన సర్పంచులు, ఎంపీడీవోలు,సంబంధిత అధికారులతో మాట్లాడి, వారి కృషిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ, జిల్లాలో గ్రామీణాభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్మాణంలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని మూసాయిదా బేగం, డీఈఓ శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్, మిషన్ భగీరథ ఈఈ లు శ్రీధర్ రెడ్డి, పరమేశ్వర్, వివిధ శాఖల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యత అవార్డుకు విజయభాస్కర్ రెడ్డి, చంద్రయ్య ఎంపిక

హైదరాబాద్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా మదిగెల విజయభాస్కర్ రెడ్డి, కర్రోళ్ల చంద్రయ్యలను జాతీయ ఐక్యత అవార్డు--2026కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. ఈ నెల 31న తెలంగాణ శాసనమండలి మినీ హాల్లో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండ ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసామరస్యం, ప్రజలకు వైద్య, విద్య సహాయం తదితర సేవలకు గుర్తింపుగా వీరిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

మా చెరువు శివారుని కబ్జా చేస్తే ఊరుకునేది లేదు

- అక్రమంగా చెరువు శివారును చదును చేయడంపై తిమ్మాపూర్ ప్రజల ఆగ్రహం

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర)మా చెరువు శివారును కబ్జా చేయాలని చూస్తే ఊరుకునేది లేదని తిమ్మాపూర్ ప్రజలు, యువత ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా గుంటూరు పల్లె గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో తిమ్మాపూర్ శివారులోని ఊర చెరువును కబ్జా చేసి ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో పోచమ్మ తల్లి దేవాలయం నిర్మించడంతోపాటు, బోరు వేశారు. దానితో ఆగకుండా దసరాకు నాలుగు రోజుల ముందు ఊర చెరువు శివారులో భూమి చదును చేసి మొరం నింపారు. దీనిని ఖండిస్తూ తిమ్మాపూర్ సర్పంచ్ ముప్పు మానస మహేందర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సదానందం, జి పి కృష్ణ ఆ స్థలాన్ని పరిశీలించేందుకు బుధవారం గ్రామానికి రావడంతో తిమ్మాపూర్ గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో ఆ స్థలానికి చేరుకొని తమ స్థలాన్ని కబ్జా చేసి ఆక్రమించాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 55 ఎకరాలలో ఉన్న చెరువు కింద కింద 250 ఎకరాల సాగు భూమి ఉన్నది. అలాంటి చెరువును ఎవరి అనుమతి లేకుండా గుంటూరు పల్లె వాసులు ఇష్టం వచ్చినట్లు సుమారు రెండు ఎకరాల భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మాపూర్ గ్రామంలో ప్రజలకు నీటి ఎద్దడి ఏర్పడుతుంది అని తాము బాధపడుతుంటే తిమ్మాపూర్ గ్రామ శివారు లోకి వచ్చి గుంటూరు పల్లె వాసులు బోరు వేసి నీళ్లు తరలిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ చెరువు విస్తీర్ణంలోకి వచ్చి భూమి చదును చేసి మొరం పోసి కబ్జా చేయాలని చూస్తున్న గుంటూరు పల్లె గ్రామపంచాయతీ పాలకవర్గంపై చర్యలు తీసుకొని తమ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ప్రజలు అధికారులను కోరారు.

టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తుళ్ల రవి నియామకం

హన్మకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర)టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తుళ్ల రవికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు నియామక ఉత్తర్వుల ప్రతిని హన్మకొండ సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర అధ్యక్షులు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ డిపార్ట్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో తుళ్ల రవి విజయవంతంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకాంక్షించారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ డిపార్ట్మెంట్ విస్తరణకు తుల్ల రవి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, అంకితభావంతో పనిచేసి రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షులు వెంకన్న గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, ఐనవోలు

మాజీ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కొత్తపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, ఐఎన్టియుసి జిల్లా ఉపాధ్యక్షులు పోశాల మధుకర్ గౌడ్, ఐఎన్టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి దీకొండ ఉపేందర్,ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి యాదగిరి,సర్పంచ్ ఫోరం ఉపాధ్యక్షులు దుబ్బ అంజన్న,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దామర ప్రశాంత్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెపాక సమ్మయ్య ,నిరంజన్ తదితరులు పాల్గొన్నారు

ధరూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా టీకాల అధికారి డాక్టర్ అస్గర్ అలీ

ధరూర్ అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. సంధ్యా కిరణ్మయి ఆదేశాల మేరకు, జిల్లా టీకాల అధికారి (డిఐఓ) డాక్టర్ అస్గర్ అలీ బుధవారం ధరూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) ను, ధారూర్, మన్నాపూర్ సబ్ సెంటర్లను ఆకస్మికంగ సందర్శించి, మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాల పురోగతిని, చిన్నారులకు అందిస్తున్న వ్యాక్సినేషన్ సేవలను, టీకాల రికార్డులను, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. అర్హులైన గర్భిణీ స్త్రీలకు, చిన్నారులందరికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందేల చర్యలు తీసుకోవాలని, టీకాలకు దూరమైన గర్భిణీ స్త్రీలకు, చిన్నారులను గుర్తించి వారికి కూడ టీకాలు వేయించాలని సూచించారు. అదేవిధంగ మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని సమర్థవంతంగ అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులందరికి టీకాలు అందేల వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి వి ఎల్ ఎం - నరేంద్రబాబు, ఇన్చార్జి జిల్లా మీడియ విస్తరణ అధికారి హీర్యనాయక్, పి హెచ్ సి. తిర్మలరాణి పాల్గొన్నారు.

మంచిలోనే మత్తు వెతకండి.. మత్తుకు బానిస కాకండి

నశాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో డా. కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్నగర్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కాగజ్నగర్ పట్టణంలోని పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో నశాముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా రెడ్క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జవహర్ నవోదయ విద్యాలయం ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల వర్చువల్గా చేసిన ప్రసంగాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, వాటి వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. యువతలో చైతన్యం తీసుకురావడంతో పాటు మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని

పిలుపునిచ్చారు. "మంచిలోనే మత్తు వెతకండి.. మత్తుకు బానిస కాకండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పోతురాజుల లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు హితేష్ అగ్రవాల్, పోతురాజుల మధు, పూల రఘు, పోతురాజుల రమేష్, చిప్ప రాజు, జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కి వినతిపత్రం అందజేసిన పిడిఎస్ యు,ఐఎస్ఐ టియు. నాయకుల

గద్వాల అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపుల్లో ఔషధ నియంత్రణ నిబంధనలు కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పిడిఎస్ యు,ఐఎస్ఐ టియు. నాయకుల బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంఎచ్ఓ) కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి మెడికల్ షాపులో అర్హత కలిగిన రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ అందుబాటులో ఉండాలని, చెల్లుబాటు అయ్యే డ్రగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని డిమాండ్ చేశారు. ఫార్మసిస్ట్ లేకుండా మందుల విక్రయాలు జరగకుండా, వైద్యుల ప్రిస్క్రిప్షన్ అవసరమైన మందులను నిబంధనలకు అనుగుణంగా విక్రయించేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ప్రతి మెడికల్ షాపులో అర్హత కలిగిన రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ అందుబాటులో ఉండేలా తనిఖీ చేయాలి, డ్రగ్ లైసెన్సుల చెల్లుబాటు, షాపుల నిర్వహణ నిబంధనలను పరిశీలించాలి,నకిలీ, గడువు ముగిసిన మందుల విక్రయాలను అరికట్టాలి,మందుల నిల్వ, కొనుగోలు--విక్రయ బిల్లులు, సంబంధిత రికార్డులను తనిఖీ చేయాలి,జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించాలని, తనిఖీలను నామమాత్రంగా నిర్వహించకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని నాయకులు కోరారు. నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినప్పుడు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు. జిల్లా అధ్యక్షులు హాలింపాష, ఐఎఫ్ టియు. జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్, జమ్మిచేడు సుధాకర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు

అనాథాశ్రమం నుంచి హిమాలయాల వరకు.. బైక్‌పై సాహస ప్రయాణం.. వ్యాపార రంగంలో సరికొత్త లక్ష్యంతో లునావత్ పవన్!

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర):ప్రతికూలతలను అధిగమించి.. దేశమంతా చుట్టేస్తూ భవిష్యత్తుకు బాటలుమోటోవ్లాగింగ్‌తో గుర్తింపు.. పౌల్ట్రీ రంగంలో పారిశ్రామికవేత్తగా ఎదగాలనే సంకల్పంప్రత్యేక కథనం:జీవితంలో ఎదురయ్యే కష్టాలే కొందరికి బలంగా మారుతాయి.. సవాళ్లే మరికొందరికి విజయానికి మెట్లవుతాయి. అలాంటి ప్రయాణమే లునావత్ పవన్‌ది. ఖమ్మం జిల్లా తనికెళ్లలోని గ్రేస్ చిల్డ్రన్ స్కూల్ అనాథాశ్రమంలో బాల్యాన్ని గడిపిన పవన్.. నేడు దేశంలోని పలు ప్రాంతాలను బైక్‌పై అన్వేషిస్తూ, సాహస యాత్రికుడిగా గుర్తింపు పొందడంతో పాటు, భవిష్యత్తులో పారిశ్రామికవేత్తగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. ప్రతికూల పరిస్థితులు తన ప్రయాణానికి అడ్డుకాకుండా, వాటినే అనుభవాలుగా మలుచుకుంటూ సాగుతున్న అతని జీవన ప్రస్థానం యువతకు స్ఫూర్తినిస్తోంది.కష్టాల మధ్య విద్యాభ్యాసం.. లక్ష్యం వైపు తొలి అడుగుతల్లిదండ్రుల ఆదరణకు దూరంగా అనాథాశ్రమంలో పెరిగిన పవన్‌కు అక్కడి క్రమశిక్షణ, పట్టుదల జీవితంలో ముందుకు సాగేందుకు పునాదిగా నిలిచాయి. తన ప్రతిభతో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం పొంది, మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేశాడు. విద్యాభ్యాసం అనంతరం సాధారణ ఉద్యోగ జీవితానికే పరిమితం కాకుండా, తనకు నచ్చిన రంగాన్ని గుర్తించేందుకు వివిధ ఉద్యోగాలు చేస్తూ అనుభవాన్ని సంపాదించాడు.ఉద్యోగం నుంచి అన్వేషణ వైపు.. ప్రయాణమే పాఠశాలగా!జీవితానికి సరైన దిశను నిర్ణయించుకోవాలంటే దేశంలోని విభిన్న ప్రాంతాలను చూడాలని భావించిన పవన్.. ప్రయాణ రంగంలోకి అడుగుపెట్టాడు. హైదరాబాద్‌లోని ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్‌లో టూర్ హెల్పర్‌గా పనిచేస్తూ ప్రయాణ నిర్వహణపై అవగాహన పెంచుకున్నాడు. కర్ణాటకతో పాటు చార్‌ధామ్ యాత్రలోనూ పాల్గొని కొత్త అనుభవాలను పొందాడు.అనంతరం ఢిల్లీకి చెందిన కింగ్‌హిల్స్ సంస్థలో టూర్ మేనేజర్‌గా పనిచేసే అవకాశం లభించింది. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల ప్రజలు, వ్యాపారవేత్తలతో పరిచయాలు పెంచుకుంటూ వారి ఆలోచనా విధానాలు,

వ్యాపార నిర్వహణ, నిర్ణయాలు తీసుకునే పద్ధతులను పరిశీలించాడు. ఈ అనుభవాలు అతనిలో సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనే ఆలోచనను మరింత బలపరిచాయి.హిమాలయాల్లో అన్వేషణ.. పౌల్ట్రీ రంగంపై పరిశోధనవ్యాపారం ప్రారంభించాలనే సంకల్పంతో ఏ రంగాన్ని ఎంచుకోవాలనే అంశంపై స్పష్టత కోసం పవన్ స్పితి, లడఖ్ వంటి ప్రాంతాల్లో పర్యటించాడు. అక్కడి ప్రజల జీవన విధానం, స్థానిక పరిస్థితులను తెలుసుకుంటూ తన భవిష్యత్తు ప్రణాళికలకు అవసరమైన అవగాహన పెంచుకున్నాడు.ఈ క్రమంలో పౌల్ట్రీ రంగంపై ఆసక్తి పెంచుకున్న పవన్.. నాటుకోళ్ల పెంపకంలో ఎదురయ్యే సమస్యలు, కోళ్ల ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నివారణ, బయోసెక్యూరిటీ విధానాలు, మేత ఖర్చుల నియంత్రణ వంటి అంశాలపై సుమారు ఎనిమిది నెలల పాటు ప్రత్యక్షంగా అధ్యయనం చేసినట్లు తెలిపాడు. ఈ రంగంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ, ఖర్చులను నియంత్రించి, నష్టాలను తగ్గించే విధానాలతో ముందుకు సాగాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకున్నాడు.మోటోవ్లాగింగ్‌తో ఆదాయం.. సొంత వ్యాపారానికి పెట్టుబడిపౌల్ట్రీ రంగంలో తన ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలంటే పెట్టుబడి అవసరమని గుర్తించిన పవన్.. ప్రస్తుతం ఉద్యోగంతో పాటు మోటోవ్లాగింగ్‌పై దృష్టి సారిస్తున్నాడు. ఈ రెండు మార్గాల ద్వారా నెలకు రూ.55 వేలకుపైగా ఆదాయం సంపాదిస్తున్నట్లు అతని వివరాలు సూచిస్తున్నాయి.తన బైక్ ప్రయాణాలు, అనుభవాలను యూట్యూబ్, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ చేస్తూ డిజిటల్ వేదికను అభివృద్ధి చేసుకుంటున్నాడు. భవిష్యత్తులో పౌల్ట్రీ ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా చేరవేసేందుకు ఈ వేదికను ఉపయోగించుకోవాలనేది అతని ప్రణాళిక. అంటే, ప్రయాణాల ద్వారా గుర్తింపు సంపాదించడమే కాకుండా, వాటిని తన వ్యాపార లక్ష్యానికి అనుసంధానించుకోవాలని భావిస్తున్నాడు.30 వేల కిలోమీటర్ల బైక్ ప్రయాణం.. ఈశాన్య భారతంపై ప్రత్యేక ఆసక్తిసాహస యాత్రలపై ఆసక్తి పవన్‌ను ఈశాన్య భారతంలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లింది. మేఘాలయలో కఠినమైన రహదారులపై సుమారు 30 వేల కిలోమీటర్ల బైక్ ప్రయాణం చేసినట్లు అతను పేర్కొన్నాడు. ఈ యాత్రలు, మోటోవ్లాగింగ్‌పై అతనికి వచ్చిన గుర్తింపులో భాగంగా 'మేఘాలయ టైమ్స్'లోనూ కథనం ప్రచురితమైనట్లు సమాచారం.ప్రస్తుతం మిజోరం రాష్ట్రంలో తన తదుపరి మోటోవ్లాగింగ్ యాత్రను కొనసాగిస్తున్నాడు. అక్కడి కొండ ప్రాంతాలు, ఎత్తుపల్లాల రహదారులు, భిన్నమైన భౌగోళిక పరిస్థితులను అన్వేషిస్తూ తన ప్రయాణ అనుభవాలను డిజిటల్ వేదికల ద్వారా పంచుకుంటున్నాడు.లక్ష్యం ఒక్కటే కాదు.. భవిష్యత్తుపై స్పష్టమైన ప్రణాళిక!లునావత్ పవన్ ప్రయాణం కేవలం బైక్‌పై ప్రాంతాలను చుట్టిరావడానికే పరిమితం కావడం లేదు. విద్య, ఉద్యోగ అనుభవం, దేశ పర్యటనలు, వ్యాపారవేత్తల నుంచి నేర్చుకున్న పాఠాలు, పౌల్ట్రీ రంగంపై అధ్యయనం.. ఇలా ప్రతి దశనూ తన భవిష్యత్తు లక్ష్యానికి అనుసంధానించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.అనాథాశ్రమంలో ప్రారంభమైన జీవితం నుంచి సాహస యాత్రల వరకు సాగిన అతని ప్రస్థానం.. సరైన లక్ష్యాన్ని గుర్తించేందుకు అన్వేషణ, అనుభవం, నిరంతర ప్రయత్నం ఎంత ముఖ్యమో గుర్తుచేస్తోంది. మిజోరం యాత్రలో మరిన్ని అనుభవాలను సొంతం చేసుకుంటూ, భవిష్యత్తులో పౌల్ట్రీ రంగంలో తనదైన వ్యాపారాన్ని స్థాపించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న లునావత్ పవన్‌కు విజయాలు చేకూరాలని ఆకాంక్షిద్దాం.

విద్యార్థినుల భద్రతపై అవగాహన సదస్సు

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

.. వేధింపులు ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

కాగజ్నగర్ , అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర): ఈజ్‌గావ్ పోలీస్ స్టేషన్‌లో శాంతినికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు బాలికల భద్రత, వ్యక్తిగత రక్షణ, అప్రమత్తతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పి. భార్గవి పాల్గొని విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే అప్రమత్తం కావాలని తెలిపారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. చెడు స్పర్శ, మంచి స్పర్శ మధ్య తేడాను ప్రతి విద్యార్థిని తెలుసుకోవాలని, తమకు ఇబ్బందికరంగా అనిపించే ప్రవర్తనను నిర్లక్ష్యం చేయకూడదని వివరించారు. పాఠశాలలో, ఇంటి వద్ద ప్రయాణ సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆపద సమయంలో పోలీసులను ఎలా సంప్రదించాలి, అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను వివరించారు. సోషల్ మీడియా వినియోగంలోనూ అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, వేధింపులకు గురిచేసినా మౌనంగా ఉండకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. విద్యార్థినుల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు బాలికల్లో ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రమాదకర పరిస్థితులను గుర్తించే సామర్థ్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొమురవెల్లి లో నిర్వహిస్తున్న భూ సర్వే తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 28 అక్టోబర్ (విజన్ ఆంధ్ర)సిద్దిపేట జిల్లా లోగల కొమురవెల్లి మండలం తపాస్ పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి భూముల రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూదేశానికి స్వాతంత్రపు పూర్వం చేసిన భూముల సర్వే మళ్ళీ ఇప్పుడు భూముల సర్వే చేయడం జరుగుతుందని, పెరిగిన జనాభా ఆధారంగా భూ సమస్యలు ఎక్కువ మొత్తంలో పెరిగాయని దీనికి శాశ్వత పరిష్కారం అందించడం కోసం ప్రభుత్వం భూ-భారతి రీ-సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ విస్తీర్ణం ఎంత, ఇప్పటి వరకు ఎంత సర్వే జరిగిందనే విషయాలను అధికారులతో ఆరా తీశారు. రీ-సర్వే లో వేగం పెంచాలని ఉదయం మొదలు పెట్టీ రోజు 40 ఎకరాల పైన సర్వే చేసేలా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారుభూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే సమయంలో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, హద్దులు, పట్టా వివరాలు తదితర అంశాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని తెలిపారు. సర్వే లో ప్రతిదీ రెవెన్యూ రికార్డు లో పొందుపరచాలని, సర్వే చేసిన భూ వివరాలను సంబంధిత భూమి యజమానులకు తెలియజేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. భూ భారతి రీ-సర్వే కి రైతులు సహకరించాలని, దీని ద్వారా హద్దులు, సర్వే నెంబర్ బై నంబర్ ల సమస్య తలెత్తకుండా పగడ్బందిగా నిర్దేశించుకోవడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట తహసిల్దార్, స్థానిక సర్పంచ్ , ప్రజా ప్రతినిధులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు పిర్యాదు చేసిన బీఎస్పీ నాయకులు

నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) నారాయణ పేట జిల్లా కేంద్రంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలిపిన గత శుక్రవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ పై దాడికి ప్రయత్నించి,తన అనుచరులపై చేయి చేసుకొని,బెదిరింపులకు పాల్పడిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచరులపై నేడు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. అనంతరం బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూనియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల అధిపత్య కుల రాజకీయాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే అండతోనే ఇట్లాంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారని కాంగ్రెస్ నాయకుల తీరు మారకుంటే తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ ఘటన యావత్ బహుజన సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని తెలిపారు. బాధ్యులను తక్షణమే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు కొక్కు గౌతం,నారాయణ పేట అసెంబ్లీ అధ్యక్షులు దాసరి అశోక్ అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా నాయకులు ఈశ్వరమ్మ,చంటి, రమేష్, బీఎస్పీ నాయకులు హనుమంతు ,వెంటయ్య, నాని,మోహన్,రామాంజనేయులు,తిరుపతయ్య,బాల చందర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా క్షేత్రంలోనైనా న్యాయస్థానంలోనైనా... మా ప్రయాణం ప్రజల కోసమే: రావు పద్మ రెడ్డి

హన్మకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర):"ప్రజల పక్షాన నిలబడి పోరాడే క్రమంలో ఎలాంటి చట్టపరమైన సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు అని, ప్రజాక్షేత్రంలోనైనా, న్యాయస్థానంలోనైనా మా ప్రయాణం ప్రజల సంక్షేమం కోసమే కొనసాగుతుంది" అని బిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ పోటీదారు శ్రీమతి రావు పద్మ రెడ్డి స్పష్టం చేశారు. 2023 శాసనసభ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ పేరుతో నమోదైన రాజకీయ కేసుకు సంబంధించి, బుధవారం నాడు హైదరాబాద్ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ:"దేశ చట్టాలను సంపూర్ణంగా గౌరవిస్తూ, న్యాయస్థానాలపై పూర్తి విశ్వాసంతో ముందుకు సాగుతున్నాం. చివరికి న్యాయమే గెలుస్తుందనే నమ్మకం మాకుంది. రాజకీయ సమీకరణాలు, కేసులు మమ్మల్ని ప్రజాసేవ నుంచి పక్కకు తప్పించలేవు. నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉంటాం అని తెలియజేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తో మర్యాదపూర్వక భేటీఅదే సమయంలో వేరే కేసు విచారణ నిమిత్తం నాంపల్లి కోర్టుకు విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారిని రావు పద్మ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియ మరియు నియోజకవర్గ అంశాలపై వారు చర్చించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రైవేట్ పాఠశాలల్లో ఆకస్మికంగా తనిఖీలు చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి

అయిజ అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర)ప్రైవేట్ పాఠశాలలు నిబంధనల ప్రకారం తమ విద్యాసంస్థలను నిర్వహించాలని, లేనిపక్షంలో తగు చర్యలు తీసుకుంటామని డిఈఓ విజయలక్ష్మి అన్నారు.బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, న్యూ గీతాంజలి పాఠశాలలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు.శ్రీ చైతన్య పాఠశాలలో ఇరుకైన తరగతి గదులు, గాలి, వెలుతురు సరిగా లేకపోవడం, తగిన భద్రతా ఏర్పాట్లు, ఆటస్థలం లేకపోవడం గమనించారు. విద్యార్థులను తగిన రక్షణ లేకుండా ఇసుకలో కూర్చోబెట్టడాన్ని గుర్తించారు.న్యూ గీతాంజలి పాఠశాలలోనూ ఇరుకైన తరగతి గదులు, గాలి వసతి లేకపోవడం, భద్రతా లోపాలు, ఆటస్థలం లేకపోవడాన్ని గుర్తించారు. ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులను కొడుతున్నట్లు, విద్యార్థులు ఇన్వర్టర్ బ్యాటరీల పక్కన ఎలాంటి జాగ్రత్తలు లేకుండా కూర్చుంటున్నట్లు గమనించారు. ఈ పరిస్థితులు విద్యార్థుల భద్రతకు ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. రెండు పాఠశాలల్లో ఫీజుల వివరాలను ప్రదర్శించినప్పటికీ, విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక వసతులు, భద్రతా సదుపాయాల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు డీఈఓ గుర్తించారు. విద్యార్థుల భద్రత, సౌకర్యాల విషయంలో పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించరాదని, నిబంధనలకు అనుగుణంగా అవసరమైన వసతులు కల్పించాలని స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ఆరోగ్యకరమైన, మత్తు రహిత దేశాన్ని నిర్మిద్దాం హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి ఆర్ట్స్ కళాశాల నుండి రెడ్ క్రాస్ సొసైటీ వరకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర)మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి అన్నారు. యువత, విద్యార్థులు, ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణ నుంచి హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి జెండా ఊపి ప్రారంభించి, స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. మాదకద్రవ్యాల లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత తమ శక్తి, ప్రతిభను విద్య, క్రీడలు, సామాజిక సేవ, దేశ నిర్మాణం వంటి సానుకూల కార్యక్రమాల వైపు మళ్లించాలని సూచించారు.ర్యాలీలో పాల్గొన్న రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు "మాదకద్రవ్యాలకు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన జీవితానికి అవును చెప్పండి", "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి -- దేశాభివృద్ధిలో భాగస్వాములు కండి" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.మాదకద్రవ్యాల అలవాటు వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డాక్టర్ సి.హెచ్. సంధ్యారాణి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, డాక్టర్ గొట్టిముక్కల శ్రీలక్ష్మి, పొన్నాల సంయుక్త, రెడ్‌క్రాస్ సిబ్బంది, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం.. మాదకద్రవ్యాల కట్టడికి సమష్టి కార్యాచరణ

మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలి

శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, గంజాయి సాగు, అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో (ఐడీఓసీ) బుధవారం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితెతో కలిసి కలెక్టర్ జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ, మాదకద్రవ్యాల నియంత్రణ, డీ అడిక్షన్ కేంద్రాల్లో వైద్య సేవలు, శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.విద్యాసంస్థల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలుడ్రగ్స్ నియంత్రణకు ప్రతి శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆహార భద్రతా అధికారులు సంబంధిత దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. వైద్య ఆరోగ్య, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని 10 డిగ్రీ కళాశాలలు, 20 జూనియర్ కళాశాలల్లో సుమారు 2,600 మంది విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులతో కమిటీలు ఏర్పాటు చేసి, ప్రతిరోజూ ప్రార్థనా సమయంలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు.గంజాయి సాగుపై నిఘా.. బానిసలకు చికిత్సఅటవీ, వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి, వారికి అవసరమైన వైద్యం, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు.జిల్లాలో డ్రగ్స్, గంజాయి నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోందని ఎస్పీ మహేష్ బి. గితె తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వ్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, ఇంటర్మీడియట్ విద్యాధికారి శరత్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూషతో పాటు వ్యవసాయ, కార్మిక, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధునాతన తయారీతో ప్రపంచ పోటీలో భారత్ ముందుకు సాగాలి

హైదరాబాద్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్, దేశీయ విలువ జోడింపు, ఎంఎస్‌ఎంఈల బలోపేతం, నైపుణ్యాభివృద్ధితో భారత తయారీ రంగాన్ని ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాలని పలువురు పారిశ్రామిక ప్రముఖులు పిలుపునిచ్చారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన అధునాతన తయారీ రంగ జాతీయ సదస్సులో వారు మాట్లాడారు. తెలంగాణ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్(ఐఏఎస్), సీఐఐ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్, మోగ్లిక్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాహుల్ గార్గ్, సైయంట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్.మోహన్ రెడ్డి, మైక్రాన్ ఇండియా ఎండీ ఆనంద్ రామమూర్తి, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ ఎం.గౌతమ్ రెడ్డి, రాక్‌వెల్ ఆటోమేషన్ ఇండియా ఎండీ దిలీప్ సాహ్నీ, సీఐఐ తెలంగాణ వైస్ ఛైర్మన్ గౌరవ్ మహేశ్వరి పాల్గొన్నారు.

చెన్నై మూడవ జాతీయ మహాసభల్లో యంగ్ సోషల్ రిఫార్మర్ అవార్డు-2026 అందుకున్న ఏదుల నాగరాజుకు

గద్వాల అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం, ఆరగిద్ద గ్రామం మూఢనమ్మకాల నిర్మూలన, శాస్త్రీయ దృక్పథం, సామాజిక చైతన్యం, సమానత్వం కోసం కృషి చేస్తున్న మూఢనమ్మకాల నిర్మూలన సంఘం (ఎంఎన్ఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఏదుల నాగరాజుకు యంగ్ సోషల్ రిఫార్మర్ అవార్డు--2026 లభించింది.తమిళనాడు రాష్ట్రం చెన్నైలో 2026 అక్టోబర్ 17, 18, 19 తేదీల్లో నిర్వహించిన ఎంఎన్ఎస్. మూడవ జాతీయ మహాసభల్లో ఈ అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా సామాజిక మార్పు కోసం కృషి చేస్తున్న 25 మందికి ఈ అవార్డులను అందించగా, వారిలో ఏదుల నాగరాజు ఒకరిగా నిలిచారు. ఎంఎన్ఎస్. వ్యవస్థాపకులు డాక్టర్ బైరి నరేష్ చేతుల మీదుగా, సంఘం సమన్వయకర్త గాండ్ల సుజాత టీచర్ సమక్షంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.చెన్నైలో లభించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు ఆరగిద్ద గ్రామంతో పాటు గట్టు మండలం, జోగులాంబ గద్వాల జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ పురస్కారం తన సామాజిక బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులోనూ మూఢనమ్మకాల నిర్మూలన, సామాజిక సమానత్వం, మానవ హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తానని ఏదుల నాగరాజు పేర్కొన్నారు.

జర్నలిస్టుపై దాడి ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీని కలిసి న్యాయం కోరిన బాధిత జర్నలిస్టు, తోటి పాత్రికేయులు


1) దాడికి సంబంధించిన స్పష్టమైన వీడియో ఫుటేజ్.
2) ప్రభుత్వ ఆసుపత్రి ఎం.ఎల్.సి మరియు ట్రీట్మెంట్ రిపోర్ట్
3) 19 వ తారీకున ఇచ్చిన ఫిర్యాదు
4) దెబ్బ తగిన కుడి చేతి ఫోటో
5) పగిలిపోయిన సెల్ ఫోటో
6) ఆధార్ కార్డు జిరాక్స్
ఇట్లు
కుసుమ చంద్రశేఖర్
కాంతయ్య (లేటు)
విజయ ఆంధ్ర డైలీ న్యూస్ పేపర్
జిల్లా స్టాఫ్ రిపోర్టర్
భూపాలపల్లి జిల్లా
Cell no 9493718904

భూపాలపల్లి టౌన్ : అక్టోబరు 28 (విజన్ ఆంధ్ర) తనపై దాడి జరిగిందని ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని జర్నలిస్టు కుసుమ చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయనతోపాటు పలువురు తోటి జర్నలిస్టులు జిల్లా ఎస్పీని కలిసి ఘటనపై ఫిర్యాదు చేశారు. దాడికి బాధ్యులైన వారిపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరారుకుసుమ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న జరిగిన ఘటనలో 19వ వార్డు కౌన్సిలర్ తనపై దాడికి పాల్పడ్డారని, తన సెల్‌ఫోన్ ధ్వంసమైందని ఆరోపించారు. సుమారు రూ.19,500 విలువైన రియల్‌మీ ఎక్స్2 ఫోన్ దెబ్బతిన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఈ ఘటనపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడుల ఘటనలను తీవ్రంగా పరిగణించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని తోటి జర్నలిస్టులు కోరారు.

గంగకత్వ ప్రాజెక్టు, కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లు మంజూరు

-గంగ కత్వ కాలువను పరిశీలించి డైవ్ చేసి ఈత కొట్టిన జగ్గారెడ్డి

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :28(విజన్ ఆంధ్ర)గంగకత్వ ప్రాజెక్టు, కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లు మంజూరయన నేపథ్యం లో జగ్గారెడ్డి గంగ కత్వ ప్రాజెక్ట్ ను పరిశీలించారు. సదాశివపేట మండలం సూరారం గ్రామంలోని గంగకత్వ ప్రాజెక్టును పరిశీలించిన ఆయన, సాగునీటి శాఖ అధికారులు, ఆయకట్టు గ్రామాల రైతులు, స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గంగకత్వ కాలువ పరిధిలోని 11 గ్రామాల్లో 3,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. సదాశివపేట మండలంలో సుమారు 16 కిలోమీటర్ల మేర విస్తరించిన కాలువకు 28 చెరువులు అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. కాలువను ఆధునీకరించి, చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.ఆధునీకరణ నిధుల కోసం రెండేళ్ల క్రితం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరానని, అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించానని తెలిపారు. రూ.37 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా లేకపోయినా రైతుల ప్రయోజనాల కోసం నిధులు తీసుకువచ్చానన్నారు. ఏడో నిజాం కాలంలో నిర్మించిన కాలువను తిరిగి ఆధునీకరించే అవకాశం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని, కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వొద్దని అధికారులకు సూచించారు**లీకేజీల నివారణకు చర్యలు**కాలువ లైనింగ్, దెబ్బతిన్న భాగాల మరమ్మతులు, పక్కలకు సీసీ లైనింగ్, తూముల పునరుద్ధరణ, వంతెనల వెడల్పు పెంపు తదితర పనులపై సమీక్షించారు. కాలువ పొడవునా తనిఖీలకు ఉపయోగపడే దారిని పునరుద్ధరించాలని సూచించారు. కాలువ నీరు చెరువులకు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో కాలువలు తెగిపోతున్నాయని చందాపూర్ గ్రామస్థులు తెలిపారు. మిలిగిరిపేట పరిధిలో వాగుల్లో పూడిక తొలగించాలని కోరారు. కాలువలు సరిగా లేక నీరు గ్రామంలోకి వస్తోందని పొట్పల్లి వాసులు వివరించారు. ప్రాజెక్టు చివరన ఉన్న తమ గ్రామానికి నీరందడం లేదని యెన్కేపల్లి రైతులు తెలిపారు. ప్రధాన కాలువ తూము వద్ద లీకేజీలతో నీరు వృథా అవుతోందని చెప్పారు. ఆత్మకూరు పరిధిలో లీకేజీలను అరికట్టి చెరువులకు నీరు మళ్లించాలని, అంకెన్‌పల్లిలో కాలువ ఆకృతి సవరణ, గట్ల బలోపేతం పనులు చేపట్టాలని స్థానికులు కోరారు. సమస్యలను పరిశీలించి అవసరమైన పనులకు అంచనాలు రూపొందించాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు.వాగుపై ఏడు చెక్‌డ్యామ్‌లకు ప్రతిపాదనలుగంగకత్వ ఆధునీకరణకు అదనంగా వాగుపై ఏడు చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని జగ్గారెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి ప్రాంతం నుంచి గంగకత్వకు వచ్చే వాగును అభివృద్ధి చేస్తే నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాగు, ప్రాజెక్టులో పూడిక తొలగింపునకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టులో ఆరు నుంచి ఏడు అడుగుల మేర పూడిక తొలగించే అవకాశం ఉందని అధికారులు తెలపగా, సాంకేతికంగా ఎంతవరకు సాధ్యమో పరిశీలించాలని కోరారు.కొల్కూరు--నిజాంపూర్ మధ్య మంజీరా బ్యాక్‌వాటర్‌తో పంటలు మునుగుతున్నాయని రైతులు తెలిపారు. అక్కడ చెక్‌డ్యామ్ నిర్మించాలని కోరగా, సాధ్యాసాధ్యాలను పరిశీలించి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.2028 నాటికి పనుల పూర్తికి ప్రణాళికదీపావళి తర్వాత శంకుస్థాపన జరిగేలా చూస్తామని జగ్గారెడ్డి తెలిపారు. డిసెంబర్‌లోపు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. 2028 నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. డిసెంబర్‌లో మరోసారి ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తానని తెలిపారు.నిధులు, పనుల మంజూరు కోసం కృషి చేయడమే తన బాధ్యతని, శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను అధికారులు ప్రోటోకాల్ ప్రకారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి ఈ వాగుతో తనకు అనుబంధం ఉందని, తన భార్య స్వగ్రామం తాటిపల్లి కావడంతో తరచూ ఇక్కడికి వచ్చేవాడినని గుర్తుచేసుకున్నారు. పర్యటన సందర్భంగా గంగకత్వ కాలువలో జగ్గారెడ్డి ఈత కొట్టారు.

భగత్‌సింగ్ నగర్‌లోని నిరుపేదలకు ఇంటి పట్టాలివ్వాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఫీర్జాదిగూడలో పర్యటించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

బోడుప్పల్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర): పేద ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని కొత్తగూడెం ఎమ్మెల్యే,సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.మేడ్చల్ జిల్లా బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్‌లోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో మేడిపల్లి మండల సీపీఐ కార్యదర్శి రచ్చ కిషన్ ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని సీపీఐ పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సంధర్భంగా కాలనీవాసులు కాలనీలో నెలకొన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ,వీధి దీపాలు,మంచినీటి సౌకర్యం వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఇప్పటికీ ఇంటి పట్టాలు అందని అర్హులైన పేదలకు ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోసీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్,జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జి.దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జె.లక్ష్మి, కె.ధర్మేందర్,సత్యప్రసాద్,పార్టీ నాయకులు వీబీ బాలరాజు,కావాలి నరసింహ,సహాయ కార్యదర్శి సీహెచ్ మాధవి,జి. నాగరాజు,కె.ప్రమీల,దండు రమేష్, ఈశ్వర్,జై చంద్ర,కె.మహాలక్ష్మి,మేడ్చల్ జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఎండీ అన్వర్,ఇస్తారి,సోమరాజు,ముడి మార్టిన్,రామకృష్ణ, మొగులయ్య,యాదగిరి, కాలనీవాసులు తదితరులు పాల్గోన్నారు.

అర్ధరాత్రి వేళ బైక్‌పై సీపీ పెట్రోలింగ్ మంచిర్యాలలో ఆకస్మిక తనిఖీలు

మంచిర్యాల: పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసుల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అర్ధరాత్రి వేళ బైక్‌పై పెట్రోలింగ్ నిర్వహించారు. మంచిర్యాల పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో పోలీసుల నిఘా, భద్రతా చర్యలను స్వయంగా తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో పెట్రోకార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజల్లో భద్రతా భావం కల్పించేలా నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, రూరల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్‌ర్యాలీని ప్రారంభించిన

-- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల, అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర బ్యూరో)మాదకద్రవ్యాల నిర్మూలన, యువతను వ్యసనాల బారి నుంచి కాపాడటమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు, భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, కళాశాలల సిబ్బంది సహకారంతో 'నషా ముక్త్ భారత్' నినాదంతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.జోగులాంబ గద్వాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అయ్యపు రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు రమేష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. గద్వాల పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తా వద్ద జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులు బాల్యం నుంచే మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.కృష్ణవేణి చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా మీదుగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, రాజీవ్ మార్గ్ గుండా కొనసాగి పాత బస్టాండ్ సమీపంలోని కూడలి వద్ద ముగిసిందిఅనంతరం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు.అనంతరం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అయ్యపు రెడ్డి విద్యార్థినీ విద్యార్థులతో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ తహేర్ ,ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కృష్ణయ్య,రెడ్ క్రాస్ కార్యనిర్వాహక సభ్యులు, తైక్వాండో కరాటే మాస్టర్ శ్రీహరి,మహేష్ నాయుడు, నరసింహయ్య శెట్టి, రాజశేఖర్, శ్రీ కృష్ణ, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా మేధావుల సదస్సు
కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్

నారాయణపేట అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర) ప్రజాస్వామ్య పరిరక్షణ కోసంనవంబర్ ఒకటవ తేదీ ఆదివారం నాడు ఉదయం 11 గంటలకు నారాయణ పేట జిల్లా కేంద్రంలో శాస నపల్లి రోడ్ లోని లక్ష్మీ బాంకెట్ హాల్ లో మేధావుల సదస్సు నిర్వహిస్తు న్నట్లు కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేధావుల సమావేశానికి, సమాజం లోని డాక్టర్లు న్యాయవాదులు లెక్చరర్లు టీచర్లు కుల సంఘాల నాయకులు వ్యాపార వర్తకులు ఇతరే తర మేధావి వర్గాల అందరి కీ ఇదే మా ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. దేశ విచ్చిత్తికి ప్రజాస్వామ్య అపహస్యానికి వివిధ రకా ల పేర్లతో విదేశీ నిధులతో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకోబడిన వ్యవస్థలను కూల్చి వేయడానికి సిద్ధ మవుతున్న వేళ మేధావు లు కదలివచ్చి మేధావుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మేధావుల సమావేశాన్ని జయప్రదం చేయాలనీ కోరారు.

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి
రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28: (విజన్ ఆంధ్ర)సమాచార హక్కు చట్టంలోని ప్రతి సెక్షనుపై ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, అప్పిలేట్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మోసిన పర్వీన్, దేశాల భూపాల్, బో రెడ్డి అయోధ్య రెడ్డి, వైష్ణవి మెర్ల, జిల్లా కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, అదనపు ఎస్.పి. చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి లతో కలిసి అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులకు నిర్వహించిన సమాచార హక్కు చట్టం సెక్షన్ల అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలోని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ఆర్.టి.ఐ. దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా సమాచారం అందించవచ్చని తెలిపారు. సమాచారం పూర్తి పారదర్శకంగా, సరళీకృతంగా ఉండేలా చూడాలని, ఆర్.టి.ఐ. దరఖాస్తు అంటే ఎలాంటి ఆందోళన, భయం ఉండకూడదని, దరఖాస్తులోని అంశాలను పూర్తిగా తెలుసుకోవాలని, ఇవ్వవలసిన సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఉద్యోగుల వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదని సూచించారు. ప్రపంచంలో 132 దేశాలలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలవుతుందని, సంస్థ విధులు, బాధ్యతలు అధికారులు, ఉద్యోగులు బాధ్యతలు, నిర్ణయ ప్రక్రియ, పర్యవేక్షణ, జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిషనర్ల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ లపై అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తుదారులకు, పౌరులకు సమాచారాన్ని సకాలంలో అందించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పారదర్శకతను పెంపొందించడం, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచార హక్కు చట్టంలోని అంశాలు సెక్షన్లపై సమాచార కమిషనర్లు వివరించారు. అనంతరం సమాచార హక్కు చట్టం అప్పీలు దరఖాస్తులపై హియరింగ్ నిర్వహించారు. అంతకుముందు సమీకృత జిల్లా కలెక్టరేట్ కు చేరుకున్న సమాచార కమిషనర్లకు జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్లు స్వాగతం పలికారు. పోలీసు సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు పాల్గొన్నారు.

రైతులు పశుగ్రాసం సాగు చేసి లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలి
రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28:(విజన్ ఆంధ్ర)వి.బి.జి. రామ్ జీ పథకం క్రింద రైతులు పశువులకు అవసరమైన పచ్చి గడ్డి సాగు చేసి ఆర్థికంగా లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సిఈఓ డి.దివ్య దేవరాజన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, గ్రామీణ అభివృద్ధి అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో వి.బి.జి. రామ్ జీ పథకం అమలు, ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు కురవక పంటలు దెబ్బతింటున్న నేపథ్యంలో రైతులు, గ్రామీణ కూలీలకు వి.బి.జి. రామ్ జీ పథకం క్రింద ఉపాధి పనులు కల్పించాలని తెలిపారు. ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా గ్రామాలలోనే కొత్త పనులను గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. ఉపాధి పనులతో కూలీలకు ఆదాయం లభించడంతో పాటు మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా సి.సి. రోడ్లు, మ్యారేజ్ హాళ్లు, ఇతర గ్రామీణ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వి.బి.జి. రామ్ జీ పథకం క్రింద అనుమతించిన 375 రకాల పనుల గురించి సర్పంచులకు అవగాహన కల్పించి, పనిదినాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పథకం క్రింద చేపట్టిన పనులకు సంబంధించి 10 రోజులలోనే నగదు ఖాతాలలో జమ అయ్యేలా చర్యలు ఉంటాయని, నిధుల విషయంలో సర్పంచులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. మంజూరైన పనులను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సంఘాల (విఓ) భవనాలు, గోదాములు, కమ్యూనిటీ హాళ్ల తదితర అభివృద్ధి పనులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. గ్రామసభలు నిర్వహించి అవసరమైన పనులను గుర్తించి, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాలను అభివృద్ధి చేసుకుని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకునేందుకు వి.బి.జి. రామ్ జీ పథకం మంచి అవకాశమని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన గ్రామానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు అందజేస్తుందని తెలిపారు. పశువులకు త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు నీటి కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పథకం క్రింద చేపట్టాలని సూచించారు. రైతులు, గ్రామ సంఘాల ఆధ్వర్యంలో పశుగ్రాసం సాగు చేస్తే ఎకరానికి 14 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, ఈ సహాయంతో పాటు సాగు చేసిన పచ్చి గడ్డిని విక్రయించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, జిల్లా పశుసంవర్ధక అధికారి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చెరువులు, కాలువలలో పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన గ్రామ సంఘాల భవనాలు, అదనపు గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వి.బి.జి. రామ్ జీ పథకం క్రింద పనిదినాలను పెంచేందుకు కూలీలకు తగిన సంఖ్యలో మేట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నీటి తొట్లు ఏర్పాటు చేయడంతో పాటు పశుగ్రాసం సాగును ప్రోత్సహిస్తామని, నీటి సంరక్షణలో భాగంగా వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పి.ఎం. శ్రీ పాఠశాలలలో ప్రతిభకు వేదికగా జిల్లా స్థాయి ఆర్ట్ కల్చరల్ కార్యక్రమం
జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28:(విజన్ ఆంధ్ర)జిల్లాలోని 18 ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలకు సంబంధించి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆర్ట్ ఉ కల్చరల్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల సంపూర్ణ వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి, తమ ప్రతిభను ప్రదర్శించడానికి జిల్లా స్థాయి ఆర్ట్ ఉ కల్చరల్ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు. పి.ఎం. శ్రీ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి కళా నైపుణ్యాలు, సాంస్కృతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొని ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, డాన్స్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, న్యాయ నిర్ణేతలు రమేష్, గుర్రాల వెంకటేశ్వర్లు, రామస్వామి, పిఎం శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్

భూపాలపల్లి టౌన్ : 28 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందించాలి
జయశంకర్ భూపాలపల్లి పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల (టి డబ్ల్యూ ఏ హెచ్ ఎస్ గర్ల్స్ భూపాలపల్లి) ను బుధవారం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్ సందర్శించి పాఠశాలలోని విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు శాతం, తరగతి గదుల నిర్వహణ, బోధనాభ్యసన కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి చదువుల పురోగతి, సబ్జెక్టులపై అవగాహన, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, భోజనశాల, వంటగది తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని నిర్ణీత మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థినుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు విద్యలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన నిర్వహించాలని తెలిపారు. విద్యార్థినులకు చదువుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాల మరియు వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు, వసతి గృహ సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం అండగా నిలవాలి
టియుడబ్ల్యూజె (హెచ్-143) వికారాబాద్ జిల్లా సంఘం వినతి.. స్పీకర్ ప్రసాద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌లను కలిసిన నూతన కార్యవర్గం

వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర):జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం అండగా నిలవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్ -143) వికారాబాద్ జిల్లా నూతన నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ తో పాటు వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌లను బుధవారం యూనియన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్-143) వికారాబాద్ జిల్లాకు చెందిన నూతన ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాంతాపూర్‌లో ఇద్దరి అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించిన డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు నరేష్ జాదవ్ ఈరోజు శాంతాపూర్ గ్రామంలో నిర్వహించిన ఇద్దరి అంత్యక్రియల్లో పాల్గొని, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. శాంతాపూర్ గ్రామానికి చెందిన సాబ్లె భరత్ రెండు రోజుల క్రితం పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ నిన్న రాత్రి మృతి చెందారు. అలాగే, అదే గ్రామానికి చెందిన బస్సీ గులాబ్ సింగ్ గుండెపోటుతో మృతి చెందారు. వీరిద్దరి అంత్యక్రియలను ఈరోజు శాంతాపూర్ గ్రామంలో నిర్వహించారు. విషయం తెలుసుకున్న నరేష్ జాదవ్ గ్రామానికి చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొని మృతదేహాలకు నివాళులర్పించారు. అనంతరం సాబ్లె భరత్, బస్సీ గులాబ్ సింగ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇద్దరి మృతి పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తొడసం దౌలత్ రావు, మాజీ మండల అధ్యక్షులు అంకత్ రవి, గోండ్ హర్కపూర్ సర్పంచ్ జాదవ్ నిశాంత్,రాదేశ్యం, బండారి సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో ఘనంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు
బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన నార్కోటిక్ డాగ్‌ల ప్రాముఖ్యత, మాదకద్రవ్యాల గుర్తింపులో వాటి పాత్రపై అవగాహన

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28: (విజన్ ఆంధ్ర)పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాహిత కార్యక్రమాల్లో భాగంగా జిల్లా ఎస్పీ నితికా పంత్, ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పాఠశాల విద్యార్థినీ,విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీస్ శాఖ విధులు,పోలీస్ స్టేషన్ పనితీరు, అత్యవసర సమయాల్లో పోలీసులు ఉపయోగించే పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ వ్యవస్థ తదితర అంశాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు,విధి నిర్వహణ విధానాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. ఫిర్యాదుల స్వీకరణ,కేసుల నమోదు,దర్యాప్తు ప్రక్రియ,ప్రజలకు అందించే పోలీస్ సేవలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన,పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ రికార్డులు మరియు సాంకేతిక వ్యవస్థల గురించి వివరించారు. ప్రజలకు మెరుగైన,వేగవంతమైన సేవలు అందించేందుకు పోలీస్ శాఖ అనుసరిస్తున్న విధానాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రత్యేక డ్రిల్ నిర్వహించి విద్యార్థులకు ప్రదర్శించారు. పోలీస్ విధుల్లో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా నార్కోటిక్ డాగ్‌ల ప్రాముఖ్యతను, మాదకద్రవ్యాల గుర్తింపు మరియు అక్రమ రవాణా నియంత్రణలో అవి పోషించే కీలక పాత్రను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా పోలీస్ కమ్యూనికేషన్ విభాగం పనితీరు, అత్యవసర సమయాల్లో సమాచారాన్ని వేగంగా చేరవేయడంలో కమ్యూనికేషన్ వ్యవస్థ ప్రాముఖ్యతను సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎందుకు నిర్వహిస్తారనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. పోలీసులంటే భయపడకుండా గౌరవంతో వ్యవహరించాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించి సహాయం పొందాలని సూచించారు. ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీస్ శాఖ 24 గంటలూ సేవలందిస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం కొనసాగడానికి గతంలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు కూడా ఒక ముఖ్య కారణమని గుర్తు చేశారు. అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి సేవలను భావితరాలకు తెలియజేయాలని తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రజాహిత కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ,కెరమెరి ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది,ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తడి వాగు కెనాల్‌కు నీటి ని విడుదల చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర)రైతుల సాగునీటికోసం ఎదురుచూపులకు తెరదించుతూ తాంసి మండలంలోని మత్తడి వాగు కెనాల్‌కు నీటిని విడుదల చేయడం స్థానిక రైతన్నలకు ఎంతో ఊరటనిచ్చే పరిణామమని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో కలిసి నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొని రైతన్నలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా సాగునీటిని రైతులు ప్రతి ఒక్కరూ అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతన్నలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ కష్టమొచ్చినా రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, ఆత్మహత్యల వంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. అన్నదాతలకు ఏ కష్టం వచ్చినా ప్రభుత్వ పరంగా, పార్టీలకు అతీతంగా నాయకులందరం కలిసికట్టుగా అండగా నిలబడి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, వడ్డడి సర్పంచ్ జయసుధ గంగాధర్ , ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ , తాంసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కౌడాల సంతోష్ , ఏఎంసీ మెంబర్ తాటి అశోక్ , అలీమ్ , ఖమ్రుద్దీన్ ల తో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

తలమడుగు మండలం బరంపూర్ కొండపై శ్రీవారిని దర్శించుకున్న రాథోడ్ బాపురావు
పత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షులు

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలి లిబరంపూర్ కొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామివారినిలి తెలంగాణ రక్షణ సేన లి=ూ పార్టీ జిల్లా అధ్యక్షులు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లిస్వామివారికి పూజలు చేసి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారులి. స్వామివారి ఆశీస్సులతో లిప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.లి బరంపూర్ కొండపై వెలసిన శ్రీవారి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులులి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుంటూ తమ మొక్కులు చెల్లించుకుంటారు. ప్రశాంతమైన కొండ వాతావరణంలో కొలువైన స్వామివారిని దర్శించుకోవడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తోంది. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆలయానికి చేరుకున్న సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించి స్వామివారి కృప ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొంది. స్థానికంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దేవాలయాల అభివృద్ధి భక్తుల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో ఇంద్రవెల్లి సంకల్ప సభ బోథ్ ఇంచార్జ్ శ్రావణి, మండల కన్వీనర్ నిమ్మల గజానంద్, గడుగు పోచ్చన్న, శివాజీ తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: టీయూడబ్ల్యూజే (హెచ్-143) నాయకులు

-- కలెక్టర్ దీపక్ తివారీకి సమస్యలను విన్నవించుకున్న వికారాబాద్ జిల్లా నాయకులు

వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర):జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడియేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లాలో ఇటీవల నూతనంగా ఏర్పడిన సంఘ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడియేషన్ కార్డులు అందజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా నాయకులు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సమాజంలో లా అండ్ ఆర్డర్ కాపాడటంలో మీడియా పోలీసులకు తగిన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ముఖ్యంగా సున్నితమైన కేసుల విషయంలో హడావుడి పడొద్దని, పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించిన తర్వాతే వార్తలను ప్రచురించాలని స్పష్టం చేశారు. ఆధారాలు లేని తప్పుడు కథనాలను రాయకూడదని, నిజనిజాలను వెలికితీసి సమాజ శ్రేయస్సుకు, శాంతిభద్రతలకు ఉపయోగపడేలా జర్నలిస్టులు తమ బాధ్యతను నిర్వర్తించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద చారి, జిల్లా కమిటీ నాయకులు శ్రీనివాస్, బాబయ్య, పరిగి డివిజన్ కమిటీ అధ్యక్షులు వి. శ్రీనివాస్ రావు, వికారాబాద్ డివిజన్ కమిటి అధ్యక్షులు గోపాల్, దోమ మండల కమిటీ అధ్యక్షులు రాము ముదిరాజ్, యూనియన్ నాయకులు సురేష్, నర్సింలు, అరుణ్, జావిద్, నాగిరెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు

బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన

ఆసిఫాబాద్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ విధులు, అత్యవసర సమయాల్లో ఉపయోగించే పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ పనితీరు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, ప్రజలకు అందించే సేవలు, స్టేషన్‌లో నిర్వహించే రికార్డుల గురించి పోలీస్ సిబ్బంది వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు ఎలా స్పందిస్తారో తెలియజేశారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించి తమ పనితీరును విద్యార్థులకు వివరించారు. బాంబుల గుర్తింపు, అనుమానాస్పద వస్తువుల పరిశీలనలో ప్రత్యేక బృందాలు అనుసరించే విధానాల గురించి అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల గుర్తింపు, అక్రమ రవాణా నియంత్రణలో నార్కోటిక్ డాగ్‌ల పాత్రను వివరించారు. సమాచారాన్ని వేగంగా చేరవేయడంలో కమ్యూనికేషన్ విభాగం ప్రాముఖ్యతను తెలియజేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకోవాలని సూచించారు. పోలీసుల పట్ల భయాన్ని వీడి గౌరవంతో వ్యవహరించాలని, ఆపద సమయంలో పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ 24 గంటలూ పనిచేస్తుందని పేర్కొన్నారు. సమాజంలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు పోలీస్ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే ప్రజాహిత కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు.

సంగమేశ్వరం పునరావాస శిబిరం పరిశీలించిన ఎమ్మెల్యే

తుఫాన్ బాధితులకు మధ్యాహ్న భోజనం వడ్డించిన ఎమ్మెల్యే

అవనిగడ్డ నాగాయలంక మండలం సంగమేశ్వరంలోని ఆర్ఙబ్ తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాన్ని బుధవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. బాధితులను పరామర్శించి, వారికి అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. తుఫాన్ తీరం దాటినా, ప్రభావిత వర్షాల ముప్పు తప్పే వరకూ అధికారుల సూచనలకు అనుగుణంగా బాధితులు శిబిరాల్లోనే ఉండాలని సూచించారు. శిబిరాల్లో బాధితులకు ఎలాంటి లోటు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. శిబిరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. బాధితుల కోసం సిద్ధమైన మధ్యాహ్న భోజనం వారికి వడ్డించారు.

చట్టాన్ని తెలుసుకోండి - బాల్యాన్ని రక్షించండి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిష్కా పాత్రుడు

గద్వాల అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం గద్వాల పట్టణంలోని విశ్వభారతి హైస్కూల్, లోపాముద్ర అగస్త్య హైస్కూల్, ఎస్.ఆర్. విద్యానికేతన్ పాఠశాలల్లో విద్యార్థులకు బాలల లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం, 2012 ఫోక్సో యాక్ట్ , 2012)తో పాటు బాలల హక్కులు, చట్టపరమైన రక్షణ, సైబర్ భద్రత , బాలలపై జరిగే నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిష్కా పాత్రుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి భయంలేని, సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులు మరియు ఇతర నేరాల నుంచి రక్షణ కల్పించడానికి పోక్సో చట్టం, 2012 అమలులో ఉందని వివరించారు. పిల్లలు తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనను నిర్లక్ష్యం చేయకుండా, భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా విశ్వసనీయమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా తమ హక్కులను కాపాడుకోవచ్చని వివరించారు. ఆమె విద్యార్థులకు బాలల హక్కులు, పోక్సో చట్టం, 2012, బాలలపై లైంగిక నేరాల నివారణ, చట్టపరమైన రక్షణ గురించి వివరించారు. ఏదైనా వేధింపులు లేదా అనుచిత సంఘటన ఎదురైతే మౌనంగా ఉండకుండా, విశ్వసనీయమైన పెద్దలకు తెలియజేసి అవసరమైన సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయ సహాయ రక్షణ న్యాయవాది బి. శ్రీనివాసులు మాట్లాడుతూ, అర్హులైన వ్యక్తులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. బాలల హక్కులకు భంగం కలిగినప్పుడు చట్టపరమైన సహాయం పొందవచ్చని, బాధితులకు న్యాయం అందించడంలో న్యాయ సేవాధికార సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాగే, డీసీపీఓ. నరసింహులు బాలల రక్షణకు సంబంధించిన అంశాలను వివరించి, పిల్లల సమస్యలను గుర్తించినప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ మూడు పాఠశాలల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా చట్టాన్ని తెలుసుకోండి -- బాల్యాన్ని రక్షించండి అనే సందేశాన్ని విద్యార్థులకు చేరవేశారు. బాలల హక్కుల పరిరక్షణ, లైంగిక నేరాల నివారణ, సైబర్ భద్రత, చట్టపరమైన సహాయంపై అవగాహన పెంపొందిస్తూ, ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్ లు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్ మండలంలో రూ.1.62 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి టౌన్ :28 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సమైక్య భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మొత్తం సుమారు రూ. 1.62 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేయించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సమైక్య భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూర్చినట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి, ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రాంపూర్, చికెన్‌పల్లి, దూదేకులపల్లి, నందిగామ, ఆజంనగర్, బూర్కపల్లి, రాజీవ్‌నగర్, ఆముదాలపల్లి, ావీ కొత్తపల్లి , శ్యామ్‌నగర్ తదితర గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి సుమారు రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు నిధులు వెచ్చిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతో పాటు మహిళా సంఘాలకు మెరుగైన వసతులు కల్పించడం, చిన్నారులకు అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం, గ్రామపంచాయతీలకు సొంత భవనాలను అందుబాటులోకి తీసుకురావడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్

మంచిర్యాల, అక్టోబర్ 28: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4, 5, 6, 7, 2, 27, 28, 26వ డివిజన్లలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలంటే తెల్ల రేషన్ కార్డు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని మేయర్ వెల్లడించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు వేల్పుల రవీందర్, కొండ్ర రాజేశ్వరి లింగయ్య, అమృత్ రాజ్ కుమార్, గుమ్మడి శ్రీనివాస్, తోటపల్లి రాజేశ్వరి, వనపర్తి కేత రాజేష్, ఇరగదిండ్ల రవి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు అంగిడి రాజేష్, బత్తుల స్వామి, మారు మల్లయ్య, కొత్త రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నీ నో వల్ల ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ముందే పసిగట్టిన ప్రభుత్వం

వి బి జి రాంజీ పథకం కింద రైతుకూలీలకు సకాలంలో పనులు కల్పించాలి

గ్రామ సర్పంచులకు సూచనలు

ఈ పథకం కింద పనిచేసిన రైతు కూలీలకు పది రోజుల్లోనే డబ్బులు ఖాతాలో జమవుతాయి

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28, (విజన్ ఆంధ్ర) : ఎల్ నీనో వల్ల ముంచుకొచ్చే ప్రమాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందే పసిగట్టిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. దీంతో రైతులకు కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విబిజి రాంజీ పథకం ద్వారా రైతు కూలీలకు గ్రామాలలో కొత్త కొత్త పనులు కల్పించి రైతులకు ఉపాధి కల్పించాలని సర్పంచులకు సూచనలు చేశారు. బుధవారం నాడు సి. ఈ ఓ డి. దివ్య దేవరాజన్, ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్ తో కలిసి అదనపు కలెక్టర్లు, పి డి ఆర్ డి ఎ, సర్పంచులు, ఎంపిడిఓలతో వి బి జి రాంజీ, ఎల్ నీనో ప్రభావాన్ని తగ్గించడానికి తీసుకోవలసిన చర్యలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షాలు సరిగ్గా లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గ్రామీణ కూలీలకు, రైతులకు వి. బి. జి. రాంజీ కింద ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు. ప్రజలు వలసలు వెళ్ళిపోకుండా గ్రామంలో కొత్త కొత్త పనులను గుర్తించి వాటి ద్వారా పనులు కల్పించాలని ఆమె తెలియజేశారు. ఉపాధి హామీ పని చేయడం వల్ల కూలి దొరకడంతో పాటుగా గ్రామానికి మెటీరియల్ కాంపోనెంట్ కింద సిసి రోడ్లు మ్యారేజ్ హాల్లో ఇతర అభివృద్ధి పనులు చేసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వి బి జి రాంజి పథకం కింద 375 రకాల పబులు ఉన్నాయని వాటిని సర్పంచులకు వివరించి పనిదినాలు పెంచేవిధంగా చూడాలని చెప్పారు. వి బి జి రాంజీ పథకం ద్వారా చేసిన పనులకు పది రోజుల్లోనే డబ్బులు ఖాతాలో జమ అవుతాయని అందువల్ల సర్పంచులు డబ్బులు రావు అనే భయం అవసరం లేదని, ఇచ్చిన ప్రతి పనిని కాల పరిమితితో పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల భవనాలు గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, వివో భవనాలు గోదాములు కమ్యూనిటీ హాలు వంటి అభివృద్ధి పనులను చేపట్టి త్వరగా పూర్తి చేస్తే సకాలంలో డబ్బులు జమ అవుతాయని తెలియజేసారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి పనులను గుర్తించడం, వాటిని ఆన్లైన్ చేయడం, నిలబడి సకాలంలో పనులు పూర్తి చేయించాలని సర్పంచులను సూచించారు. గ్రామాలను అభివృద్ధి చేసుకొని ఆదర్శ గ్రామంగా నిలబెట్టుకునేందుకు విబిజి రాంజీ ఒక సూరన్నవకాశమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన గ్రామానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా కోటి రూపాయలు అందజేస్తుందని తెలిపారు. అదేవిధంగా పశువులకు తాగునీటికి నీటి కుంటలు, చెక్ డ్యాం లు వి బి జి రాంజీ పథకం కింద నిర్మించాలని సూచించారు. రైతులు లేదా గ్రామ సంఘం ద్వారా పశువులకు గడ్డి సాగు చేస్తే ఎకరానికి 14 వేల రూపాయలు ప్రభుత్వం ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు 14 వేల రూపాయల సహాయంతో పాటుగా సాగు చేసిన గడ్డిని అమ్ముకొని మరింత లబ్ధి పొందవచ్చని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీ డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే నిర్మాణాల పనులు ప్రారంభించిన వివో భవనాలు, అదనపు గదులు అంగన్వాడి కేంద్రాలు పంచాయతీ భవనాలు నిర్ణత కాల వ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వి బి జి రామ్ జి కింద పని దినాలు పెంచడానికి ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్ ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, హాబీటేషన్ లో పనులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పశువు గ్రాసం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నీటి సంరక్షణ కొరకు వ్యక్తిగత ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో పిడి డిఆర్డిఓ శ్రీలత, జెడ్పి సీఈవో కృష్ణారెడ్డి, మిషన్ భగీరథ ఎస్. ఈ రాజేశ్వర్ రావు, డిపిఓ సురేశ్ మోహన్, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నైతం రాజు సంస్మరణ సభను జయప్రదం చేయండి

ప్రజా సంఘాల నాయకుల పిలుపు

ఆసిఫాబాద్ అక్టోబర్ 28(విజన్ ఆంధ్ర): ఆసిఫాబాద్ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టాగ్స్) ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు నైతం రాజు సంస్మరణ సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ పట్టణంలోని రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు టాగ్స్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెజ్జూర్ మండలంలోని మారుమూల సోమిని గ్రామంలో జన్మించిన నైతం రాజు 2015లో టాగ్స్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికై, అనంతరం మండల అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా అంచెలంచెలుగా ఎదిగారని గుర్తు చేశారు. 2016, 2017 సంవత్సరాల్లో అప్పటి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మహాజన పాదయాత్రలో సభ్యుడిగా పాల్గొన్నారని తెలిపారు. జిల్లాలో జరిగిన అనేక ఆదివాసీ ఉద్యమాలు, పోరాటాల్లో చురుకుగా పాల్గొన్న నైతం రాజు అనారోగ్యంతో అక్టోబర్ 12న తుదిశ్వాస విడిచారని పేర్కొన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని నాయకులు అన్నారు. నైతం రాజు ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలను స్మరించుకుంటూ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ, టాగ్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్వీ రమ, మహాజన పాదయాత్ర బృంద సభ్యుడు, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.రమణ, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు నగేష్ హాజరై ప్రసంగించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆదివాసీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, నైతం రాజు కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోట శ్రీనివాస్ కోరారు.

అధునాతన ఏఐ టెక్నాలజీ ఫ్రిజ్‌ను విడుదల చేసిన వర్ల్‌పూల్

హైదరాబాద్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : పండ్లు, కూరగాయలు అతిగా పండిపోకముందే గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేసే భారత్‌లోనే తొలి సిక్స్ సెన్స్ ఏఐ ఆధారిత తాజాదనం గుర్తింపు సాంకేతికతను తన లగ్జరియమ్ 4-డోర్ ఫ్రిజ్‌లలో ప్రవేశపెట్టినట్లు వర్ల్‌పూల్ ఇండియా మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ నకుల్ తివారీ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఐఫ్రెష్ సెన్సర్ ద్వారా

ఇథిలీన్ వాయువు స్థాయిలను ప్రతి 10 సెకన్లకోసారి పర్యవేక్షించి, తాజాదనంలో మార్పులను గుర్తించడం దీని ప్రత్యేకత అని తెలిపారు. వినియోగదారుల అలవాట్లకు అనుగుణంగా అలర్ట్‌లను సర్దుబాటు చేసే ఏఐ సాంకేతికతను ఇందులో పొందుపరిచినట్లు చెప్పారు. ఆహార వృథాను తగ్గించడమే లక్ష్యమని తెలిపారు.

కేఎల్ యూనివర్సిటీలో స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్

హైదరాబాద్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్-2026కు విజయవాడలోని కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆతిథ్యమిస్తోందని కేఎల్ యూనివర్సిటీ చాన్సలర్ ఇంజినీర్ కోనేరు సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 27 నుంచి 29 వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన 20 పాఠశాలల బృందాలు పాల్గొంటున్నాయని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్యల పరిష్కార నైపుణ్యాలు, ఆవిష్కరణలను ప్రోత్సహించడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులు గణేష్ రాయల(హెడ్--యూత్ ఎకోసిస్టమ్ అండ్ మార్కెటింగ్), ఇబాదుల్లా బేగ్(ఇంక్యుబేషన్ మేనేజర్), సుమతి(ఇంక్యుబేషన్ అసోసియేట్), కేఎల్ యూనివర్సిటీ సీఐఐఈ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ వి.రాజేష్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.సలీం అక్రమ్, ఏసీఐసీ సీఈఓ వి.రమాకాంత్, ఫ్యాబ్ ల్యాబ్ డైరెక్టర్ గౌరవ్ కపూర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ క్షేత్రస్థాయిలోకి సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల:రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పట్టణంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అర్ధరాత్రి వేళ బైక్‌పై క్షేత్రస్థాయి పెట్రోలింగ్ నిర్వహించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేపడుతున్న చర్యలను స్వయంగా పరిశీలించారు.రాత్రి వేళల్లో పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీసుల నిఘా, పెట్రోకార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరును సీపీ సమీక్షించారు. విధుల నిర్వహణలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు భద్రతా భావం కల్పించేలా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు,వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.సీపీ అంబర్ కిషోర్ ఝా వెంట మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, రూరల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు ఉన్నారు.

నవంబర్ 1న ప్రతిభ స్కాలర్షిప్ పరీక్ష

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 28 విజన్ ఆంధ్ర : నవంబర్ 1వ తేదీన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1వ తేదీ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కాలేజ్ రోడ్డులో గల గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని తెలిపారు.

సిఎంఆర్ ధాన్యం బకాయిలను గడువులోగా చెల్లించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 28 విజన్ ఆంధ్ర : సిఎంఆర్ ధాన్యం బకాయిలను గడువులోగా చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ మానిటరింగ్ అధికారి అజయ్‌బాబు(సి.ఐ.) తో కలసి సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం బకాయిల వసూళ్ళు, వేలం వేసిన ధాన్యానికి సంబంధించిన మొత్తాల చెల్లింపులు, ప్రస్తుత సీజన్ల సిఎంఆర్ ధాన్యం అప్పగింతలపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 201920 సంవత్సరం నుంచి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 202425 వరకు పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. రబీ 202223 సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యానికి చెల్లించవలసిన మొత్తాలను సకాలంలో జమ చేయాలని, ఖరీఫ్ 202526, రబీ 202526 సీజన్లకు సంబంధించిన సిఎంఆర్ డెలివరీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు, జి.ఓ. ఎం.ఎస్. నం. 17 ప్రకారం నిర్ణీత గడువులోగా పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను పూర్తిగా చెల్లించాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. బకాయిల చెల్లింపులలో జాప్యం చేయకుండా, ప్రభుత్వానికి చెల్లించవలసిన మొత్తాలను సకాలంలో జమ చేయాలని తెలిపారు. అంతకుముందు జిల్లా ఆహార భద్రత అధికారి వాసురామ్ తో కలిసి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 పై నిర్వహించిన ఆన్లైన్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆహారత భద్రత చట్టంలోని నిబంధనలు, ఆహార నాణ్యత ప్రమాణాలు, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు, చట్టం అమలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో చట్టం సమర్థవంతమైన అమలుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, డిప్యూటీ తహసిల్దార్ (సివిల్ సప్లైస్), సంబంధిత రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలి

- భారాస అభ్యర్థి విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలి

- కేవీఆర్ కాలనీలో పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర): అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు ఓటర్లుగా నమోదు చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ భారాస నాయకుడు శంభీపూర్ క్రిష్ణ, దుండి గల్ సర్కిల్ భారాస అధ్యక్షుడు మద్దికుంట సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస అభ్యర్థి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని వారు కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ డివిజన్ శంభీపూర్ కేవీఆర్ కాలనీలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ నాయకులు, సభ్యులతో మాట్లాడిన శంభీపూర్ క్రిష్ణ, మద్దికుంట సంజీవరెడ్డి.. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవడం అవసరమని పేర్కొన్నారు. ఓటరు నమోదుకు అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి అవసరమైన సమాచారం అందించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాలనీల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్ కాలనీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, భారాస యువ నాయకుడు శ్రీశైలం యాదవ్, కాలనీ సభ్యులు కృష్ణారావు, తిరుపతిరెడ్డి, ధర్మారావు, నరసింహ, ఇంద్రసేన, వేణు, రాంబాబు, రామారావు, రాంచందర్‌రావు, శ్రీదేవి, శ్రీనివాసమ్మ, విజయ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమాచార కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్.

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 28 విజన్ ఆంధ్ర : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

కన్నీటి ఇంటికి.. భరోసా బాట!!

- ఆపన్నులకు ఆపద్బాంధవుడు

- నిరుపేదల కన్నీరు తుడిచే నాయకుడు

- పిలుపొస్తే చాలు.. బాసటగా హరీష్ రెడ్డి

పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర): రాజకీయం అంటే అధికారం కోసమో, పదవుల కోసమో పాకులాడటం కాదు.. కన్నీళ్లలో ఉన్న నిరుపేద కంటి తడి తుడవడమే నిజమైన ప్రజాసేవ అని నిరూపిస్తున్నారు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి. ఆపదలో ఉన్నామన్న పిలుపు వినిపిస్తే చాలు, ప్రత్యక్షమై కొండంత ధైర్యాన్నిచ్చే ఆయన సేవాగుణం రామగుండం గడ్డపై మరోసారి ప్రస్ఫుటమైంది. ఇటీవల రామగుండం నియోజకవర్గం 23వ డివిజన్ మాతంగి కాలనీకి చెందిన రెడ్డి విమల తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయి, పుట్టెడు దుఃఖంతో పాటు పూట గడవని దయనీయ స్థితిలో ఉన్న ఆ కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న హరీష్ రెడ్డి చలించి బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు 5వేల రూపాయలు విలువ చేసే నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు.

ఆపన్నుల పాలిట ఆపద్బాంధవుడు.. సేవే ఊపిరిగా ప్రజాప్రస్థానం!

రామగుండం నియోజకవర్గంలో వ్యాల్ల హరీష్ రెడ్డి పేరు నిస్వార్థ సేవకు మారుపేరుగా నిలిచింది. కష్టం వచ్చిన ప్రతి గడపకూ ఆయన అండగా నిలిచిన తీరు స్థానికుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. ఆకలి కేకలు లేని సమాజం కోసంలి నిరుపేదలకు, రోగుల సహాయకులకు నిరంతర అన్నదాన కార్యక్రమాలు చేపడుతూ ఆకలి తీరుస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణ ప్రాణదానం

పేద ప్రజలకు వైద్యం భారంగా మారిన వేళ ఉచితంగా మందులు, ఆపరేషన్లకు ఆర్థిక సాయం అందించడమే కాకుండా, రక్తం కొరతతో ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో విస్తృతంగా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

ఆడబిడ్డల పెళ్లిళ్లకు కానుక

పేదింటి ఆడపిల్లల వివాహాలకు తాళిబొట్టు (పుస్తె-మట్టెలు), నూతన వస్త్రాలు, ఆర్థిక చేయూతనిచ్చి సొంత అన్నలా నిలుస్తున్నారు.

పేద విద్యార్థుల చదువులకు భరోసా

ఫీజులు కట్టలేక ఏ విద్యార్థి చదువు ఆగకూడదనే లక్ష్యంతో స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, ఫీజుల చెల్లింపులకు ఆర్థిక సహకారం అందిస్తూ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు.

ఆధ్యాత్మికతకు పెద్దపీట

ఆలయాల నిర్మాణాలు, ఉత్సవాలు, దైవ సంబంధిత ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విరివిగా విరాళాలు సమర్పిస్తూ ధర్మ పరిరక్షణలో ముందుంటున్నారు. కష్టాల్లో ఉన్నవారికి చేయూతనిస్తూ, సామాజిక బాధ్యతతో నిరంతరం ప్రజల మధ్యే ఉండే నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి అని స్థానిక కాలనీవాసులు, ప్రజలు కొనియాడారు.

సినిమా ఈవెంట్లకు అడ్డాగా మల్లారెడ్డి యూనివర్సిటీ!

- విద్యా సంస్థల్లో సినిమా ప్రచార కార్యక్రమాల నిర్వహణపై యుఎస్ఎఫ్ఐ అభ్యంతరం

- విద్యార్థుల భవిష్యత్తు కంటే ప్రచారానికే ప్రాధాన్యమా?

- ఈవెంట్ల నిర్వహణపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన విద్యాసంస్థల్లో సినిమా ఈవెంట్లు, ప్రచార కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వడంపై యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్ఎఫ్ఐ) మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సినిమా ప్రచార కార్యక్రమాలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. చంద్రకాంత్, భాగ్యరి వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు నైపుణ్యాభివృద్ధి, శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యతను పెంపొందించాల్సిన విశ్వవిద్యాలయాలు సినిమా ప్రచార కార్యక్రమాలకు వేదికలుగా మారడం సమంజసం కాదని పేర్కొన్నారు. విద్యార్థుల విలువైన సమయాన్ని చదువు, పరిశోధన, నైపుణ్యాల అభివృద్ధికి వినియోగించేలా విద్యాసంస్థలు ప్రోత్సహించాలని సూచించారు. సినిమా ఈవెంట్ల నిర్వహణ, వాటిలో విద్యార్థుల భాగస్వామ్యం వంటి అంశాలు విద్యాసంస్థల ప్రాధాన్యతలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల విద్యా సమయం, విద్యా హక్కులు, భవిష్యత్తు ప్రయోజనాలకు విఘాతం కలగకుండా యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విశ్వవిద్యాలయాలు విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తిని, సామాజిక స్పృహను పెంచే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

అధికారులు విచారణ జరపాలి

మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సినిమా ఈవెంట్లు, ప్రచార కార్యక్రమాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కోరింది. విద్యాసంస్థల్లో విద్యకు ప్రాధాన్యతనిస్తూ సినిమా ప్రచార కార్యక్రమాల నిర్వహణపై తగిన నియంత్రణ ఉండాలని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. విద్యార్థుల ప్రయోజనాలు, విద్యా ప్రమాణాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ అంశంపై స్పందించాలని విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ధర్మా తదితరులు పాల్గొన్నారు.

444 కోట్లు అవినీతికి పాల్పడ్డ మంచిర్యాల ఎమ్మెల్యే

- డబుల్ బెడ్ రూమ్ ఎంపికలో అవినీతి

- ఎమ్మెల్యేకు కమిషన్ లేనిదే ఏ పని జరగదు

- టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్ రావు

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 28 విజన్ ఆంధ్ర గతంలో మంచిర్యాల ఎమ్మెల్యే 444 కోట్లకు సంబంధించి 31 పేజీల పిడిఎఫ్ మీ అందరికీ పంపడం జరిగింది. అందులో మీరు చూసినట్లయితే సెప్టెంబర్ 10వ తారీఖున 70 కోట్లు బీకాండ్ కంపెనీ నుంచి వచ్చినట్లు మీకు కనిపిస్తుంది. మరి సెప్టెంబర్ లో 70 కోట్లు వస్తే, మార్చిలో కట్టిన పైసలు ఈ 70 కోట్లేనా? అప్పుడు ఎమ్మెల్యే ఎలా చెబుతాడు?ఈ 140 కోట్లు అప్పు తీసుకున్నది 20% వడ్డీకి. అంటే నెలకు రెండున్నర లక్షలు జీతం వచ్చే ఎమ్మెల్యే, నెలకు 2 కోట్ల 80 లక్షలు వడ్డీ కట్టాలి. అన్ని బిజినెస్సులు దివాలా తీసినయ్. నీ ఐటీ రిటర్న్స్, నీ బిజినెస్ సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్ చూస్తే ఇది చాలా స్పష్టంగా కనిపిస్తుంది. మరి అన్ని బిజినెస్సులు దివాలా తీసినప్పుడు నెలకు దాదాపు 2 కోట్ల 80 లక్షలు ఎలా కడుతున్నాడు? ప్రజలకు చెప్పాలి అని అన్నారు.పేదలకు ఇల్లు కట్టిస్తే ఏ ప్రభుత్వం కట్టించినా, ఏ నాయకుడు కట్టించినా దాన్ని టీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తుంది. కానీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు ఉండకూడదని మేము కోరుకుంటున్నాం.నేను అధికారులకు చెబుతున్నా, కమిషనర్ గారిని అడిగితే ఎమ్మార్వో గారి పేరు చెబుతున్నారు, ఎమ్మార్వో గారిని అడిగితే కమిషనర్ గారి పేరు చెబుతున్నారు. 17 వేల మంది మాకు ఇల్లు కావాలని దరఖాస్తు పెట్టుకుంటే కేవలం 804 మందిని ఎలా సెలెక్ట్ చేస్తారు? మిగతా 16,200 మంది పేదలను ఏ పద్ధతి ప్రకారం రిజెక్ట్ చేశారు? ఇది ఎమ్మెల్యే చేయరాదు, లేదా మిగతా ఎన్నికైన నాయకులు, ప్రజాప్రతినిధులు చేయరాదు. అధికారులే సెలెక్ట్ చేయాలి. కలెక్టర్ ద్వారా, కమిషనర్ , ఎమ్మార్వో , ఆర్డీవో - దీన్ని ఎవరు చేసినా, ఏ పద్ధతి ప్రకారం చేశారనేది మీరు వివరణ ఇవ్వాలి. ఇవ్వకపోతే రేపు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనికి మూల్యం చెల్లించక తప్పదు.ఎన్నిసార్లు చెబుతున్నా మైనింగ్ మాఫియా ఆగడం లేదు. మొన్నటికి మొన్న ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ పార్క్ అని చెప్పిన ప్రాంతం మొత్తం బొందల గడ్డ అవుతోంది. అర్ధరాత్రి కూడా అక్కడి నుంచి వెహికల్స్, టిప్పర్లు మా రంగపేట, పాత మంచిర్యాల మీదుగా పోతున్నాయి. దీన్ని నేను మొన్న మైనింగ్ అధికారికి కూడా వాట్సాప్ పెట్టడం జరిగింది, కానీ ఎలాంటి చర్య లేదు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

కాంగ్రెస్ నేతల చేతగానితనం వల్లే భిక్షాటన

- రూరల్ ఎమ్మెల్యే బహిరంగ చర్చకు సిద్ధమేనా.

- భూపతి రెడ్డి పై మండిపడ్డ బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి.

నిజామాబాద్ అక్టోబర్28:(విజన్ ఆంధ్ర) : జిల్లాలో అభివృద్ధి నిధులు సాధించడంలో కాంగ్రెస్ నేతల చేతకానితనం వల్లే ఎంపీ అరవింద్ బిక్షటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి ఆరోపించారు. ఈ మేరకు గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పై మండిపడ్డారు. మాధవ నగర్ ఆర్ఓబికి తొమ్మిది కోట్ల ఫైనాన్స్ క్లియరెన్స్ సాధించడం సాధ్యం కాక ఎంపీ అరవింద్ పై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. నీ సవాల్ ను స్వీకరిస్తున్నామని నవంబర్ రెండు లోపు బహిరంగ చర్చకు తాము సిద్ధమేనని స్థలం ఎక్కడ అనేది మీరే నిర్ణయించాలని ఆయన సవాల్ విసిరారు. ఇసుక క్వారీలు, ఇటుక బట్టీలు, సొసైటీ చైర్మన్ ల నియామకానికి లక్షల రూపాయలు దండుకుంటున్న భూపతి రెడ్డి ఎంపీని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఆర్ఓబి కి నిధులు సాధించే దమ్ము లేకపోవడం వల్లే ఎంపీ అరవింద్ భిక్షాటన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కనీసం పసుపు బోర్డుకు స్థలం కేటాయించకపోవడం నీ చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. గతంలో బాజిరెడ్డి గోవర్ధన్ అందిన కాడికి దండుకున్నారని ప్రస్తుతం అదే పంతాను మీరు కొనసాగిస్తున్నారని భూపతిరెడ్డి పై విరుచుకుపడ్డారు. ఖబర్దార్ భూపతి రెడ్డి ఎంపీని మరోసారి విమర్శిస్తే బిజెపి నాయకుల సత్తా ఏందో చూస్తావని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో 119 మంది ఎమ్మెల్యేలలో నంబర్ వన్ చేతగాని ఎమ్మెల్యేగా భూపతిరెడ్డి మిగిలిపోయారని ఆయన దుయ్యబట్టారు. గతంలో ఎమ్మెల్యే టికెట్ కోసం బీజేపీ లో చేరేందుకు ఢిల్లీలో ఎవరి కాళ్లు పట్టుకున్నావో అందరికీ తెలుసు అన్నారు. భూపతి రెడ్డి నిర్లక్ష్యంతో మాధవ నగర్ రోడ్డు ఉయ్యాల జంపాల లాగా మారిందని, ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దాని గురించి పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. తాను విసిరిన సవాల్ కు సిద్ధంగా లేకపోతే అన్ని మూసుకొని ఇంట్లో కూర్చోవాలని హితవు పలికారు. రూరల్ నియోజకవర్గం లో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి గురించి పట్టించుకోకుండా అభివృద్ధి నిధుల కోసం పాటుపడుతున్న వారిని విమర్శించడం సరైంది కాదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు ఎర్రం సుధీర్, బొబ్బిలి వేణు, ఇప్పకాయల కిషోర్, జగదీష్ కులకర్ణి, పద్మా రెడ్డి, చింతకాయల రాజేందర్, ఆమందు విజయ్, ధ్యారంగుల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పటాకుల దుకాణాల నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి : సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అక్టోబర్28:(విజన్ ఆంధ్ర) దీపావళి సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాత్కాలిక పటాకుల దుకాణాలు నెలకొల్పేవారు అనుమతులు తీసుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు.డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో.. పటాకుల దుకాణాలు నిర్వహించాలనుకునే వారు డివిజినల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని సీపీ తెలిపారు. దీనికి సంబంధించిన ఇతర సమాచారం కోసం సంబంధిత డివిజినల్ స్థాయి అధికారిని సంప్రదించాలన్నారు. అనుమతి లేకుండా దుకాణాలు నెలకొల్పితే వారిపై ఎక్స్ ప్లోజివ్ యాక్ట్ -1884, రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటించాలి పటాకుల దుకాణాలను ఖాళీ ప్రదేశాల్లోనే నెలకొల్పాలని సీపీ సూచించారు. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్ వోసీ సర్టిఫికెట్ పొందుపర్చాలన్నారు. ఒక క్లస్టర్లో 50 షాపులకు మించరాదని..అలాగే రద్దీగల ప్రదేశాలలో ఎలాంటి పటాకుల షాపులు ఏర్పాటు చేయరాదన్నారు. అదేవిధంగా కళ్యాణ మండపాల్లో, సమావేశాల కేంద్రాలలో దుకాణాలు పెట్టవద్దని పేర్కొన్నారు. తాత్కాలిక పటాకుల దుకాణాలలో ఫైర్ సేఫ్టీకి సంబంధించిన జాగ్రత్తలు తప్పక పాటించేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈటలతో కలిసి రాహుల్ రెడ్డి

కీసర, అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర : జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను ఎత్తివేసి, పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను పరిష్కరించాలని లక్ష్యంతో ఎంపీ ఈటల రాజేందర్ చేస్తున్న మహా పాదయాత్ర రెండవ రోజు కొనసాగింది. నాగారం మున్సిపల్ బిజెపి యువ నాయకుడు కౌకుంట్ల రాహుల్ రెడ్డి ఈటెల రాజేందర్ తో కలిసి మహా పాదయాత్రలో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కీసర, అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర : కీసర డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ లో రూ. 29 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులకు డివిజన్ అధ్యక్షురాలు రామిడి సప్న విజయ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి తటాకం లక్ష్మణ్ శర్మ, కార్యదర్శి రాజు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ప్రారంభోత్సవంలో జీవన్ రెడ్డి

కీసర, అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర : నాగారంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కౌకుంట్ల జీవన్ రెడ్డి పాల్గొన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా బ్యాంకును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన మహా పాదయాత్ర

కీసర, అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర : జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను తొలగించాలని లక్ష్యంతో ఎంపీ ఈటల రాజేందర్ చేస్తున్న మహా పాదయాత్ర రెండవ రోజు కొనసాగింది. డంపింగ్ యార్డ్ ను తొలగించేంత వరకు ఉద్యమం ఆగదని ఈటెల రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా కాకులమర్రి బ్రదర్స్.

ములుగు అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మానవతా దృక్పథంతో కాకులమర్రి బ్రదర్స్ మరోసారి ప్రజాసేవలో నిలిచారు. గోవిందరావుపేట మండలం మొద్దులగూడెంకు చెందిన వికలాంగుడు జల్లెల్ల రమేష్ ఎలక్ట్రిక్ వీల్ చైర్ బ్యాటరీలు పాడై ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు స్పందించి, కాకులమర్రి ప్రదీప్ రావు ద్వారా రూ.70 వేల విలువైన బ్యాటరీలు, మోటార్లు అందజేశారు. సహాయం విలువ ధరలో కాదు, ఒకరి జీవితంలో తెచ్చే మార్పులో ఉంటుందని నిరూపించారు.

దీపావళి పండుగ తేదీలను ప్రకటించిన పంచాంగ కర్త నిర్మలానంద స్వామి.



ములుగు అక్టోబర్ 28 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : పంచాంగ కర్త, శ్రీ లక్ష్మీ నారాయణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ నిత్య నిర్మలానంద యాత్ర యోగేశ్వర స్వామి సిద్ధాంతి 2026 దీపావళి పండుగ పంచాంగ వివరాలను వెల్లడించారు. 401 సంవత్సరాల పంచాంగ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న నిర్మలానంద స్వామి తెలిపిన వివరాల ప్రకారం: నవంబర్ 7 శనివారం ధన త్రయోదశి, శని త్రయోదశి, ధన్వంతరి త్రయోదశి నవంబర్ 8 ఆదివారం నరక చతుర్దశి ఉదయం 11.08 వరకు, అనంతరం దీపావళి అమావాస్య ప్రారంభం. ఈ రోజే ధనలక్ష్మీ పూజ, దీపావళి పండుగ. అదే రోజు చిన్న జీయర్ స్వామి 70వ జన్మదిన మహోత్సవం. నవంబర్ 9 సోమవారం దీపావళి అమావాస్య, శ్రీ కేదారేశ్వర వ్రతం, ఆకాశ దీపారాధన. నవంబర్ 10 మంగళవారం కార్తీక శుద్ధ పాడ్యమి, ఉదయం 9.35 కి కేదారేశ్వర దేవుని ఎత్తుకోవడం. నవంబర్ 11 బుధవారం భగిని హస్త భోజనం, యమ విదియ. కొత్తగా నోము నోచుకునేవారు నవంబర్ 8 సాయంత్రం నోముకొని, నవంబర్ 9 మధ్యాహ్నం 1.45 కి దేవుని ఎత్తుకోవాలని నిర్మలానంద స్వామి సూచించారు.

అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో అధికారులకు మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

ములుగు అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి: అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ములుగు జిల్లా అధికారులను రాష్ట్ర మంత్రి సీతక్క అప్రమత్తం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, శిథిల భవనాల వద్ద ఉండవద్దని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించి సహాయం అందించాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులకు స్పష్టం చేశారు.

వ్యసనాలకు 'నో' చెప్పండి - కలెక్టర్ బోర్ఖడే హేమంత్

ములుగు అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుతో పాటు క్రీడలు, పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు విద్యార్థులకు సూచించారు. నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ వర్చువల్ సందేశాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించిన కలెక్టర్, పాఠశాల దశ నుంచే మంచి అలవాట్లకు పునాది వేసుకోవాలన్నారు. స్నేహితుల ఒత్తిడికి లోనై 'ఒక్కసారి' అనే ఆలోచనతో మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, ధైర్యంగా 'నో' చెప్పాలని పిలుపునిచ్చారు.

ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేలా గ్రామాలను సిద్ధం చేయాలి: మంత్రి సీతక్క.

ములుగు అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు/హైదరాబాద్ ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు గ్రామాలను ముందస్తుగా సన్నద్ధం చేయాలని మంత్రి సీతక్క జిల్లా అధికారులను బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. బీఆర్కే భవన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన మంత్రి – ఉపాధి హామీ పనులను జల సంరక్షణతో అనుసంధానించాలని, ఫామ్ పాండ్లు, చెక్ డ్యామ్ లు, ఇంకుడు గుంతలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి పంచాయతీలో పశువుల కోసం రూ.24 వేలతో నీటి తొట్టెల నిర్మాణం చేపట్టాలని, ప్రతి గ్రామానికి రూ.50 లక్షల నుండి కోటి వరకు నిధులు అందుతాయని తెలిపారు. గ్రామాభివృద్ధి పనుల్లో అలసత్వాన్ని సహించేది లేదని, నిర్లక్ష్యం వహించే సర్పంచులు, అధికారులకు నోటీసులు ఇస్తామని మంత్రి దనసరి అనసూయ సీతక్క హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు

సెంట్రలైజ్డ్ కిచెన్ రద్దు చేయాలి: మధ్యాహ్న భోజన కార్మికులు.

ములుగు అక్టోబర్ 28 ;విజన్ ఆంధ్ర ప్రతినిధి : సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ములుగులో మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకోగా మంత్రి పీఏకి వినతిపత్రం ఇచ్చారు. 9 నెలల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, రూ.10 వేల వేతనం అమలు చేయాలని ఏఐటియుసి నేత జంపాల రవీందర్ డిమాండ్ చేశారు.

వర్షంలోనూ 16వ రోజుకు చేరిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మె.

ములుగు అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ములుగు జిల్లా ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరింది. ఈ సమ్మెలో వైద్యులు డా. నరహరి, నవీన్, తరుణ్, శ్రీనివాస్, పార్వతి, లోకప్రియ, చందన, అనిత, భవ్య, స్నిగ్ధ, రజిని, దివ్య, సైకాలజిస్ట్ కిరణ్ కుమార్, ఫార్మసీ ఆఫీసర్లు నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని ముఖ్యమంత్రి, హెల్త్ మినిస్టర్ కు విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల హక్కుల సాధనలో ఐఎఫ్‌డబ్ల్యూజే కీలక పాత్ర

- జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- సీనియర్ పాత్రికేయులకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలి
- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు
- ఘనంగా ఐఎఫ్‌డబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.. సీనియర్ జర్నలిస్టులకు సన్మానం

కరీంనగర్ : జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, వృత్తిపరమైన స్వేచ్ఛ కోసం ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) ఏడు దశాబ్దాలకు పైగా నిరంతరం పోరాడుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌డబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కరీంనగర్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు పీఎస్ రవీంద్ర, కొరిమి వెంకటస్వామి, డీఎస్ ప్రసాద్, ఆడెపు లక్ష్మీనారాయణ, ఆరెల్లి శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బాపూరావు తెలిపారు. 1950 అక్టోబర్ 28న న్యూఢిల్లీలో ఏర్పాటైన ఈ సంస్థ దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఐక్యం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. వేతనాల పెంపు, మెరుగైన సేవా నిబంధనలు, పని గంటల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత వంటి అంశాల్లో జర్నలిస్టుల హక్కుల సాధనకు అనేక ఉద్యమాలు చేపట్టిందని గుర్తుచేశారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన సవరణలు, పత్రికా రంగానికి సంబంధించిన వివిధ కమిటీల్లో జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించడం వంటి అంశాల్లో పాత్రికేయ సంఘాల పోరాటాలు కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని, మీడియా స్వేచ్ఛను కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయులు తమ బాధ్యతను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం

దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు, హత్యలు, బెదిరింపులు, అక్రమ కేసుల నమోదు వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని బాపూరావు అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ విధులు నిర్వహించే జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రతకు చట్టపరమైన రక్షణ కల్పించడంతోపాటు, వివిధ

పత్రికలు, వార్తా సంస్థలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను ధ్రువీకరించి జాతీయ స్థాయిలో రిజిస్టర్ రూపొందించాలని కోరారు. దీనివల్ల అర్హులైన జర్నలిస్టులను గుర్తించడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం, ప్రభుత్వ సహాయ కార్యక్రమాలను సమర్థంగా రూపొందించడం సాధ్యమవుతుందని వివరించారు.

సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ కల్పించాలి

అరవై ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దేశవ్యాప్తంగా అమలయ్యే జాతీయ పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని బాపూరావు కోరారు. జర్నలిస్టులకు గతంలో అందుబాటులో ఉన్న రైల్వే ప్రయాణ రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం, వైద్య సదుపాయాలు, సామాజిక భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

జర్నలిస్టుల సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

సీనియర్ జర్నలిస్టు పీఎస్ రవీంద్ర మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంఘానికి నాయకత్వం వహించే వ్యక్తి పదవికే పరిమితం కాకుండా సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన, వృత్తిపరమైన భద్రత, సంక్షేమం కోసం నాయకులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా సంకల్పబలంతో ముందుకు సాగినప్పుడే నాయకత్వానికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం స్పందించడం, వారి గొంతుకగా నిలవడం, అవసరమైన సందర్భాల్లో అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం నాయకుల ప్రధాన బాధ్యతలని వివరించారు. సంఘంలోని సభ్యులందరినీ కలుపుకొని పోతూ వారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, కష్టాల్లో ఉన్న జర్నలిస్టులకు అండగా నిలవాలని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జర్నలిస్టుల సామూహిక ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ, క్రమశిక్షణ, పారదర్శకత, సేవాభావంతో పనిచేసినప్పుడే సంఘం మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదే కరుణాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము గణేష్, లక్కం సురేష్, సహాయ కార్యదర్శి ఎండీ ఖాజా, హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు సౌడమల్ల యోహాన్, నాయకులు శంకర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, నరేష్, దీక్షిత్, రాజు, రవి, యూసఫ్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి

- సాంస్కృతిక సారథి కళాకారుల కార్యక్రమాలను విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నీటి సంరక్షణ, పొదుపుగా నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా నిర్వహించనున్న నీటి సంరక్షణ అవగాహన కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు.

షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు విజయవంతం చేయాలి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో కళాకారులచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు నీటి పొదుపు ఆవశ్యకతను వివరించి, నీటిని వృథా చేయకుండా సంరక్షించుకునే విధానాలపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. కళాకారులు నిర్వహించే అవగాహన కార్యక్రమాలను ప్రజలందరికీ చేరువ చేసేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్ తదితర శాఖల అధికారులు షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో నిర్ణయించిన తేదీల ప్రకారం కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు.

ప్రతి ఇంటికీ కరపత్రాలు చేరవేయాలి

నీటి సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేసేలా ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార కరపత్రాలను గ్రామాల్లోని ప్రతి ఇంటికీ చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి జిల్లాలో నీటి పొదుపుపై ప్రజా ఉద్యమంలా అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, ముఖ్య ప్రణాళిక అధికారి హరికృష్ణ, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తరతరాల తలరాతను మార్చే ఆస్తి రిజర్వేషన్లే...!!

- కల్వకుంట్ల కవిత భావోద్వేగ గర్జన
- "భూములు, బంగారం ఒకటిరెండు తరాలకే
- రాజ్యాంగ హక్కే శాశ్వత రక్ష
- జనగణనలో ఓబీసీ కాలమ్ లేకపోతే...
- తెలంగాణలో సెన్సస్‌ను అడ్డుకుంటాం

హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్ సభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విరుచుకుపడ్డ తెలంగాణ రక్షణ సేన చీఫ్

హైదరాబాద్ (పొలిటికల్ డెస్క్), అక్టోబర్ 28: "భూములు అమ్ముడుపోవచ్చు... సంపాదించిన బంగారం కరిగిపోవచ్చు... కానీ మన భావితరాల ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును నిలబెట్టే ఏకైక శాశ్వత ఆస్తి రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లే!" అని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ఉద్వేగభరితంగా స్పష్టం చేశారు. బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపం వేదికగా బుధవారం జరిగిన 'హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్' మహాసభలో ఆమె చేసిన ప్రసంగం సభా ప్రాంగణాన్ని ఆలోచింపజేస్తూనే, పోరాట కాంక్షను రగిల్చింది. ఓబీసీలను కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తూ వారి ఉనికిని విస్మరిస్తున్న పాలకుల తీరుపై ఆమె నిప్పులు చెరిగారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, తెలంగాణ బీసీ రైట్స్ ఫోరమ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా వచ్చిన బహుజన మేధావులు, విద్యార్థి లోకం సమక్షంలో ఆమె కేంద్ర, రాష్ట్ర సర్కార్లకు ముక్కుసూటి హెచ్చరికలు జారీ చేశారు.

రూ. 50 లక్షల కోట్ల బడ్జెట్‌లో మన వాటా బఠాణీ గింజంతేనా?

దేశంలో సగానికిపైగా ఉన్న బహుజనుల వాస్తవ పరిస్థితిని కవిత కళ్లకు కట్టారు. "దేశ వార్షిక బడ్జెట్ అక్షరాలా రూ. 50 లక్షల కోట్లు. కానీ ఇందులో సగానికిపైగా ఉన్న ఓబీసీల కోసం కేటాయించేది కనీసం రూ. 2 వేల కోట్లు కూడా దాటదు. అంటే దేశ సంపదలో ఓబీసీ బిడ్డకు దక్కేది కనీసం ఒక్క బఠాణీ గింజంత కూడా లేదు. ఈ దారుణమైన అన్యాయం ఇంకెన్నాళ్లు?" అని ఆమె గళమెత్తారు. రూ. 12 వేల కోట్లు వెచ్చించి జనగణన చేపడుతున్న కేంద్రం, ఓబీసీల లెక్క తేల్చడానికి మాత్రం ఎందుకు వెనకాడుతోందని నిలదీశారు. ప్రధాని మోదీ పేరుకే బీసీ అని, వాస్తవానికి ఆయన హయాంలోనే రిజర్వేషన్ల ఎత్తివేతకు వ్యవస్థాగత కుట్ర జరుగుతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

అసెంబ్లీ తీర్మానం చేయండి... లేదంటే జనగణనను స్తంభింపజేయండి!

బీసీల హక్కుల సాధనలో తమిళనాడు ప్రభుత్వం చూపిన తెగువను తెలంగాణ సర్కార్ ఆదర్శంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. "రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి, జనగణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్, డ్రాప్ డౌన్ బాక్స్ పెట్టాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. కేంద్రం మొండిచేయి చూపిస్తే... తెలంగాణ గడ్డపై జనగణన అడుగుపెట్టకుండా అడ్డుకునే అధికారం రాష్ట్రానికి ఉంది. ఆ పోరాటంలో రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలుస్తారు" అని స్పష్టం చేశారు. గతంలో మహిళా బిల్లు సాధన కోసం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద తాము చేసిన ఉద్యమ తరహాలోనే, నవంబర్‌లో జరిగే ఓబీసీల ధర్నాలో ప్రత్యక్షంగా పాల్గొని కేంద్రం మెడలు వంచుతామని హెచ్చరించారు.

తరతరాల ఆత్మగౌరవ పోరుకు ఐక్యతే మార్గం

డాక్టర్ రామ్ మనోహర్ లోహియా, కాన్షీరాం, కర్పూరీ ఠాకూర్, ములాయం సింగ్, జేపీ కుశ్వా వంటి బహుజన యోధుల త్యాగాలను ఆమె స్మరించుకున్నారు. "నూరు శాతం ఉన్న సమాజంలో కేవలం పది మంది మాత్రమే సమస్త వనరులను అనుభవిస్తూ, తొంభై శాతం ఉన్న ప్రజలను ఇంకా అణచివేతలోనే ఉంచాలనే కుట్ర సాగుతోంది. ఈ అన్యాయాన్ని బద్దలు కొట్టాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఏకతాటిపైకి రావాలి. విడిపోతే పాలకుల కుట్రలకు బలవుతాం... కలిసుంటేనే మన హక్కులను రక్షించుకోగలం" అని కర్తవ్యబోధ చేశారు.

కవిత తుఫాన్‌లో మోదీ పీఠం కదలడం ఖాయం: ప్రొఫెసర్ సూరజ్ మండల్

ఈ సభలో బీపీ మండల్ మనవడు, ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ మాట్లాడుతూ... దేశంలో సగానికి పైగా ఉన్న బీసీల గళాన్ని ఢిల్లీ పీఠంపై వినిపిస్తున్న కల్వకుంట్ల కవిత త్వరలోనే తెలంగాణ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఆమె లేవనెత్తిన ఈ సామాజిక ఉద్యమ సైక్లోన్ ప్రధాని మోదీ కుర్చీని కదిలించివేస్తుందని వ్యాఖ్యానించారు. అత్యున్నత న్యాయస్థానాలు, ప్రధానమంత్రి కార్యాలయం వంటి కీలక వ్యవస్థల్లో ఓబీసీల ప్రాతినిధ్యం శూన్యంగా మారిందని తమిళనాడు ఓబీసీ పార్టీ నేత తిరు రత్న సభాపతి ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్: ప్రధాన డిమాండ్లు

దేశవ్యాప్తంగా తక్షణమే సమగ్ర కులగణన చేపట్టాలి; ప్రత్యేక ఓబీసీ కాలమ్, యూనిక్ కోడ్ అమలు చేయాలి. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఓబీసీలకు తగిన వాటా కల్పించాలి. 1931 గణాంకాల ప్రాతిపదికన 50 శాతానికి పైగా రిజర్వేషన్లు కేటాయించాలి. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితి (సీలింగ్)ని రాజ్యాంగబద్ధంగా తొలగించాలి. విద్యారంగంలో, విశ్వవిద్యాలయాల్లో సామాజిక న్యాయం అమలుతో పాటు ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు వర్తింపజేయాలి. తెలంగాణలో బీసీలకు 42 శాతం, మధ్యప్రదేశ్‌లో 27 శాతం రిజర్వేషన్లు వెంటనే అమల్లోకి తేవాలి.

భూదాన్ భూములు, రీసర్వే, భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి

- రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 28 విజన్ ఆంధ్ర : భూదాన్ భూములు, రీ సర్వే, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), కలెక్టరేట్ పరిపాలన అధికారులతో భూధాన్ భూములు, రీ సర్వే ప్రక్రియ, కోర్టు కేసులు, భూ సేకరణ, జి.ఓం. 59, 76, 118 ల సంబంధిత పెండింగ్ దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, విజిలెన్స్, ఇంటలిజెన్స్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ భూదాన్ భూములకు సంబంధించిన నివేదిక, భూముల రీసర్వే ప్రక్రియ పురోగతి, న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత కేసులు, భూసేకరణ అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. యు ఎల్ సి భూములు, జి.ఓ. 59, 76, 118 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించి సంబంధిత దరఖాస్తులను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి, రికార్డులను అనుసరించి వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాలకు సంబంధించిన కేసుల పురోగతి వేగవంతం చేయాలని, భూ పరిపాలనకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో రీ సర్వే పనులు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, భూభారతి పెండింగ్ దరఖాస్తులు నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, బి, డి సెక్షన్ల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం

- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి .అక్టోబర్ 28: (విజన్ ఆంధ్ర) : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీకి చెందిన చాగంటి పూల కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2,00,000/- రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన మంజూరి పత్రాన్ని తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబానికి అందచేసిన పీఏసీ చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి ,నాయి నేని చంద్రకాంత్ రావు, రాధాబాయి మరియు తదితరులు పాల్గొన్నారు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 ఆఖరు గడువు

- అర్హులంతా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి - కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా అర్హులైన ప్రతి పట్టభద్రుడు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 31వ తేదీకి ముందు పట్టభద్రులైన (డిగ్రీ పూర్తి చేసిన) వారు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు నమోదుకు అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన వారు 2026 నవంబర్ 6వ తేదీలోగా ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌తో పాటు నేరుగా సంబంధిత ఆర్డీఓ కార్యాలయం లేదా తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తులను అందజేయవచ్చని తెలిపారు. చివరి నిమిషం వరకు వేచి చూసి ఇబ్బంది పడకుండా, అర్హులైన ప్రతి పట్టభద్రుడు వెంటనే స్పందించి ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యాపర్ల ప్రాథమిక పాఠశాలలో 'ఈ-వేస్ట్' సేకరణ

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం ప్రభుత్వ ఆదేశానుసారం యాపర్ల ప్రాథమిక పాఠశాలలో బుధవారం 'ఈ-వేస్ట్' సేకరణ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సురక్షిత నిర్వహణపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభించింది.

ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ : పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ తమ ఇళ్లలో వ్యర్థంగా మారిన వివిధ రకాల ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించి పాఠశాలలో అప్పగించారు. పర్యావరణాన్ని రక్షించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, భాగ్యలక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయులు మురళి కృష్ణ, బుసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా సాగిన "దసరా పురస్కారాలు", 'కళాకారు టీవీ' ఐకాన్ అవార్డుల ప్రధానం

హైదరాబాద్ అక్టోబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్ : ప్రముఖ డాన్స్ శిక్షణ సంస్థ 'సిరాజ్ డాన్స్ అకాడమీ', కళాకారు టీవీ ఆధ్వర్యంలో ప్రఖ్యాత డాన్స్ కొరియోగ్రాఫర్ ఈవెంట్ ఆర్గనైజర్, సిరాజ్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు, డాన్స్ మాస్టర్ డాక్టర్. ఎస్. కె. సిరాజ్ నేతృత్వంలో సిరాజ్ డాన్స్ అకాడమీ 99వ కార్యక్రమం కనువిందు చేసింది. దసరా పురస్కారాలు – 2026, కళాకారు ఐకాన్ అవార్డ్స్ పురస్కారాల ప్రధానోత్సవం పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమం ఆనందోత్సవాల మధ్య పండుగలా జరిగింది. శనివారం సాయంత్రం రవీంద్ర భారతి మెయిన్ హాల్, సైఫాబాద్ హైదరాబాద్ లో నేత్రపర్వంగా నిర్వహించిన ఈ పురస్కారాలు ప్రధానం కార్యక్రమంలో సినీ, టీవీ, ప్రముఖులకు, ఆర్టిస్టులకు, నృత్య కళాకారులకు "దసరా పురస్కారాలు, కళాకారు టీవీ ఐకాన్ పురస్కారాలను" సిరాజ్ డాన్స్ అకాడమీ పక్షాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిస్ ఆసియా ఇంటర్నేషనల్, మిస్ ప్లానెట్ ఇండియా, మిస్ ఏపీ 'రక్ష్మి ఠాకూర్' హాజరై టీవీ యాక్ట్రెస్ కరిష్మా నాయుడు, చకిలం స్వప్న శ్రీనివాస్, ఫౌండర్ మేము సైతం యువసేన ఫౌండేషన్ సోనీ, యాంకర్, నటి తెలుగు టీవీ యాక్ట్రెస్ సింగం శెట్టి సింధు, నటి,నిర్మాత రోజా ఖుషి, నటి,బిగ్ బాస్ ఫేమ్ కిర్రాక్ సీత, తెలుగు టీవీ నటివడ్డి మహేశ్వరి, తెలుగు టీవీ నటి నవీన కొంజర్ల ఇతర సినిమా, టీవీ డైరెక్టర్లు ఆర్టిస్టులు, టెక్నీషియన్లు కళాకారులకు 'కళాకార్ ఐకాన్ అవార్డు' అందజేసి ఘనంగా సత్కరించి. శుభాకాంక్షలు తెలిపారు. కళాకారుల ప్రతిభను గుర్తించి వారికి సరైన ప్లాట్ఫామ్ ని కలుగజేసి ప్రోత్సహిస్తున్న కార్యక్రమ నిర్వాకుడు డాక్టర్ ఎస్.కె. సిరాజ్ ను ఈ రక్ష్మి ఠాకూర్' సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ నృత్య అకాడమీ ల నుంచి చిన్నారులు వివిధ నృత్యాంశాలపై అద్భుతంగా ప్రదర్శించి అందరి ప్రశంశలను అందుకున్నారు.

బాలాజీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ విద్యార్థులతో నశాముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ.



ములుగు అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మత్తు వద్దు – మనం మారుదాం, దేశాన్ని మారుద్దాం అనే నినాదంతో ములుగు కలెక్టరేట్ లో జరిగిన నశాముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిట్స్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డా. అల్లెం అప్పయ్య, ప్రధాన కార్యదర్శి కొట్టె రాజిరెడ్డి, కోశాధికారి శిరుప సతీష్ కుమార్, లిబిట్స్ ప్రిన్సిపాల్ ఎం.డి. ముజీబ్‌లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు పచ్చిగడ్డి సాగును ప్రోత్సహించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ఉపాధి హామీ పనుల విస్తరణ
- వి.బి.జి. రాంజీ పథకంపై మంత్రి సీతక్క ఉన్నత స్థాయి సమీక్ష



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : వి.బి.జి. రాంజీ పథకం కింద రైతులు పశువులకు పచ్చిగడ్డి సాగు చేసి లబ్ధి పొందేలా తగిన చర్యలు తీసుకోవాలని వనపర్తి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ డి. దివ్య దేవరాజన్, ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్లు, డీఆర్డీఓ పీడీలు, సర్పంచులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించడం, వి.బి.జి. రాంజీ పథకం అమలుపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

వలసల నివారణ – ఉపాధి పనులు

ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా పడక పంటలు ఎండిపోతున్న దృష్ట్యా, గ్రామీణ కూలీలకు, రైతులకు వి.బి.జి. రాంజీ కింద ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని మంత్రి సీతక్క సూచించారు. దీనివల్ల కూలీ దొరకడంతో పాటు మెటీరియల్ కాంపోనెంట్ కింద సీసీ రోడ్లు, మ్యారేజ్ హాల్స్ వంటి అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు.

నిధుల విడుదలపై భరోసా

ఈ పథకం కింద చేసిన పనులకు పది రోజుల్లోనే డబ్బులు ఖాతాలో జమ అవుతాయని, కాబట్టి సర్పంచులు ఎలాంటి భయం పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇచ్చిన ప్రతి పనిని కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులు – ఆదర్శ గ్రామాలు

పాఠశాల భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, వీఓ భవనాలు, గోదాములు, కమ్యూనిటీ హాల్స్ వంటి పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన ప్రతి గ్రామానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా కోటి రూపాయల నిధులు అందజేయబడతాయని పేర్కొన్నారు.

పచ్చిగడ్డి సాగుకు ఆర్థిక సాయం

పశువుల తాగునీటి కోసం నీటి కుంటలు, చెక్ డ్యాముల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. రైతులు లేదా గ్రామ సంఘం ద్వారా పశువులకు పచ్చిగడ్డి సాగు చేస్తే ఎకరాకు రూ. 14,000 ప్రభుత్వం ద్వారా అందజేయడం జరుగుతుందని, రైతులు ఈ సాయంతో పాటు గడ్డిని అమ్ముకుని అదనపు లబ్ధి పొందవచ్చని చెప్పారు.

జిల్లాలో చేపడుతున్న చర్యలు

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వనపర్తి అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి చెరువు, కెనాల్‌లో పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్మాణంలో ఉన్న వీఓ భవనాలు, అదనపు గదులు, అంగన్వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేస్తామన్నారు. పని దినాలు పెంచేందుకు ప్రతి 50 మంది కూలీలకు ఒక మేట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో నీటితొట్లు, పశుగ్రాసం పెంపకంతో పాటు నీటి సంరక్షణ కోసం వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీడీ డీఆర్డీఓ ఉమాదేవి, జెడ్పీ సీఈవో యాదయ్య, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరమణ, అడిషనల్ డీఆర్డీఓ రామమహేశ్వర్ రెడ్డి, డీపీఓ రఘునాథరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీ శంషిగూడ డివిజన్‌లో బీజేపీ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం

శేరిలింగంపల్లి. అక్టోబర్ 28: (విజన్ ఆంధ్ర) : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ లోని పార్టీ కార్యాలయం లో బీజేపీ సంస్థాగత కమిటీల నిర్మాణం, రాబోయే రాజకీయ కార్యక్రమాలపై విస్తృత స్థాయి సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి & శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్‌చార్జ్ ఆలే భాస్కర్, రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య నేతలు మాట్లాడుతూ పార్టీ కేడర్‌కు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాక సందర్భంగా నిర్వహించనున్న మహా పాదయాత్ర మరియు పర్యటనను చారిత్రక స్థాయిలో విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత కోసం ప్రతి డివిజన్‌లో నూతన కార్యవర్గాలు, ఎగ్జిక్యూటివ్ కమిటీల నియామకాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని విజయపథంలో నిలపడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను డివిజన్ల వారీగా వేగవంతం చేయాలన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్‌చార్జ్ ఆలే భాస్కర్ మాట్లాడుతూ డివిజన్ కమిటీలు, బూత్ స్థాయి కార్యకర్తలు సమన్వయంతో కదిలినప్పుడే అనుకున్న విజయాలు సాధ్యమవుతాయన్నారు. పార్టీ నిర్ణయించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి విధానాలను వివరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మహిపాల్ రెడ్డి , రవీందర్ రావు ,వంశీ రెడ్డి ,బాలు యాదవ్,రఘు ,రాజు, అనిల్ గౌడ్ నర్సింగ్ యాదవ్, సీతారామరాజు ,కృష్ణంరాజు డివిజన్ అధ్యక్షులు, నూతన కార్యవర్గ సభ్యులు, వివిధ మోర్చాల బాధ్యులు, పార్టీ సీనియర్ నాయకులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నియంత్రణపై శిక్షణ

ములుగు అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని ఐ డి ఓ సి లో కీటక జనిత వ్యాధుల నియంత్రణపై ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణ, సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్వో డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ.. మలేరియా, డెంగ్యూ నియంత్రణలో ఆరోగ్య కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమని, జ్వర పీడితుల రక్త నమూనాల సేకరణ, నీటి నిల్వల గుర్తింపు, యాంటీ లార్వా స్ప్రే, ఫాగింగ్ లను గ్రామ పంచాయతీ సిబ్బందితో సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ఉప డి ఎం హెచ్ వో డాక్టర్ సుధీర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవితేజ, ఏ ఎం ఓ దుర్గారావు తదితరులు రికార్డుల నిర్వహణ, గర్భిణీలకు రక్త పరీక్షలు, సికిల్ సెల్ పరీక్షలపై శిక్షణ ఇచ్చారు.

మహిళలు, బాలికలపై అఘాయిత్యాల దర్యాప్తు వేగవంతం చేయాలి

- డీఐజీ విశ్వజిత్ కంపటి
- పోక్సో, అత్యాచార కేసుల దర్యాప్తు 60 రోజుల్లో పూర్తి కావాలి
- వనపర్తి ఎస్పీ డి.సునీతారెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : మహిళలు మరియు బాలికలపై జరిగే లైంగిక నేరాల కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా కేసులను కొలిక్కి తీసుకురావాలని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఐ/సీ డీఐజీ విశ్వజిత్ కంపటి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన జిల్లా మహిళా భద్రతా విభాగం పనితీరు, ఆర్థిక నిర్వహణ, భరోసా కేంద్రాల పనితీరు, లైంగిక నేరాల కేసుల దర్యాప్తు పురోగతిపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. అత్యాచారం, పోక్సో కేసుల్లో కచ్చితంగా నిర్ణీత గడువులోగా, ముఖ్యంగా 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఇట్ససో (ఇన్వెస్టిగేషన్ ట్రాకింగ్ సిస్టమ్ ఫర్ సెక్సువల్ అఫెన్సెస్) వ్యవస్థను పూర్తిస్థాయిలో, సమర్థవంతంగా వినియోగించుకోవాలని, దర్యాప్తులో ఎలాంటి జాప్యం జరగడానికి వీలేదని తేల్చిచెప్పారు. అదేవిధంగా భరోసా కేంద్రాల ద్వారా బాధిత మహిళలు, బాలికలకు మెరుగైన సహాయ సహకారాలు అందించాలని, కేంద్రాల నిర్వహణను మరింత పటిష్టంగా కొనసాగించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వనపర్తి జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డి మాట్లాడుతూ.. మహిళా భద్రతకు సంబంధించిన ప్రతి అంశంలో జిల్లా అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాల విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా, దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వనపర్తి డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, భరోసా ఎస్సై అంజద్, షీమ్ టీమ్‌లు, భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలు

- విద్యార్థుల ప్రతిభకు సైకం శ్రీనివాస్ రెడ్డి ప్రోత్సాహం.

ములుగు అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లా విద్యాశాఖ పాపులేషన్ సెల్ ఆధ్వర్యంలో గోవిందరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన లిజిల్లా సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ సైకం శ్రీనివాస్ రెడ్డిలి విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకంగా మాట్లాడారు. జానపద కళలు మన సంస్కృతికి ప్రతీకలని, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు. విద్యతో పాటు సాంస్కృతిక రంగంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. సైకం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తుండడం అభినందనీయమని ఉపాధ్యాయులు కొనియాడారు.

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన జ్వాలా చారిటబుల్ ట్రస్ట్

ములుగు అక్టోబర్ 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కమలాపురం మాలవాడకు చెందిన జెట్టి సుమిత్ర (భర్త కుమారస్వామి లేటు) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేక కుటుంబ సభ్యులు లిజ్వాలా చారిటబుల్ ట్రస్ట్‌లి ను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన లిజ్వాలా ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్‌లి సోషల్ మీడియా ద్వారా దాతల సహకారం కోరగా, దాతలు స్పందించి రూ.14,000 సమకూరింది. ఆ మొత్తాన్ని ట్రస్ట్ సభ్యులు బాధిత కుటుంబానికి అందజేశారు. జ్వాలా ట్రస్ట్ చేస్తున్న సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గోలి నరేష్, గంగుల చంటి, నిమ్మల నరేష్, మావిళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్‌రెడ్డి
- వనపర్తి జిల్లాలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్ - 2026' ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు
- పోక్సో చట్టంపై బాలికలకు దిశానిర్దేశం..
- సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర) : బాలికలు ప్రతి రంగంలోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా నాగవరం తండాలోని బాలికల గురుకుల పాఠశాలలో 'నల్సా - సురక్షిత్ బచ్పన్ అభియాన్ - 2026' (పోక్సో-2012)లో భాగంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పోక్సో-2012 చట్టం గురించి విద్యార్థినులకు పలు ముఖ్య సూచనలు చేశారు. ఆధునిక కాలంలో ఇంటర్నెట్, సోషల్ మీడియా యాప్‌లను అవసరమైన మేరకే ఉపయోగించుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. బాలికలకు ఎలాంటి ఆపద తలెత్తినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 లేదా 15100 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించి సహాయం పొందవచ్చని వివరించారు.

విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన

ఇదే కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికర సంస్థ సెక్రటరీ కె. దీప వనపర్తి హరిజనవాడలోని జిల్లా పరిషత్ పాఠశాల, అలాగే ఘన్‌పూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, మోడల్ పాఠశాలల్లో సురక్షిత్ బచ్పన్ అభియాన్ (పోక్సో చట్టం-2012)పై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. విద్యార్థినులకు వారి హక్కులు, చట్టపరమైన రక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెళ్లు డి. కృష్ణయ్య, రఘు, శ్రీదేవి, డీసీపీఓ రాంబాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వనజ, జిల్లా విద్యా శాఖ సీఎంఓ బి. ప్రతాప్ రెడ్డి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్‌లు తదితరులు పాల్గొన్నారు.

'సీల్వెల్, శృతిలయ' సమర్పణలో 'అక్కినేని మీడియా ప్రతిభా పురస్కారాలు' ప్రధానం

హైదరాబాద్ అక్టోబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : ప్రముఖ 'శృతిలయ ఫౌండేషన్' న్యవస్థాపక కార్యదర్శి, ప్రఖ్యాత నవరస గాయని,'ఆమని' నేతృత్వంలో, సీల్వెల్ కార్పొరేషన్ సంయుక్త సమర్పణలో నిర్వహించిన "సీల్ వెల్ సినీ సుస్వరాలు - 91" వ కార్యక్రమంలో భాగంగా అక్కినేని సినీ హిట్స్ పాటల కార్యక్రమం అలాగే,"అక్కినేని మీడియా ప్రతిభా పురస్కారాలు - 2026" ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆనందోత్సాహాల మధ్య గొప్ప వేడుకలా జరిగింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మంగళవారం, రవీంద్రభారతి ప్రధాన మందిరం, సైఫాబాద్ హైదరాబాద్ లో అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించిన ఈ అక్కినేని మీడియా ప్రతిభా పురస్కారాల ప్రధాన కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మాజీ పోలీస్ హౌసింగ్, బోర్డ్ చైర్మన్, తెలంగాణ కోలేటి దామోదర్, సభాధ్యక్షుడుగా ఎక్స్' రైట్ యాక్ట్ కమీషనర్ పి. విజయ బాబు, గౌరవ అతిథిగా టిజిఒ' స్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస రావు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞ శర్మ, వ్యవస్థాపకుడు, ఆదర్శ ఫౌండేషన్ కుసుమ భోగరాజు, ఇతర ప్రముఖులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు."అక్కినేని సీల్వెల్ శృతిలయ మీడియా ప్రతిభా పురస్కారాలు", అక్కినేని మీడియా ప్రతిభా జీవన సాఫల్య పురస్కారాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో రఘురాములు, అసోసియేట్ ఎడిటర్, నమస్తే తెలంగాణ, ఎడిటర్, మహా న్యూస్ జి. కృష్ణ మూర్తి, డాక్టర్ మారం శ్రీనివాస్ అసోసియేట్ ఎడిటర్ ఆంధ్రప్రభ తెలుగు డైలీ' కలకు 'లైఫ్ టైం అచ్చివ్మెంట్ అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే అక్కినేని స్ఫూర్తి పురస్కారాలను ప్రభాకర్, స్పెషల్ కరెస్పాండంట్ టీవీ 9, సతీష్ చీఫ్ ఎడిటర్ 99టీవీ, వి. మంజుల సీనియర్ చీఫ్ రిపోర్టర్ , సాక్షి తెలుగు డైలీ, అక్షయ ఎన్ టీవీ, విజయ చంద్రిక ఏబీఎన్, సంధ్య సీనియర్ న్యూస్ ప్రెసెంటర్ 10టీవీ, ప్రియాంక 99 టీవీ, ధనలక్ష్మి బిగ్ టీవీ, బి. అరుణ్ కుమార్ 'వి6 వెలుగు ' సీనియర్ రిపోర్టర్, జి. బ్రాహ్మిణి న్యూస్ ప్రెసెంటర్ ఐ న్యూస్ ప్రతినిధులకు పురస్కారాలను ప్రధానం చేసి సత్కరించారు. చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కార్యక్రమ నిర్వాహకురాలు గాయని 'ఆమని' ని ప్రశంశించి, అభినందించారు. ఈ సందర్భంగా నవరస గాయని ఆమని తో పాటుగా గాయనీ గాయకులు శ్రవణానందకరంగా ఆలపించిన "సీల్ వెల్ సినీ సుస్వరాలు" అక్కినేని సినీ హిట్స్ పాటల కార్యక్రమం సంగీత ప్రియులను, ప్రేక్షకులను విశేషంగా అలరించింది. శ్రుతి అకాడమీ చిన్నారులు కనుల పండుగ ప్రదర్శించిన నృత్య విభావరి ఆకట్టుకుంది. గాయకుడు వినయ్ బాబు ఈ కార్యక్రమానికి చక్కటి వ్యాఖ్యానాన్ని అందించారు.

బియ్యం ధరల నియంత్రణకు సహకరించాలి

- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

- అనవసర అపోహలు, వదంతులను వ్యాప్తి చేయవద్దు

- రైస్ మిల్లర్లు, ట్రేడర్లతో సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, అక్టోబర్ 28 :(విజన్ ఆంధ్ర) బియ్యం ధరలను నియంత్రణలో ఉంచేందుకు రైస్ మిల్లర్లు, బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాల విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించి బియ్యం ధరలను పెంచేందుకు ప్రయత్నించినా, అక్రమ నిల్వలకు పాల్పడినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల అతిక్రమణకు పాల్పడే ట్రేడర్ల లైసెన్సులు రద్దు చేసేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం రైస్ మిల్లర్లు, ట్రేడర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛ విపణిలో బియ్యం ధరలు, వాటి క్రయ విక్రయాలు, సన్న బియ్యం సేకరణ స్టాక్ వివరాలు తదితర అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు నిత్యావసరమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. మార్కెట్‌లో బియ్యం లభ్యత, ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ బియ్యం క్రయ విక్రయాలలో ఎలాంటి అంతరాయాలు ఏర్పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ కొరత ఉన్నట్లు చూపించడం, ఉద్దేశపూర్వకంగా సరఫరాను తగ్గించడం, ధరలను కృత్రిమంగా పెంచేందుకు ప్రయత్నించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా తమ వ్యాపార కార్యకలాపాలను నిర్వహించాలని, నిల్వలు, కొనుగోళ్లు, విక్రయాల విషయంలో నిబంధనలు తుచ తప్పక పాటించాలని సూచించారు. బియ్యం ధరలు, నిల్వలు, సరఫరాకు సంబంధించి ప్రజల్లో అనవసర ఆందోళన కలిగించే రీతిలో అపోహలు, వదంతులను వ్యాప్తి చేయవద్దని కలెక్టర్ కోరారు. వాస్తవ పరిస్థితులను నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడటంతో పాటు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించేందుకు వ్యాపారులు సహకరించాలని అన్నారు. జిల్లాలో బియ్యం ధరలు, నిల్వలు, సరఫరా పరిస్థితులను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. మార్కెట్‌లో ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు అందిన వెంటనే తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా అనవసర అపోహలకు గురై అవసరానికి మించి బియ్యం నిల్వలను కొనుగోలు చేయవద్దని కలెక్టర్ హితవు పలికారు. బియ్యం ధరల స్థిరత్వానికి జిల్లా యంత్రాంగం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజల అవసరాలకు సరిపడా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయని భరోసా కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రేడర్లు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి జాతీయ ఎస్టీ కమిషన్ కృషి

- జాటోతు హుస్సేన్ నాయక్

నిజామాబాద్, అక్టోబర్ 28 :(విజన్ ఆంధ్ర) గిరిజనుల సమస్యల పరిష్కారానికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ) అంకిత భావంతో కృషి చేస్తోందని కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు కూడా నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని ఆయన సూచించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి జాతీయ కమిషన్ ద్వారా చర్యలు చేపట్టవచ్చనే దాని గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్, సిరికొండ మండలంలోని సర్పంచ్ తండా, గడ్డమీది తండా, కొండాపూర్, గోప్యాతండాను, నవీపేట మండలంలోని మాన్ సింగ్ తండాలను సందర్శించారు. పై ప్రాంతాల్లో గిరిజనులతో మమేకమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. ఇంకనూ అందుబాటులోకి రావాల్సి ఉన్న మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి (ఐడీఓసీ) చేరుకుని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యలతో కలిసి, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమం, హౌసింగ్, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, రహదారులుభవనాలు, అటవీ, రెవెన్యూ, విద్య, వ్యవసాయం, మున్సిపల్ పరిపాలన, ఎక్సైజ్, పోలీసు శాఖలకు సంబంధించిన సమస్యలపై గిరిజనులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారి సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్హులైన గిరిజనులకు జాప్యానికి తావు లేకుండా పక్కా ఇళ్లను కేటాయించాలని, విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని అన్నారు. గిరిజన మారుమూల గ్రామాల్లో, తండాల్లో ఎక్కడైనా రక్షిత మంచి నీటి వసతి లేకపోతే, జల్ జీవన్ మిషన్ కింద ప్రతిపాదనలు పంపాలని, కేంద్రం వెంటనే నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. రోడ్లు, విద్యా, వైద్యం తదితర సేవల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని సంబంధిత అధికారులకు సూచించారు. కాగా, తండాల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే స్థానిక అధికారులను సంప్రదించాలని, ప్రజావాణి వంటి ఫిర్యాదుల పరిష్కార వేదికలకు ముందుగా తమ సమస్యలను తెలియజేయాలని, పరిష్కారం లభించని పక్షంలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను ఆశ్రయించవచ్చని హుస్సేన్ నాయక్ గిరిజన సంఘాల ప్రతినిధులకు సూచించారు. కమిషన్‌కు సంబంధించిన ఎన్‌సీఎస్‌టీ గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందజేయవచ్చని తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి కమిషన్ ఉచితంగా, వేగవంతమైన విధానంలో చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, చాలామందికి ఈ విషయం తెలియదని పేర్కొంటూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కల్యాణ్ రెడ్డి, డీఆర్ఓ గీత, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోనాయిపల్లి బాధితులకు న్యాయం చేయాలి

మనోహరాబాద్ అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర): కోనాయిపల్లి గ్రామంలో దళితులపై జరిగిన దాడికి బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ KVPS, MRPS నాయకులు, బాధితులతో కలిసి మనోహరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా KVPS రాష్ట్ర కమిటీ సభ్యులు యం. అడివయ్య మాట్లాడుతూ.. దాడి జరిగి పది రోజులు గడుస్తున్నా నిందితులను అరెస్టు చేయకపోవడంపై ప్రశ్నించారు. బాధితులకు రక్షణ కల్పించాలని, విచారణ అధికారిని మార్చి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. CITU జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం మాట్లాడుతూ.. జిల్లాలో దళితులపై దాడులను అరికట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మహేందర్ రెడ్డి, వీఃహా నాయకులు శ్రీనివాస్, బాధితులు నర్సింహులు, ప్రవీణ్, గురుదాసు, నిరంజన్ దాసు, నవీన్, మల్లేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు - మన భవిష్యత్తు!

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలి

- గోలి శ్రీనివాస్ రెడ్డి పిలుపు

- కల్వకుర్తిలో ముఖ్య నాయకుల సమావేశం

- పట్టభద్రుల ఓటర్ నమోదుపై దిశానిర్దేశం!

తెలంగాణ స్టేట్ బ్యూరో, కల్వకుర్తి, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 28: ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు అందరూ సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశం పట్టభద్రుల ఓటర్ నమోదు ఉద్యమానికి నాంది పలికింది.

ఓటర్ నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియలో అర్హులైన ప్రతి పట్టభద్రుడికి అవగాహన కల్పించి, వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు కృషి చేయాలని గోలి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కల్వకుర్తి పట్టణం, కల్వకుర్తి మండలం, వెల్దండ మండలాల్లోని గ్రామాలు, వార్డుల వారీగా నాయకులు బాధ్యతలు తీసుకొని నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. ఎక్కడా నమోదు ఆగకూడదని, ప్రతి ప్రాంతంలోనూ ఉధృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.

సమన్వయంతో పనిచేయాలి

ఓటర్ నమోదు కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని, పట్టభద్రులను నేరుగా కలిసి నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అర్హులైన వారు ఎవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. "ఒక్క పట్టభద్రుడు కూడా మిగలకుండా చూడండి" అని ఆయన నాయకులకు స్పష్టం చేశారు.

ప్రతి గ్రామం, ప్రతి వార్డులో అవగాహన

పట్టణం నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పరస్పర సహకారంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో చిన్న చిన్న సమావేశాలు పెట్టి, పట్టభద్రులకు నమోదు ప్రక్రియ, దాని ప్రాముఖ్యత వివరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకంగా నిలవాలి

పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రక్రియకు ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయడం అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు నాయకులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కల్వకుర్తి ప్రాంతం కీలక పాత్ర పోషించాలన్నదే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు

ఈ సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్సీ ఇన్‌చార్జి రజిని సాయి చందు ముఖ్య అతిథి గా హాజరయ్యారు. వారితో పాటు కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కూడా హాజరై నాయకులకు సూచనలు చేశారు.

భారీగా హాజరైన నాయకులు, పట్టభద్రులు

కార్యక్రమంలో కల్వకుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు దశరథ్ నాయక్, బీ ఆర్ యస్ పార్టీ మాజీ ఇంచార్జ్ విజితా రెడ్డి, వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సాహెద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య, కాటన్ మిల్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, కౌన్సిలర్ రాములు, మాజీ సర్పంచ్ సుశీల ఈశ్వర్, మాజీ సర్పంచులు జంగయ్య, అంజి నాయక్, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జోగయ్య, కొమ్ము శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ హన్మంత్ నాయక్, ఏలికల్ సర్పంచ్ కృష్ణయ్య, తోటపల్లి సర్పంచ్ సత్యనారాయణ, వెంకటాపూర్ సర్పంచ్ రాజు, వేపూర్ సర్పంచ్ నాగరాజు, అజిలాపూర్ సర్పంచ్ రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు శోభ శేఖర్ రెడ్డి, జ్యోతినిరంజన్, మాజీ కౌన్సిలర్ తాహిర్ అలీ, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు రుక్నుదిన్, వార్డు సభ్యులు ముత్యాల నరేష్, కిషోర్, సునీత ఆనంద్ తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టభద్రులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులపై కొనసాగుతున్న కసరత్తు

ఆశావాహుల్లో టెన్షన్... టెన్షన్.

నిజామాబాద్ అక్టోబర్28:(విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను ఈసారైనా భర్తీ చేస్తారా లేదా అన్నది ఉత్కంఠ గా మారింది. పదవులను భర్తీ చేసేందుకు పార్టీ అధిష్టానం కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే ఆశావాహులు నామినేటెడ్ పెదవుల కోసం పైరవీలు సాగిస్తూనే ఉన్నారు. దసరా పండగ తర్వాత నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆశావావుల్లో మరింత టెన్షన్ మొదలైంది. ఇప్పటివరకు నిజామాబాద్ జిల్లా నుండి నాలుగు నామినేటెడ్ పదవులు ఖాళీ అయ్యాయి. దీంతోపాటు నిజామాబాద్ మార్కెట్ కమిటీ, నుడా చైర్మన్ పదవులకు కొత్తవారిని నియమిస్తారన్న ప్రచారం జరుగుతుంది. నామినేటెడ్ పదవులకు సైతం కొత్తవారిని నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మానాల మోహన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి, ఈరవత్రి అనిల్, తదితరుల పోస్టులు ఖాళీ అయ్యాయి. వీరితోపాటు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి సైతం ఖాళీగా ఉంది. కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ పదవి సైతం నియామకం కావాల్సి ఉంది.అయితే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీపీ కేతావత్ యాదగిరి, సుభాష్ జాదవ్, తారాచంద్ నాయక్‌లు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరిలో కేతావత్ యాదగిరికి హై కమాండ్ ఆశీస్సులు ఉండడంతో ఆయనకే పదవి వస్తుంద న్న ప్రచారం పార్టీలో జోరుగా సాగుతుంది. ఇక నుడా చైర్మన్‌కు సైతం నగరానికి చెందిన ముఖ్య నాయ కులు పోటీపడుతు న్నారు. ప్రస్తుతం చైర్మన్గా కొనసాగుతున్న కేశ వేణుతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్, నరేందర్ రెడ్డిలు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు, బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్ష పదవి కోసం మాజీ అధ్యక్షుడు, సుదర్శన్ రెడ్డి ముఖ్య అనుచరుడు కుంట రమేష్ రెడ్డి మరోసారి ఆ పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే సుదర్శన్ రెడ్డి కుంట రమేష్ రెడ్డికి హామీ ఇచ్చిన ట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఇప్పటికే వివిధ పదవుల్లో కొనసాగుతున్న వారికి మరోసారి అవకాశం ఇచ్చే ఆలోచన ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం కొనసాగుతున్న నుడా చైర్మన్ కేశ వేణును కొనసాగించే అవకాశాలున్నట్లు సమాచారం. ఏది ఏమైనా నామినేటెడ్ పోస్టుల భరిత కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం భారీ కసరత్తు చేపట్టింది. దసరా ముగియగానే పదవులను భర్తీ చేస్తామన్న హై కమాండ్ నిర్ణయంతో ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకుంది.

మంచిర్యాల జిల్లాను 'సురక్షిత్ ప్లస్' దిశగా తీసుకువెళ్లేందుకు సమన్వయంతో కృషి చేయాలి.

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 28 విజన్ ఆంధ్ర : మొబిలైజేషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా 'సురక్షిత్' హోదాను సాధించడం అభినందనీయమని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సన్మాన్ సమా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ సురక్షిత్ హోదాను సాధించడంలో జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం కృషి అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో 'సురక్షిత్ ప్లస్' హోదాను సాధించే దిశగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణలో భాగంగా ప్రజలలో అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయిలో మొబిలైజేషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం జరిగిందని తెలిపారు. వివిధ శాఖలు, ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సమిష్టి కృషితో జిల్లాకు గుర్తింపు లభించిందని తెలిపారు. సాధించిన ప్రగతిని కొనసాగిస్తూ, హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ చర్యలను మరింత విస్తృతం చేయాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని అధికారులకు సూచించారు. అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశిత లక్ష్యాలను సాధించడం ద్వారా జిల్లాను 'సురక్షిత్ ప్లస్' హోదా దిశగా తీసుకువెళ్లాలని తెలిపారు. అనంతరం జిల్లాలో 'సురక్షిత్' హోదా సాధించేందుకు విశేష కృషి చేసిన పలువురు సిబ్బందిని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఎంఓ వెంకటేశ్వర్లు, దిశ సి పి ఎం ఎ.నీలిమ, దిశ సిఎస్ఓ రాజేష్, డిఎండిఓ సంతోష్, ఎల్‌డబ్ల్యూఎస్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఆరోగ్య శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 28 విజన్ ఆంధ్ర : భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి, సంబంధిత రికార్డులను పరిశీలిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తో కలిసి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి., తహసిల్దార్లతో భూ సంబంధిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సి సి ఎల్ ఏ ఆదేశాల మేరకు భూదాన్ భూములకు సంబంధించిన దాన పత్రాలు, పంపిణీ పత్రాలను గుర్తించి, భూదాన్ చట్టం ప్రకారం నిర్దేశించిన ఫార్మాట్లలో వివరాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని తెలిపారు. భూ సంబంధిత కోర్టు కేసుల ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన కౌంటర్లు దాఖలు చేయాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు జిఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాలను సమకూర్చుకొని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. జి.ఓ. నంబర్ 59, 76 లకు సంబంధించి ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, భూ భారతి పోర్టల్ ద్వారా అందిన పాత, కొత్త ఫార్మాట్లలోని పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి, సంబంధిత రికార్డుల ఆధారంగా వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పాత ఫార్మాట్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నవంబర్ 10వ తేదీలోగా పరిష్కరించాలని తెలిపారు. కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా గణాంక/ప్రణాళిక అధికారి పాపయ్య లతో కలిసి డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ రాష్ట్ర కన్సల్టెంట్ కె. కృష్ణయ్య, మాస్టర్ ట్రైనర్ శరణ్య ఆధ్వర్యంలో ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు నిర్వహించిన జనగణన సంబంధిత 2 రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన నిర్వహణకు సంబంధించి శిక్షణలో ఏవైనా సందేహాలు ఉంటే శిక్షకులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. జనగణన ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి అవసరమైన అన్ని వివరాలు, రికార్డులతో సిద్ధంగా ఉండాలని, సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు సన్నద్ధతతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఘనంగా ఎస్ఎస్ఎఫ్ ఇన్నోవేట్ 2026 రెండో ఎడిషన్

బయోటెక్ స్టార్టప్‌లలో 95 శాతం వైఫల్యానికి సరైన మార్గదర్శకత్వం, సమాచారం, పెట్టుబడుల కొరతే కారణం: డాక్టర్ ఉదయ్ సక్సేనా

అక్టోబర్ 28, హైదరాబాద్ విజన్ ఆంధ్ర ప్రతినిధి శాస్త్రీయ ఆవిష్కరణలు, నూతన సాంకేతికతలు, స్టార్టప్‌ల అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఎస్ఎస్ఎఫ్ ఇన్నోవేట్ 2026 రెండో ఎడిషన్ బుధవారం హైదరాబాద్‌లోని వెస్టిన్ హైదరాబాద్ మైండ్‌స్పేస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్తలు, వైద్యులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొని శాస్త్రసాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణలు, వ్యాపార అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త, యుటోపియా థెరప్యూటిక్స్ సంస్థ చైర్మన్, చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్ సక్సేనా మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగంలోని స్టార్టప్‌లలో దాదాపు 95 శాతం సరైన మార్గదర్శకత్వం, అవసరమైన సమాచారం, పెట్టుబడులు అందక విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. యువ శాస్త్రవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తగిన సహకారం అందిస్తే వారి ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా మార్చగలమని అన్నారు. ఎస్ఎస్ఎఫ్ మాతృ సంస్థ శ్రీ వెంచర్ పార్ట్‌నర్స్ (ఎస్‌వీపీ)కు చెందిన రాకేశ్ నాయక్, సంజయ్ కుమార్ పల్లెబోయిన, శీతల్ రంగనాథన్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, స్టార్టప్‌లకు కేవలం ఆర్థిక పెట్టుబడులు అందించడమే కాకుండా, అన్ని దశల్లో సమగ్ర సహకారం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. నిధులు, ఆధునిక పరిశోధనా సదుపాయాలు, నిపుణుల మార్గదర్శకత్వం, వ్యాపార సలహాలు, నెట్‌వర్కింగ్ అవకాశాలు, ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకెళ్లేందుకు అవసరమైన సహాయాన్ని ఒకే వేదికపై అందించే వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో షంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 20 ఎకరాల విస్తీర్ణంలో సైన్స్ అండ్ ఇన్నోవేషన్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌వీపీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ ప్రాజెక్టుకు త్వరలో భూమిపూజ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ చికిత్స, ఆధునిక వైద్య సాంకేతికతలు, ఆహార భద్రత, కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి కీలక అంశాలపై చర్చలు జరిగాయి. శాస్త్రీయ ప్రతిభను ప్రోత్సహించడం, నూతన స్టార్టప్‌లను అభివృద్ధి చేయడం, పరిశోధనలను ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చడం ఎస్-ఎస్ఎఫ్ ఇన్నోవేట్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.